ప్రకటనల కోసం సంప్రదించండి
98483 28698

తెలంగాణ స్వరాష్ట్ర సమరయోధ పత్రిక
Estd : 2002
# జనంసాక్షి
www.janamsakshi.org
శుక్రవారం 17.10.2025 | సంపుటి : 12 సంచిక : 87 | పేజీలు : 12 వెల : రూ. 4/-
RNI NO.TELTEL / 2013 /50370




హైదరాబాద్ | Simultaneously Published from Hyderabad & Karimnagar | ఎడిటర్ : ఎం.ఎం. రహమాన్

డిసెంబర్ 1 నుంచి 9 వరకు

# ప్రజాపాలన ప్రజా విజయోత్సవాలు

## ప్రజా ప్రభుత్వం ఏర్పడి రెండేళ్లయిన సందర్భంగా వేడుకలు

**స్థానిక ఎన్నికల్లో పోటీకి ఇద్దరు పిల్లల నిబంధన తొలగింపు**



- ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అధ్యక్షతన మంత్రివర్గ సమావేశం కీలక నిర్ణయం
- కేబినెట్ వివరాలు మీడియాకు వెల్లడించిన మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి

**హైదరాబాద్(జనంసాక్షి):** డిసెంబరు 1 నుంచి 9వ తేదీ వరకు ప్రజాపాలన – ప్రజా విజయోత్సవాలు నిర్వహించాలని తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. ప్రజా ప్రభుత్వం ఏర్పడి రెండు సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా ఉత్సవాలు నిర్వహించాలని మంత్రి వర్గ సమావేశంలో నిర్ణయించారు. సీఎం రేవంత్ రెడ్డి

మిగతా 2లో..

బీసీ రిజర్వేషన్‌పై న్యాయనిపుణుల సలహాలతో

## ముందుకెళ్తాం

**హైదరాబాద్(జనంసాక్షి):** ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అధ్యక్షతన సచివాల యంలో మంత్రి వర్గ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా బీసీ రిజర్వేషన్ల అంశంలో తదుపరి కార్యాచరణపై చర్చ జరిగింది. సుప్రీం కోర్టులో ఎస్‌ఎల్‌పీ డిస్మిస్ కావడంతో తదుపరి కార్యాచరణపై చర్చించారు. న్యాయ నిపుణుల సూచనల మేరకు తదుపరి కార్యాచరణ చేపట్టాలని నిర్ణయించారు. న్యాయ నిపుణుల అభిప్రాయాలతో రెండ్రోజుల్లో నివేదిక ఇవ్వాలని సీఎం ఆదేశించినట్టు సమాచారం.

బీసీలకు రిజర్వేషన్లు



స్పెషల్ లీవ్ పిటిషన్‌పై

# విచారణకు నిరాకరించిన సుప్రీంకోర్టు

**పాత పద్ధతిలోనే స్థానిక సంస్థల ఎన్నికలకు వెళ్లాలని సూచన**

- హైకోర్టు విచారణపై జోక్యం చేసుకోలేమన్న ధర్మాసనం
- 50%కు మించి రిజర్వేషన్లను ఆమోదించలేమని వ్యాఖ్య

**న్యూఢిల్లీ(జనంసాక్షి):** సుప్రీంకోర్టులో తెలంగాణ ప్రభుత్వానికి చుక్కెదురైంది. బీసీ రిజర్వేషన్లపై రాష్ట్ర ప్రభుత్వం దాఖలు చేసిన స్పెషల్ లీవ్ పిటిషన్ ఎస్‌ఎల్‌పీని సర్వోన్నత న్యాయస్థానం కొట్టేసింది. 50 శాతం రిజర్వేషన్లతోనే ఎన్నికలకు వెళ్లండని ప్రభుత్వానికి సుప్రీంకోర్టు సూచించింది. పాత రిజర్వేషన్లతో ఎన్నికలకు వెళ్లాలని సర్వోన్నత న్యాయ స్థానం ఆదేశించింది. సుప్రీంకోర్టు ఆదేశా లతో సంబం ధం లేకుండా తదుపరి విచారణ చేపట్టాలని ధర్మాసనం హైకోర్టుకు సూచించింది. స్థానిక ఎన్నికల్లో బీసీ రిజర్వేషన్ల అంశంపై తెలంగాణ ప్రభుత్వం దాఖలు చేసిన స్పెషల్ లీవ్ పిటిషన్‌ను విచారణకు సుప్రీంకోర్టు నిరాక రించింది. ఈ అంశం హైకోర్టులో పెండింగ్‌లో ఉన్నం దున విచారణకు స్వీకరించలేమని అత్యున్నత న్యాయ స్థానం స్పష్టం చేసింది. తమ ఆదేశాలతో సంబం ధం లేకుండా తదుపరి విచారణ చేపట్టాలని.. మెరిట్స్ ప్రకా రం విచారించాలని హైకోర్టుకు సూచించింది. కావాల నుకుంటే పాత రిజర్వేషన్ల ఆధారంగా స్థానిక ఎన్నికలకు వెళ్లవచ్చని పేర్కొంది.



మిగతా 2లో..

ఓట్ల అవకతవకలపై

## ఈ సమయంలో ఈసీకి ఆదేశాలివ్వలేం

**జూబ్లీహిల్స్ ఓట్ల చోరీ పిటిషన్‌పై విచారణ ముగించిన హైకోర్టు**

**హైదరాబాద్(జనంసాక్షి):** జూబ్లీహిల్స్ నియోజకవర్గం ఓటర్ల జాబితాలో అక్రమాలు చోటు చేసుకున్నాయంటూ భారత రాష్ట్ర సమితి అభ్యర్థి మాగంటి సునీత, మాజీ మంత్రి కేటీఆర్ దాఖలు చేసిన పిటిషన్‌పై హైకోర్టు సీజే ధర్మాసనం విచారణ ముగించింది. పిటిషనర్లు చేసిన ఫిర్యాదులను చట్టప్రకారం పరిశీలిస్తున్నామని ఎన్నికల కమిషన్ తరఫు న్యాయవాది చెప్పినందున ప్రత్యేకంగా ఎలాంటి ఆదేశాలు ఇవ్వలేమని హైకోర్టు ఉత్తర్వుల్లో పేర్కొంది.పిటిషనర్ల తరఫున సుప్రీంకోర్టు సీనియర్ న్యాయవాది దామా శేషాద్రి నాయుడు వాదనలు వినిపించారు.

మిగతా 2లో..



## మీడియా ముందుకెళ్లొద్దు

**కొండా సురేఖకు మీనాక్షి నటరాజన్ ఫోన్!**

**హైదరాబాద్(జనంసాక్షి):** తెలంగాణ మంత్రి కొండా సురేఖతో ఏఐసీసీ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌ఛార్జ్ మీనాక్షి నటరాజన్ ఫోన్‌లో మాట్లాడారు. మీడియా ముందుకు వెళ్లవద్దని కొండా సురేఖకు ఆమె సూచించారు. కూర్చొని మాట్లాడదామని మీనాక్షి నటరాజన్ చెప్పినట్లు

మిగతా 2లో..




32వేల అడుగుల ఎత్తు నుంచి

## ఫ్రీ-ఫాల్ జంప్ సక్సెస్

- స్వదేశీ మిలిటరీ కంబాట్ పారాచూట్ వ్యవస్థలో ఘననీయమైన అభివృద్ధి
- డీఆర్‌డీవోపై రాజ్‌నాథ్ ప్రశంసలు
- స్వావలంబన వైపునకు ఒక అద్భుతమైన మైలురాయిగా ప్రశంస

**న్యూఢిల్లీ(జనంసాక్షి):** స్వదేశీ మిలిటరీ కంబాట్ పారాచూట్ వ్యవస్థను అభివృద్ధి చేసినందుకు డీఆర్‌డీఓపై రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ ప్రశంసలు కురిపించారు. ఈ పారాచూట్ వ్యవస్థను రక్షణ సాంకేతికతలో స్వావలంబన వైపునకు ఒక అద్భుతమైన మైలురాయిగా అభివర్ణించారు. ఈ మేరకు డీఆర్‌డీఓను అభినందిస్తూ

మిగతా 2లో..

రష్యా నుంచి భారత్ ఇకపై

# చమురు కొనదు

**ఈ విషయమై మోడీ నాకు హామీ ఇచ్చారు**

**మరోసారి ట్రంప్ సంచలన వ్యాఖ్యలు**

**వాషింగ్టన్(జనంసాక్షి):** రష్యా నుంచి భారత్ చమురు కొనుగోళ్లపై అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ కీలక వ్యా ఖ్యలు చేశారు. ఇకపై రష్యా నుంచి భారత్ చమురు కొను గోలు చేయదని.. ఈమేరకు ప్రధాని మోదీ తనకు హామీ ఇచ్చారని ట్రంప్ చెప్పారు. ఉక్రెయిన్ యుద్ధానికి సంబం ధించి రష్యాను ఒంటరిని చేయడంలో ఇదొక కీలక అడుగని అభివర్ణించారు. ప్రధాని మోదీ గొప్ప వ్యక్తి అంటూ పొగడ్తలతో ముంచెత్తారు.రష్యా నుంచి భారత్ చమురును దిగుమతి చేసుకోవడంపై ప్రధాని మోదీ వద్ద తాను ఆందోళన వ్యక్తం చేశానని ట్రంప్ చెప్పారు. మాస్కో నుంచి భారత్ చమురు కొనడం వల్ల ఉక్రెయిన్‌పై యుద్ధం కొనసాగించేందుకు పుతిన్ ఆ నిధులు ఉపయోగిస్తున్నారని అమెరికా భావిస్తున్నదని తెలిపారు. ఈ కొనుగోళ్లపై తాను సంతోషంగా లేనని చెప్పాను. ఈ సందర్భంగా ఇక నుంచి రష్యా నుంచి చమురు కొనుగోలు చేయమని ప్రధాని మోదీ ఈరోజు తనకు హామీ ఇచ్చారని. ఇదొక కీలక ముందడుగు అని చెప్పారు. చైనా కూడా రష్యా ఆయిల్‌ను కొనకుండా చేస్తానని, ఇక అదే

మిగతా 2లో..



**ట్రంప్ - మోదీల మధ్య సంభాషణ జరగలేదు**


స్పష్టం చేసిన భారత విదేశాంగశాఖ

2లో..

# ఛత్తీస్‌గఢ్ సర్కారుకు లొంగిపోయిన ఆశన్న



- 170 మంది మావోయిస్టులు లొంగిపోయారు
- వారిలో వారిలో వాసుదేవరావు తదితరులు
- ప్రకటించిన హోంమంత్రి అమిత్ షా
- కేంద్ర ప్రభుత్వ చర్యలతో భారీ సంఖ్యలో సభ్యులు ఆయుధాలను విడిచిపెడుతున్నారని వెల్లడి



**బీజాపూర్(జనంసాక్షి):** మావోయిస్టు అగ్రనేత, పార్టీ కేంద్ర కమిటీ సభ్యుడు తక్కళ్ళపల్లి వాసుదేవరావు అలియాస్ ఆశన్న లొంగిపోయినట్లు పోలీసులు ప్రకటించారు. కేంద్ర ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలతో భారీ సంఖ్యలో మావోయిస్టులు తమ ఆయుధాలను విడిచి పెడుతున్నారని హెూంమంత్రి అమిత్ షా ఎక్స్ వేదికగా వెల్లడించారు.గురువారం ఛత్తీస్‌గఢ్‌లో 170 మంది మావోయిస్టులు లొంగిపోయిన విషయాన్ని ఆయన తెలిపారు. 70కి పైగా ఆయుధాలను పోలీసులకు అప్పగించారు.కాగా, మావోయిస్టుల లొంగుబాటు పరంపర కొనసాగుతోంది. ఆ పార్టీ అగ్రనేత మల్లోజుల వేణుగోపాల్ రావు అలియాస్ అభయ్ మహారాష్ట్ర ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడ్నవీస్ ఎదుట బుధవారం లొంగిపోగా... అదే బాటలో మరో అగ్రనేత తక్కళ్లపల్లి వాసుదేవరావు అలియాస్ ఆశన్న సైతం ఇవాళ లొంగిపోయారు. బుధవారం ఛత్తీస్‌గఢ్‌లోని వేర్వేరు జిల్లాల్లో మొత్తం 78 మంది మావోయిస్టులు లొంగిపోయారు. సుక్మా జిల్లాలో 27 మంది లొంగిపోగా, ఇందులో పది మంది మహిళా మావోలు ఉన్నారు. కాంకేర్ జిల్లాలో 32 మంది మహిళా మావోయిస్టులతో కలిపి మొత్తంగా 50 మంది అజ్ఞాతం వీడారు.ఇందులో మావోయిస్టు పార్టీలో కీలకమైన దండకారణ్య స్పెషల్ జోనల్ కమిటీకి చెందిన రాజమన్ మండావి అలియాస్ రాజ్‌మోహన్, రాజు సలామ్ అలియాస్ శివప్రసాద్ కూడా ఉన్నారు. 50 మంది మావోయిస్టుల బృందాన్ని ప్రత్యేక బస్సులో కాంకేర్ తరలించి అక్కడ లొంగుబాటు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇక్కడ 7 ఏకే 47లతో పాటు మరో 17 ఇతర ఆయుధాలను పోలీసులకు అప్పగించారు. ఇక కొండగావ్ జిల్లాలో మరో మహిళా మావోయిస్టు లొంగిపోయింది. శాంతిచర్చలపై

మిగతా 2లో..

## గుజరాత్ ప్రభుత్వంలో అనూహ్య పరిణామం

**సీఎం మినహా మొత్తం మంత్రివర్గం రాజీనామా**

**అహ్మదాబాద్(జనంసాక్షి):** గుజరాత్ ప్రభుత్వంలోని మంత్రులంతా రాజీనామా చేశారు. ముఖ్యమంత్రి భూపేంద్ర పటేల్ మినహా మిగతా వారంతా పదవిని వీడారు మంత్రివర్గ పునర్వ్యవస్థీకరణకు వీలుగా మంత్రులు ఈ నిర్ణయం తీసుకున్నారు. శుక్రవారం మధ్యాహ్నం నూతన క్యాబినెట్ కొలువుదీరనుంది.గురువారం ముఖ్యమంత్రి నివాసంలో నేతలంతా సమావేశమయ్యారు. ఆ భేటీలో భాజపా జాతీయ ప్రధాన

మిగతా 2లో..



## 21శతాబ్దం భారత్‌దే

- కర్నూలు సభలో మోదీ
- జిఎస్టీ సంస్కరణలతో పేదలకు మేలు
- ఓకల్ ఫర్ లోకల్ నినాదంతో సాగాలి
- డ్రోన్ టెక్నాలజీలో కర్నూలుకు స్థానం
- గూగుల్ రాకతో విశాఖ దశ మారుతుందని వెల్లడి

**కర్నూలు(జనంసాక్షి):** జిఎస్టీ సంస్కరణలతో పేదలకు మేలు జరుగుతోందని, అయితే అది ఓకల్ ఫర్ లోకల్ కావాలని ప్రధాని మోదీ అభిలషించారు. డ్రోన్ టెక్నాలజీకి కర్నూలు కేంద్రం కాబోతోందన్నారు. మరోవైపు.. ఆపరేషన్ సిందూర్ ప్రపంచానికి మన సైనిక బలాన్ని నిరూపించింది. అందులో దేశీయ టెక్నాలజీ అద్భుతంగా పనిచేసిందన్నారు. ఇది మన ఆత్మనిర్భరతకు గర్వకారణమన్నారు. కర్నూలు శివారులోని నన్నూరు వద్ద 'సూపర్ జీఎస్టీ–సూపర్ సేవింగ్స్' పేరుతో ఏర్పాటు చేసిన బహిరంగ సభకు సీఎం చంద్రబాబు, గవర్నర్ జస్టిస్ అబ్దుల్ నజీర్,

మిగతా 2లో..

ట్రంప్ ఒత్తిడికి

## తలొగ్గిన మోదీ

**పదేపదే ప్రశంసలే ఇందుకు నిదర్శనం: రాహుల్ గాంధీ**

**న్యూఢిల్లీ(జనంసాక్షి):** అమెరికా అధ్యక్షుడు ట్రంప్ హెచ్చరికలకు ప్రధాని మోడీ లొంగిపోయారని విపక్షనేత రాహుల్ గాంధీ ఆరోపించారు. భారత్ రష్యా నుంచి చమురు కొనుగోలు చేయొద్దని, చేస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరిస్తున్నా, మోడీ నుంచి సమాధానం లేదన్నారు. ఈ బెదిరింపు చర్యల్లో భాగంగానే అమెరికా భారత్‌పై పెద్దఎత్తున సుంకాల్ని విధించిన సంగతి తెలిసిందేనన్నారు. ఈ నేపథ్యంలో భారత్ అమెరికాకు తలొగ్గి రష్యా నుంచి ఆయిల్‌ని కొనుగోలును నిలిపివేస్తున్నట్లు తనకు హామీ ఇచ్చిందని అమెరికా అధ్యక్షుడు వ్యాఖ్యానించారు. ట్రంప్ వ్యాఖ్యలపై లోక్‌సభ ప్రతిపక్షనేత రాహుల్‌గాంధీ అభ్యంతరం వ్యక్తం చేశారు. ట్రంప్‌కి మోడీ భయపడిపోయారని రాహుల్ ఆరోపించారు. దీనికి తాజా సంఘటనలే తార్కాణమని రాహుల్ ఎక్స్ పోస్టులో పేర్కొన్నారు. భారత్ రష్యా నుంచి ఆయిల్ కొనుగోలు చేయదని ట్రంప్ నిర్ణయానికి మోడీ అనుమతించడం,. భారత్‌పై వివాదాస్పద వ్యాఖ్యలు ట్రంప్ చేస్తున్నప్పటికీ.. ప్రధాని మోడీ ట్రంప్‌కి పదేపదే అభినందనలు తెలుపుతూ సందేశాలు పంపడం ఏమిటన్నారు. ఆర్థికమంత్రి అమెరికా పర్యటనను రద్దు చేసుకోవడం, ఈజిప్టు షర్మ్ ఎల్ షేక్‌లో జరిగిన గాజా శాంతి శిఖరాగ్ర సమావేశానికి హాజరుకాకపోవడం,ఆపరేషన్ సింధూర్ సమయంలో ట్రంప్ జోక్యం చేసుకుని యుద్ధాన్ని ఆపానని చెబుతున్నప్పటికీ

మిగతా 2లో..



చిన్నారులతో అసభ్యకరమైన కంటెంట్ ఉంటే

# నేరమే..

**చట్టప్రకారం చర్యలు తప్పవు : సిపి సజ్జనార్**

- వ్యూస్ మాయలో విలువలు మరిచిపోతే ఎలా ?
- చిన్నారుల భవిష్యత్‌ను పణంగా పెట్టడం సమంజసమా!
- ఇలాంటి వాటిని వెంటనే తొలగించాలని హెచ్చరిక

**హైదరాబాద్(జనంసాక్షి):** వ్యూస్ మాయలో పడి విలువలు మరిచిపోతే ఎలా అని హైదరాబాద్ పోలీస్ కమిషనర్ వీసీ సజ్జనార్ యూ ట్యూబర్లను ప్రశ్నించారు. వ్యూస్, లైక్స్‌తో సోషల్ మీడియాలో ఫేమస్ అయ్యేందుకు చిన్నారుల భవిష్యత్‌ను పణంగా పెట్టడం ఎంతవరకు సమంజసమని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. మైనర్లతో కొన్ని యూట్యూబ్ ఛానళ్లు చేస్తున్న ఇంటర్వ్యూలను ఉద్దేశిస్తూ ఎక్స్‌లో సజ్జనార్ పోస్ట్ పెట్టారు. చిన్నారులతో అసభ్యకరమైన కంటెంట్ చేస్తూ సభ్య సమాజానికి ఏం సందేశం ఇస్తున్నారని నిలదీశారు. చిన్నారులు, యువతకి స్ఫూర్తినిచ్చే, ఆదర్శంగా నిలిచే వ్యక్తులను ఇంటర్వ్యూలు చేసి సమాజాభివృద్ధికి దోహదం చేయండి. అంతేకానీ.. ఇలాంటి వీడియోలు

మిగతా 2లో..



## నిమిషప్రియ కేసులో స్టే కొనసాగుతోంది

మరణశిక్ష అమలుపై సుప్రీం కోర్టుకు కేంద్రం వివరణ

9లో..



సచివాలయంలో 'తెలంగాణ స్టేట్ పోలీస్ కంప్లైంట్స్ అథారిటీ' వెబ్ సైట్, లోగోను ఆవిష్కరించిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి. హాజరైన మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు, డీజీపీ శివధర్ రెడ్డి, హెూం శాఖ స్పెషల్ సీఎస్ సీవీ ఆనంద్, సీజీజీ డీజీ రవి గుప్త, ఇంటలిజెన్స్ ఏడీజీ విజయ్ కుమార్, ఎస్పీసీఏ చైర్మన్ రిటైర్డ్ జస్టిస్ శివ శంకర్ రావు, సభ్యులు, ఉన్నతాధికారులు.



గచ్చిబౌలి ఏఐజీ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న ఎమ్మెల్యే ప్రేమ్ సాగర్ రావును పరామర్శించిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క. వైద్యులతో మాట్లాడి ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్న సీఎం.

# ఈ సమయంలో ఈసీకి ఆదేశాల్విలేం

జూబ్లీహిల్స్ అసెంబ్లీ నియోజకవర్గంలో ఒకే వ్యక్తికి రెండు ఓట్లు ఉన్నాయని.. ఇలా 1942కు పైగా ఓట్లను గుర్తించినట్లు కోర్టుకు తెలిపారు. జూబ్లిహిల్స్ నియోజకవర్గానికి సంబంధంలేని 12వేలకు పైగా ఓట్లు జాబితాలో ఉన్నాయన్నారు. అనుమానాస్పద ఓట్లు, బోగస్ ఓట్లు, ఒకరికి ఒకటి కంటే ఎక్కువ ఓట్ల వివరాలను ఈ నెల 13న ఎన్నికల అధికారుల దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోలేదన్నారు.ఎన్నికల కమిషన్ తరఫున దేశాయ్ అవినాశ్ రెడ్డి వాదనలు వినిపించారు. ఓటర్ల జాబితా నిరంతర ప్రక్రియ అని, 365 రోజుల పాటు ఓటర్ల నమోదు, తొలగింపు, సవరణ జరుగుతూనే ఉంటుందని వివరించారు. జూబ్లీహిల్స్ నియోజకవర్గానికి సంబంధించి ఓటర్ల జాబితాను ఈ ఏడాది జులైలో ప్రచురించి అభ్యంతరాలు కోరామని ఆయన కోర్టుకు తెలిపారు. అప్పుడు ఎలాంటి అభ్యంతరాలు రాలేదన్నారు. నోటిఫికేషన్ విడుదలైన తర్వాత పిటిషనర్లు అత్యవసర పిటిషన్ దాఖలు చేశారని, ఎన్నికల కమిషన్ అభ్యంతరాలను పరిశీలిస్తున్న సందర్భంలోనూ దాఖలు చేసిన పిటిషన్‌కు విచారణార్హత లేదని వాదించారు. ఈ నెల 21వ తేదీ వరకు అభ్యంతరాలను పరిగణనలోకి తీసుకొని పరిశీలిస్తామని... ఈ మేరకు జిల్లా ఎన్నికల అధికారిని వివరణ కూడా అడిగినట్లు ఆయన కోర్టుకు తెలిపారు. ఇరువైపులా వాదనలు పూర్తైన తర్వాత పిటీషన్లపై విచారణ ముగించినట్లు హైకోర్టు ఉత్తర్వులు జారీ చేసింది. పిటిషనర్ల ఫిర్యాదులను పరిశీలిస్తున్నామని ఎన్నికల కమిషన్ పేర్కొన్నందున ప్రత్యేక ఆదేశాలివ్వాల్సిన అవసరం లేదని ధర్మాసనం పేర్కొంది.

# 32వేల అడుగుల ఎత్తు నుంచి ఫ్రీ-ఫాల్ జంప్ సక్సెస్



సోషల్ మీడియా సింగ్ పోస్ట్ చేశారు.డీఆర్‌డీఓపై రాజ్‌నాథ్ సింగ్ ప్రశంసలు "దేశానికి గర్వకారణమైన క్షణం! డీఆర్‌డీఓ స్వదేశీ మిలిటరీ కంబాట్ పారాచూట్ వ్యవస్థను అభివృద్ధి చేసింది. దీంతో భారత్ 32,000 అడుగుల నుంచి ఫ్రీ-ఫాల్ జంప్‌ను విజయవంతంగా పూర్తి చేసింది. కీలకమైన రక్షణ సాంకేతికతలో స్వావలంబన వైపునకు ఇదొక అద్భుతమైన మైలురాయి." అని రాజ్?నాథ్ ఎక్స్ పోస్ట్?లో పేర్కొన్నారు. అలాగే తాము అభివృద్ధి చేసిన మిలిటరీ కంబాట్ పారాచూట్ వ్యవస్థను విజయవంతంగా పరీక్షించామని డీఆర్‌డీఓ సైతం ఓ ప్రకటనలో తెలిపింది.దేశీయంగా మిలిటరీ కంబాట్ పారాచూట్ వ్యవస్థను డీఆర్‌డీఓ అభివృద్ధి చేయడంతో భారత్ మరో ప్రధాన రక్షణ మైలురాయిని అందుకున్నట్లు అయ్యింది. స్వదేశీ మిలిటరీ కంబాట్ పారాచూట్ సిస్టమ్ (ఎంసీపీఎస్)ను 32,000 అడుగుల ఎత్తు నుంచి విజయవంతంగా పరీక్షించారు.

# వెంకటేశ్, రానాలకు చుక్కెదురు

## న్యాయస్థానానికి రావాల్సిందేనన్న నాంపల్లి కోర్టు

**హైదరాబాద్(జనంసాక్షి):** ఫిల్మ్‌నగర్ దక్కన్ కిచెన్ హెూటల్ కూల్చివేత కేసుపై నాంపల్లి కోర్టులో విచారణ జరిగింది. ఈ సందర్భంగా సినీ నటులు దగ్గుబాటి వెంకటేశ్, రానా, అభిరామ్, సురేశ్ బాబు నవంబర్ 14న తప్పనిసరిగా న్యాయస్థానానికి రావాలని ఆదేశించింది. పర్సనల్ బాండ్ సమర్పించేందుకు కచ్చితంగా రావాల్సిందేనని స్పష్టం చేసింది. కోర్టు ఆదేశాలను ధిక్కరించి దక్కన్ హెూటల్ కూల్చివేశారన్న ఆరోపణలతో సినీనటులు దగ్గుబాటి వెంకటేశ్, రానా, అభిరామ్‌తోపాటు నిర్మాత దగ్గుబాటి సురేశ్‌పై గతంలో కేసు నమోదైన విషయం తెలిసిందే

# లాలూకు రాహుల్ ఫోన్..

## సీట్ల ఒప్పందంపై మంతనాలు

**న్యూఢిల్లీ(జనంసాక్షి):** బీహార్‌లో నవంబర్‌లో జరగనున్న ఎన్నికలకు సమయం సమీపిస్తుండటంతో రాజకీయపార్టీల్లో సందడి నెలకొంది. ఈ నేపథ్యంలో ప్రతిపక్ష కూటమిలో సీట్ల కేటాయింపు చర్చల్లో ప్రతిష్టంభన నెలకొంది.దీనిని పరిష్కరించేందుకు కాంగ్రెస్ అగ్రనేతలు రాహుల్ గాంధీ, మల్లికార్జున్ ఖర్గే గురువారం రాష్ట్రీయ జనతాదళ్ (ఆర్జేడీ) అధినేత లాలూ ప్రసాద్ యాదవ్‌తో నేరుగా మాట్లాడారని పార్టీ వర్గాలు తెలిపాయి. పోటీ విషయంలో ఒక ఒప్పందాన్ని ఖరారు చేయాలని ఇరు పార్టీలు లక్ష్యంగా పెట్టుకున్నాయని సమాచారం.బీహార్ ఎన్నికలకు సంబంధించి మొదటి దశ నామినేషన్లు ఇప్పటికే ప్రారంభమయ్యాయి. అయినప్పటికీ కీలక మిత్రపక్షాలైన ఆర్జేడీ, కాంగ్రెస్ మధ్య ఇంతవరకూ సీట్ల కేటాయింపు విషయంలో ఏకాభిప్రాయం కుదరలేదు. తొలుత ఆర్జేడీ తన మిత్రపక్షం కాంగ్రెస్‌కు 52 సీట్లు ఇచ్చింది. అయితే దానిని కాంగ్రెస్ తిరస్కరించింది. కనీసం 60 నియోజకవర్గాలు కావాలని పట్టుపట్టింది. ఈ నేపథ్యంలో రాష్ట్ర స్థాయి కాంగ్రెస్ నేతలు- ఆర్జెడీ మధ్య చర్చలు నిలిచిపోయినట్లు సమాచారం. దీంతో రెండు పార్టీల జాతీయ నాయకత్వం సీట్ల ప?త్రిష్టంభనను తొలగించేందుకు రంగంలోకి దిగింది.అయితే ఆర్జేడీ నేతలు కాంగ్రెస్ 61 సీట్ల డిమాండ్‌ను నెరవేర్చడానికి ముందుకు వచ్చినప్పటికీ, కాంగ్రెస్ పట్టుబట్టిన కొన్ని కీలక నియోజకవర్గాలపై విభేదాలు మొదలయ్యాయని సమాచారం. నర్కటియగంజ్, వాసాలిగంజ్, కహల్గావ్ స్థానాలలో పోటీ విషయంలో ఆర్జేడీ, కాంగ్రెస్ మధ్య ఏకాభిప్రాయం కుదరలేదని తెలుస్తోంది. చైన్పూర్, బచ్వారాలలో ఇదే పరిస్థితి నెలకొన్నదని సమాచారం. కాగా రాహుల్ గాంధీ తాను చేపట్టిన ఓటరు అధికార్ యాత్ర రాష్ట్రంలో తమకు అవకాశాలను పెంచుతుందని నమ్ముతూ మరిన్ని సీట్లు కోరుతున్నారని తెలుస్తోంది.మీడియాకు ప్రాథమికంగా తెలిసిన సమాచారం ప్రకారం కాంగ్రెస్ 61 సీట్లతో సరిపెట్టుకునేందుకు అంగీకరించింది.

# డిసెంబరు 1 నుంచి 9వరకు ప్రజాపాలన- ప్రజా విజయోత్సవాలు

అధ్యక్షతన సచివాలయంలో మంత్రి వర్గ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా బీసీ రిజర్వేషన్ల అంశంలో తదుపరి కార్యాచరణపై చర్చ జరిగింది. సుప్రీం కోర్టులో ఎస్ఎల్‌పీ డిస్మిస్ కావడంతో తదుపరి కార్యాచరణపై చర్చించారు. న్యాయ నిపుణుల సూచనల మేరకు తదుపరి కార్యాచరణ చేపట్టాలని నిర్ణయించారు. న్యాయ నిపుణుల అభిప్రాయాలతో రెండు రోజుల్లో నివేదిక ఇవ్వాలని సీఎం ఆదేశించినట్టు సమాచారం.

**స్థానిక ఎన్నికల్లో పోటీకి ఇద్దరు పిల్లల నిబంధన తొలగింపు**

స్థానిక ఎన్నికల్లో పోటీకి ఇద్దరు పిల్లలు నిబంధనపై తెలంగాణ కేబినెట్ కీలక నిర్ణయం తీసుకుంది. ఇద్దరు పిల్లల నిబంధన తొలగించాలని మంత్రి వర్గం నిర్ణయించింది. సీఎం రేవంత్‌రెడ్డి అధ్యక్షతన గురువారం సచివాలయంలో మంత్రివర్గ సమావేశం జరిగింది. కేబినెట్ నిర్ణయాలను మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి మీడియాకు వివరించారు. పలు రంగాలకు భూ కేటాయింపులు జరిపేందుకు కేబినెట్ ఆమోదం తెలిపిందన్నారు. మద్దతు ధరతో పాటు సన్నవడ్లకు బోనస్ కూడా ఇస్తామన్నారు."రాష్ట్రంలో కొత్తగా 3 వ్యవసాయ కళాశాలల ఏర్పాటుకు కేబినెట్ ఆమోదం తెలిపింది. నల్సార్‌లో స్థానిక విద్యార్థులకు 50శాతం సీట్లు ఇవ్వాలని కేబినెట్ తీర్మానించింది. నల్సార్ వర్సిటీకి గతంలో ఇచ్చిన దానికంటే అదనంగా 7 ఎకరాలు ఇస్తాం. రైతులు పండించిన ధాన్యం మొత్తం కొనుగోలు చేయాలని నిర్ణయించాం. కేంద్రం కొనుగోలు చేసినా.. చేయకపోయినా మా ప్రభుత్వం కొనుగోలు చేస్తుంది. ప్రజాపాలనకు రెండేళ్లు పూర్తవుతున్న సందర్భంగా ఉత్సవాలు నిర్వహిస్తాం. దీనికి సంబంధించి కేబినెట్ సబ్ కమిటీ వేశాం. హైదరాబాద్ మెట్రోకు సంబంధించి కేబినెట్‌లో సుదీర్ఘంగా చర్చించాం. మెట్రో రెండో దశను క్షుణ్ణంగా పరిశీలించేందుకు సీఎస్ ఛైర్మన్‌గా కమిటీ ఏర్పాటు" అని మంత్రి పొంగులేటి తెలిపారు. ఈ సమావేశానికి మంత్రి కొండా సురేఖ మినహా మిగిలిన మంత్రులందరూ హాజరయ్యారు.పలు అంశాలపై చర్చించారు.

# మీడియా ముందుకెళ్లొద్దు..

సమాచారం.మంత్రి కొండా సురేఖ ఓఎస్డీగా ఉన్న సుమంత్‌ను ఆ బాధ్యతల నుంచి ఇటీవల తప్పించిన విషయం తెలిసిందే. ఉమ్మడి నల్గొండ జిల్లాలోని సిమెంటు కంపెనీల యాజమాన్యాలను ఆయన బెదిరించినట్లు ప్రభుత్వం దృష్టికి రావడంతో గట్టిగా వ్యవహరించాలని నిర్ణయించినట్లు సమాచారం. ఈ పరిణామాల నేపథ్యంలో హైదరాబాద్‌లో కొండా సురేఖ ఇంటికి పోలీసులు వెళ్లారు. సురేఖ నివాసంలో ఆమె మాజీ ఓఎస్డీ సుమంత్ ఉన్నారన్న సమాచారంతో మఫ్టీలో ఉన్న పోలీసులు అక్కడికి చేరుకున్నారు. మంత్రి కుమార్తె సుస్మిత వారిని ప్రశ్నించారు. ఈ క్రమంలో ఆమె మీడియాతో మాట్లాడుతూ తమపై బురదజల్లేందుకు కాంగ్రెస్ పార్టీ పెద్దలే ఇవన్నీ చేయిస్తున్నారని ఆరోపించారు. తన తల్లిదండ్రులనే లక్ష్యంగా చేసుకుని కుట్రలు పన్నుతున్నారని అన్నారు. ఈ పరిణామాల నేపథ్యంలో కొండా సురేఖతో మీనాక్షి నటరాజన్ మాట్లాడినట్లు తెలిసింది. ఈ వ్యవహారాన్ని ఇంతటితో సమసిపోయేట్లు చూద్దామని ఆమె చెప్పినట్లు సమాచారం.

# చిన్నారులతో అసభ్యకరమైన కంటెంట్ ఉంటే నేరమే

వారితో చేసి పిల్లలను పెడదోవ పట్టించవద్దు. గుర్తు పెట్టుకోండి.. ఇది బాలల హక్కుల ఉల్లంఘనే కాదు.. చట్టరీత్యా నేరం. ఇటువంటి చర్యలు పోక్సో, జువైనల్ జస్టిస్ చట్టాలను ఉల్లంఘించడమే అవుతుందని హెచ్చరించారు. పిల్లలను ఇలాంటి కంటెంట్‌లో భాగం చేయడం వారిని వేధించడం కిందికే వస్తుంది. మైనర్లతో ఈ తరహా కంటెంట్ చేసే వారిపట్ల పోలీస్‌శాఖ కఠినంగా వ్యవహరిస్తుంది. బాధ్యులపై చట్టప్రకారం చర్యలు తీసుకుంటుంది. తక్షణమే వీటిని తొలగించుకున్నా.. భవిష్యత్తులో ఇలాంటి కంటెంట్ అప్‌లోడ్ చేసినా చట్టప్రకారం కేసులు నమోదు చేస్తాం అని కూడా హెచ్చరించారు. సోషల్ మీడియాలో ఇలాంటి వీడియోలు మీ దృష్టికి వస్తే వెంటనే రిపోర్టు చేయండి. స్థానిక పోలీసులకు సమాచారం ఇవ్వండి. హెల్ప్‌లైన్ నంబర్ 1930కి గానీ.. జాతీయ సైబర్ క్రైమ్ పోర్టల్‌లో ఫిర్యాదు చేయండని సూచించారు. తల్లిదండ్రులుగా పిల్లలను పెంచడం మాత్రమే కాదు.. వారి బాల్యం, మానసిక ఆరోగ్యం, భవిష్యత్తును కాపాడటం కూడా మీ బాధ్యతే అనే విషయం మరిచిపోవద్దని సజ్జనార్ పేర్కొన్నారు.

# స్పెషల్ లీవ్ పిటిషన్‌పై విచారణకు నిరాకరించిన సుప్రీం



స్థానిక ఎన్నికల్లో బీసీలకు 42శాతం రిజర్వేషన్లు కల్పిస్తూ జారీ చేసిన జీఓ 9పై హైకోర్టు విధించిన స్టేను సవాల్ చేస్తూ తెలంగాణ ప్రభుత్వం సుప్రీంకోర్టులో ఎస్ఎల్‌పీ దాఖలు చేసిన విషయం తెలిసిందే. హైకోర్టు ఈ నెల 9న జారీచేసిన మధ్యంతర ఉత్తర్వులను సవాల్‌చేస్తూ రాష్ట్ర ప్రభుత్వం 13వ తేదీన పిటిషన్ దాఖలుచేసింది. అత్యవసర పరిస్థితుల దృష్ట్యా 16, 17వ తేదీల్లో ఏదో ఒకరోజు ఈ అంశంపై విచారించాలని మంగళవారం సుప్రీంకోర్టు రిజిస్ట్రార్ ముందు మెన్షన్ చేసింది. రాష్ట్ర ప్రభుత్వం కోరినట్లుగానే రిజిస్ట్రీ ఈ కేసును గురువారం విచారణ జాబితాలో చేర్చింది. అయితే సుప్రీంకోర్టు దీనిపై విచారణకు నిరాకరించింది. ప్రభుత్వం దాఖలు చేసిన పిటిషన్‌పై జస్టిస్ విక్రమ్‌నాథ్, జస్టిస్ సందీప్ మెహతాతో కూడిన ధర్మాసనం గురువారం విచారణ జరిపింది. రాష్ట్ర ప్రభుత్వం తరఫున అభిషేక్ సింఘ్వీ వాదనలు వినిపించారు. రిజర్వేషన్లు 50 శాతం మించొద్దనే అభిప్రాయం సరికాదన్నారు. దేశంలో ఎక్కడా లేని విధంగా తెలంగాణలో కులగణన సర్వే జరిగిందని, ప్రభుత్వం ఇంటింటి సర్వే చేసి లెక్క తేల్చిందని సర్వోన్నత న్యాయస్థానంకు వివరించారు. రిజర్వేషన్ల పెంపుపై అసెంబ్లీలో అన్ని పార్టీలు ఏకాభిప్రాయం వ్యక్తం చేశాయని, 3 నెలలు దాటినా బిల్లుపై గవర్నర్ నిర్ణయం తీసుకోలేదని అభిషేక్ సింఘ్వీ వాదించారు. రిజర్వేషన్లు 50 శాతం మించొద్దన్న తీర్పులు స్పష్టంగా ఉన్నాయని, కృష్ణమూర్తి జడ్జిమెంట్ ఈ విషయాన్ని స్పష్టంగా చెప్పిందని ప్రతివాది లాయర్ వాదనలు బలంగా వినిపించారు. అయితే రాష్ట్ర ప్రభుత్వం దాఖలు చేసిన స్పెషల్ లీవ్ పిటిషన్‌ను సుప్రీంకోర్టు తిరస్కరించింది. హైకోర్టులో పెండింగ్‌లో ఉండటంతో విచారణకు స్వీకరించలే మని స్పష్టం చేసింది. కావాలనుకుంటే పాత రిజర్వేషన్ల ఆధారంగా స్థానిక ఎన్నికలకు వెళ్లవచ్చని పేర్కొంది. సుప్రీంకోర్టు నిర్ణయంతో రాష్ట్ర ప్రభుత్వం తదుపరి తీసుకునే చర్యలపై అందరిలో ఉత్కంఠ నెలకొంది.

# 21శతాబ్దం భారత్‌దే

డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్, నారా లోకేశ్ తదితరులు హాజరయ్యారు. రాష్ట్రవ్యాప్తంగా పలుచోట్ల నిర్మించిన, నిర్మించబోతున్న రూ.13,429 కోట్ల విలువైన ప్రాజెక్టులకు ప్రధాని నరేంద్రమోదీ వర్చువల్‌గా ప్రారంభోత్సవాలు, శంకుస్థాపనలు చేశారు.ఈ సందర్భంగా మాట్లాడుతూ .. ఆత్మగౌరవం, సంస్కృతికి నిలయంగా ఆంధ్రప్రదేశ్ ఉందని ప్రధాని నరేంద్ర మోదీ అన్నారు. సైన్స్, ఆవిష్కరణల కేంద్రంగా ఆంధ్రప్రదేశ్ ఉంది. ఏపీలో అనంత అవకాశాలతో పాటు యువతకు అపార శక్తి ఉంది. అహోబిలం నర్సింహస్వామి, మహానంది ఈశ్వరుడికి నమస్కరిస్తున్నా. మంత్రాలయం రాఘవేంద్రస్వామి అందరినీ ఆశీర్వదించాలని కోరుతున్నా. జ్యోతిర్లింగం సోమనాథుడి నేల అయిన గుజరాత్‌లో నేను జన్మించాను. విశ్వనాథుడి భూమి అయిన కాశీకి సేవ చేసే అవకాశం లభించింది. ఇవాళ శ్రీశైలం మల్లికార్జునస్వామి ఆశీస్సులు పొందానని అన్నారు. చంద్రబాబు, పవన్ కల్యాణ్ రూపంలో ఏపీకి శక్తిమంతమైన నాయకత్వం ఉంది. ఏపీకి కేంద్ర ప్రభుత్వం పూర్తి మద్దతు ఉంది. 16 నెలలుగా రాష్ట్రంలో అభివృద్ధి శరవేగంగా జరుగుతోంది. డబుల్ ఇంజిన్ సర్కారు ఆధ్వర్యంలో రాష్ట్రం అపూర్వ ప్రగతి సాధిస్తోంది. దిల్లీ, అమరావతి వేగంగా అభివృద్ధి పథంలో సాగుతున్నాయి. 2047 నాటికి మన దేశం.. వికసిత్ భారత్‌గా మారుతుంది. 21వ శతాబ్దం.. 140 కోట్ల భారతీయుల శతాబ్దం అని ప్రధాని మోదీ అన్నారు. ప్రాజెక్టుల వల్ల రాష్ట్రంలో కనెక్టివిటీ బలోపేతం అవుతుంది. ప్రాజెక్టులతో పరిశ్రమలకు ఊతంతో పాటు జీవన ప్రమాణాలు మెరుగవుతాయి. ఏ దేశమైనా, రాష్ట్రమైనా అభివృద్ధి చెందాలంటే ఇంధన భద్రత కీలకం. ట్రాన్స్‌మిషన్ ప్రాజెక్టులతో దేశం ఇంధన సామర్థ్యం పెరుగుతుంది. గూగుల్ ఏఐ డేటా సెంటర్ ద్వారా సబ్ సీ గేట్‌వేగా ఏపీ మారుతుంది. ఈ ప్రాజెక్టు విశాఖను ఏఐ, కనెక్టివిటీ హబ్‌గా మారుస్తుంది. దీని ద్వారా భారత్‌తో పాటు యావత్ ప్రపంచానికి సేవలు అందుతాయి. భారత్ అభివృద్ధికి ఏపీ అభివృద్ధి చాలా అవసరం. అలాగే ఏపీ అభివృద్ధికి.. రాయలసీమ అభివృద్ధి అంతే అవసరం. ఈ ప్రాజెక్టులు రాయలసీమ లోని ప్రతి జిల్లాలో ఉద్యోగాలు సృష్టిస్తాయన్నారు.

# గుజరాత్ ప్రభుత్వంలో అనూహ్య పరిణామం

కార్యదర్శి సునీల్ బన్సల్ పాల్గొన్నారు. పటేల్, బన్సల్ ప్రతి మంత్రిని విడివిడిగా కలిశారు. రాజీనామా అడిగేముందు అగ్రనాయకత్వం నిర్ణయాన్ని వెల్లడించారని సంబంధిత వర్గాలు వెల్లడించాయి. ఈ రాజీనామాలను ముఖ్యమంత్రి ఆమోదించారు. వ్యవస్థాగత, రాజకీయ సవాళ్లను ఎదుర్కొనే లక్ష్యంతో రాష్ట్ర క్యాబినెట్‌ను పునర్వ్యవస్థీకరించాలనే ప్రణాళికలో భాగంగా ఈ రాజీనామా ప్రక్రియ చోటుచేసుకున్నట్లు పార్టీ నేతలు మీడియాకు వెల్లడించారు. పాత నేతల స్థానంలో కొత్తవారిని తీసుకోనున్నారు. అందుకోసం గవర్నర్ ఆచార్య దేవవ్రత్‌తో సీఎం భేటీ కానున్నారు. కొత్త మంత్రివర్గ ఏర్పాటుకు అనుమతి ఇవ్వాలని ఈ సందర్భంగా కోరనున్నారు. పాతవారిలో హర్ష్ సాంఘ్వీ, రిషికేశ్ పటేల్‌ను తిరిగి మంత్రివర్గంలోకి తీసుకోనున్నట్లు తెలుస్తోంది. ముఖ్యమంత్రితో కలిపి గుజరాత్ మంత్రివర్గ సభ్యుల సంఖ్య 17. వీరిలో ఎనిమిది మందికి క్యాబినెట్ హెూదా ఉంది. గుజరాత్ అసెంబ్లీలో సభ్యుల సంఖ్య 182. నిబంధన ప్రకారం.. గుజరాత్‌లో మంత్రుల సంఖ్య 27 వరకు ఉండొచ్చు. లేకపోతే అసెంబ్లీ సంఖ్యాబలంలో 15 శాతం మందిని మంత్రులుగా నియమించుకునే వీలు ఉంది. ముఖ్యమంత్రి భూపేంద్ర పటేల్ 2021లో తొలిసారి ముఖ్యమంత్రిగా బాధ్యతలు స్వీకరించారు. 2022, డిసెంబర్ 12న రెండోసారి ఆ పదవిని చేపట్టారు.

ఎయిర్ ఇండియా విమానం ప్రమాదం...

# దర్యాప్తులో విశ్వసనీయత పారదర్శకత లోపించింది

## న్యాయం కోసం సుప్రీం కోర్టుకు పైలెట్ తండ్రి

**న్యూఢిల్లీ(జనంసాక్షి):** అహ్మదాబాద్‌లో చోటుచేసుకున్న ఎయిర్ ఇండియా విమాన ప్రమాదంపై జరుగుతున్న దర్యాప్తులో విశ్వసనీయత, పారదర్శకత లోపించిదని ఆరోపిస్తూ దివంగత కెప్టెన్ సుమీత్ సభర్వాల్ తండ్రి పుష్కరాజ్ సభర్వాల్ సుప్రీం కోర్టును ఆశ్రయించారు.241 మంది ప్రయాణికులతో సహా 260 మంది మృతి చెందిన ఘటనపై న్యాయ నిపుణుల పర్యవేక్షణలో విచారణ జరగాలని ఆయన సుప్రీం కోర్టును కోరారు.పుష్కరాజ్ సభర్వాల్, ఫెడరేషన్ ఆఫ్ ఇండియన్ పైలట్స్ (ఎఫ్ఐపీ)అక్టోబర్ 10న సంయుక్తంగా దాఖలు చేసిన ఈ రిట్ పిటిషన్‌లో ఏఐ 171 ప్రమాదంపై దర్యాప్తు చేసేందుకు కోర్ట్ మానిటర్డ్ కమిటీని ఏర్పాటు చేయాలని కోరారు. విమాన ప్రమాద దర్యాప్తు బ్యూరో (ఏఏఐబీ) నిర్వహించిన అన్ని ముందస్తు దర్యాప్తులను మూసివేసినట్లుగా పరిగణిస్తూ, స్వతంత్ర విమానయాన,సాంకేతిక నిపుణులు సభ్యులుగా ఉన్న రిటైర్డ్ సుప్రీంకోర్టు న్యాయమూర్తి నేతృత్వంలోని న్యాయ నిపుణుల కమిటీ పర్యవేక్షణలో విచారణ చేయాలని వారు కోరారు.ప్రమాదంపై దర్యాప్తులో విశ్వసనీయత, పారదర్శకత లేకపోవడంపై పుష్కరాజ్ సభర్వాల్‌తో పాటు ఎఫ్ఐపీ సభ్యులు ఆవేదన చెందుతున్నారని పిటిషన్‌లో పేర్కొన్నారు. బోయింగ్ 787 డిజైన్ స్థాయి లోపాలను పరిశోధించడంలో వైఫల్యం చెందారని, ఇంధన స్విచ్ కదలిక అంటూ పైలట్‌పై నింద మోపారని ఆరోపించారు. ఆరోగ్యం, మానసిక స్థితి లోపం అంటూ కెప్టెన్ సుమీత్ సభర్వాల్ ప్రతిష్టను ప్రతిష్టను దెబ్బతీశారని పేర్కొన్నారు.

# ఛత్తీస్‌గఢ్ సర్కారుకు లొంగిపోయిన ఆశన్న

ముందుగా అభయ్ పేరుతో మల్లోజుల వేణుగోపాల్ రాసిన లేఖ మార్చి 28న వెలుగులోకి వచ్చింది. ఆ తర్వాత నార్త్ వెస్ట్ సబ్‌జోనల్ బ్యూరో ఇన్‌చార్జిగా రూపేశ్ అలియాస్ తక్కెళ్లపల్లి వాసుదేవరావు అలియాస్ నుంచి వరుసగా మూడు లేఖలు విడుదలయ్యాయి. అంతేకాక ఒక యూట్యూబర్‌కు వీడియో ఇంటర్వ్యూ కూడా ఇచ్చారు. అన్ని లేఖల్లోనూ 'శాంతి చర్చల ద్వారా సమస్యలకు పరిష్కారం కనుగొందాం. తుపాకీ కంటే చర్చల ద్వారానే సమస్యలకు సానుకూల పరిష్కారం లభిస్తుంది'అనే అభిప్రాయాన్నే ఆశన్న వ్యక్తంచేశారు. దీంతో మల్లోజుల, ఆశన్న ఒకేదారిలో ఉన్నారనే అభిప్రాయం ఏర్పడింది. అందుకు తగ్గట్టే మల్లోజుల లొంగుబాటును అధికారికంగా ప్రకటించిన మరుసటి రోజే ఆశన్న సైతం లొంగిపోవడం గమనార్హం.తక్కెళ్లపల్లి వాసుదేవరావు స్వస్థలం ములుగు జిల్లా వెంకటాపురం మండలం లక్ష్మీదేవిపేట. హన్మకొండలో పాలిటెక్నిక్ చదువుతూ రాడికల్ ఉద్యమాల వైపు ఆకర్షితుడై 1989లో అజ్ఞాతంలోకి వెళ్లారు. పీపుల్స్‌వార్ గ్రూప్ (పీడబ్ల్యూజీ) చేపట్టిన పలు కీలక యాక్షన్లలో సభ్యుడిగా ఉన్నారు. హైదరాబాద్‌లోని ఎస్ఆర్ నగర్ చౌరస్తాలో 1999 సెప్టెంబర్ 4న ఐపీఎస్ అధికారి ఉమేశ్‌చంద్రను దారికాచి కాల్చి చంపిన ఘటన, ఆ తర్వాత 2000 మార్చి 7న అప్పటి ఉమ్మడి ఏపీ హెూంమంత్రి ఎలిమినేటి మాధవరెడ్డిని ఘట్‌కేసర్ దగ్గర బాంబు పేల్చి చంపిన టీమ్‌లోనూ ఆశన్న ఉన్నారు. అంతేకాక 2003 అక్టోబర్‌లో తిరుపతి సమీపంలోని అలిపిరి దగ్గర సీఎం నారా చంద్రబాబునాయుడిని లక్ష్యంగా చేసుకుని క్లెమోర్ మైన్స్ పేల్చిన తొమ్మిది మంది సభ్యుల బృందానికి ఆశన్నే నాయకత్వం వహించారు. మావోయిస్టు పార్టీకి దశాబ్దాలపాటు అత్యంత కీలక నేతగా వ్యవహరించిన మల్లోజుల వేణుగోపాల్‌రావు మహారాష్ట్ర సీఎం దేవేంద్ర ఫడణవీస్ ముందు లొంగిపోయిన మరుసటి రోజే మరో 170 మంది మావోయిస్టులు ఛత్తీస్‌గఢ్‌లో లొంగిపోయారు. ఈ విషయాన్ని కేంద్ర హెూంమంత్రి అమిత్ షా వెల్లడించారు. 2026 మార్చి 31 నాటికి నక్సలిజాన్ని సమూలంగా నిర్మూలించేందుకు తాము కట్టుబడి ఉన్నామని పునరుద్ఘాటించారు. ఈ మేరకు ఆయన 'ఎక్స్'లో సుదీర్ఘ పోస్టు పెట్టారు. నిన్న ఛత్తీస్‌గఢ్‌లో 27మంది; మహారాష్ట్రలో 61 మంది జనజీవన స్రవంతిలోకి వచ్చారన్నారు. దీంతో రెండు రోజుల వ్యవధిలో 258 మంది లొంగిపోయారన్న అమిత్ షా.. నక్సలిజంపై పోరులో ఇదో పెద్ద విజయమన్నారు. భారత రాజ్యాంగంపై తమ విశ్వాసాన్ని ప్రకటిస్తూ హింసను త్యజించాలనే వీరి నిర్ణయాన్ని అభినందిస్తున్నట్లు అమిత్ షా తెలిపారు. ప్రధాని నరేంద్ర మోదీ నాయకత్వంలోని కేంద్ర ప్రభుత్వం వామపక్ష తీవ్రవాదాన్ని అంతం చేసేందుకు చేస్తున్న ప్రయత్నాల ఫలితాలను ఇది ప్రతిబింబిస్తుందన్నారు. తమ విధానం స్పష్టంగా ఉందన్న అమిత్ షా.. లొంగిపోయేవారిని స్వాగతిస్తామని.. ఇంకా తుపాకీతో ఉద్యమం కొనసాగించాలను కొనేవారు భద్రతా దళాల ఆగ్రహానికి గురికాక తప్పదని హెచ్చరించారు. నక్సలిజం మార్గంలో ఇంకా కొనసాగుతున్న వారు ఆయుధాలను విడిచిపెట్టి జనజీవన స్రవంతిలో చేరాలని మరోసారి విజ్ఞప్తి చేశారు. ఒకప్పుడు వామపక్ష తీవ్రవాద స్థావరాలుగా ఉన్న ఛత్తీస్‌గఢ్‌లోని అబూజ్‌మడ్, ఉత్తర బస్తర్‌లు విముక్తిపొందిన ప్రాంతాలుగా ప్రకటించడం సంతోషదాయకమని తెలిపారు. ఇప్పుడు దక్షిణ బస్తర్‌లో నక్సలిజం జాడ ఉందని.. దీన్ని భద్రతా దళాలు త్వరలో తుడిచిపెడతాయని పేర్కొన్నారు. ఛత్తీస్‌గఢ్‌లో భాజపా సర్కార్ ఏర్పాడిన తర్వాత జనవరి 2024 నుంచి 2,100 మంది మావోయిస్టులు లొంగిపోగా, 1785మందిని అరెస్టు చేశారని తెలిపారు. 477 మందిని భద్రతాదళాలు నిర్మూలించాయని తెలిపారు .లొంగిపోయిన వారిలో సతీష్ అలియాస్ టి. వాసుదేవరావు సహా 10 మంది సీనియర్ మావోయిస్టులు ఉన్నట్లు సమాచారం. లొంగిపోయిన వారి జాబితాలో రాణిత, భాస్కర్, నీలా అలియాస్ నందే, దీపక్ పాలో సహా పలువురు ఉన్నారు. వీరిలో వాసుదేవరావు తలపై రూ.కోటి రివార్డు ఉంది

# రష్యా నుంచి భారత్ ఇకపై చమురు కొనదు

మిగిలి ఉందని తెలిపారు. భారత్, చైనా.. అమెరికాతో కలిసి వస్తే పుతిన్ చేస్తున్న యుద్ధానికి చెక్ పెట్టవచ్చని ఆశాభావం వ్యక్తం చేశారు ఇంధన విధానంపై భారత్, అమెరికాల మధ్య ఘర్షణ ఉన్నప్పటికీ యూఎస్‌కు భారత్ సన్నిహిత భాగస్వామి అని ట్రంప్ పేర్కొన్నారు. ప్రధాని మోదీ తనకు స్నేహితుడని, తమ మధ్య గొప్ప అనుబంధం ఉందని చెప్పొకొచ్చారు. నేను చాలా ఏండ్లుగా భారత్‌ను గమనిస్తున్నానని, అది అద్భుతమైన దేశమని చెప్పారు. గతంలో ప్రతి ఏడాది కొత్త నాయకుడు వచ్చేవారు. కొందరు కొన్ని నెలలకే మారిపోయేవారన్నారు. కానీ ఇప్పుడు తన మిత్రుడు చాలా కాలంగా అక్కడ అధికారంలో కొనసాగుతున్నారని వెల్లడించారు. మోదీ నాయకత్వంలో రాజకీయంగా స్థిరత్వం సాధించిందని వ్యాఖ్యానించారు.ఇదిలాఉండగా భారత్-పాకిస్థాన్ కాల్పుల విరమణకు సంబంధించి ట్రంప్ మళ్లీ పాత పాటే పాడారు. యుద్ధం ఆపకపోతే 200శాతం టారిఫ్‌లు విధిస్తానని ఈ దేశాలను తాను హెచ్చరించానని అన్నారు. వాణిజ్యంతోనే తాను భారత్-పాక్ ఉద్రిక్తతలను తగ్గించానని తెలిపారు. ఓ డిన్నర్ ఈవెంట్‌లో మాట్లాడుతూ ట్రంప్ ఈ వ్యాఖ్యలు చేశారు. ఈ సందర్భంగా భారత్‌కు కొత్తగా నియమితులైన అమెరికా రాయబారి సెర్గియో గోర్ గురించి ఆయన ప్రస్తావించారు. 'గోర్ గొప్పగా పనిచేస్తున్నారు. ఆయన భారత్‌లో అమెరికాకు మంచి ప్రాతినిధ్యం వహిస్తారని పేర్కొన్నారు.

### ట్రంప్‌కు ఒత్తిడికి తలొగ్గిన మోదీ

మోడీ నోరెత్తకపోవడం... ఆ వ్యాఖ్యల్ని విభేదించకపోవడం వంటి చర్యల్ని చూస్తే.. మోడీ ట్రంప్‌కి భయపడిపోయారని తెలుస్తోందని రాహుల్ ఎక్స్ పోస్టులో ప్రధానిని విమర్శించారు.

# రాజస్థాన్‌లో ఘోర రోడ్డు ప్రమాదం

## కారును ట్రక్కు ఢీకొనడంతో మంటలు

## మంటల్లో నలుగురు సజీవ దహనం

**జయపుర(జనంసాక్షి):** రాజస్థాన్‌లో బార్మర్ జిల్లాలో గురువారం ఉదయం ఘోర రోడ్డు ప్రమాదం చోటు చేసుకుంది. స్కార్పియో కారు ఓ ట్రక్కు ఢీకొట్టడంతో ఒక్కసారిగా మంటలు చెలరేగి.. కారులో ఉన్న నలుగురు సజీవ దహనమయ్యారు. ఈ దుర్ఘటనలో మరొకరు తీవ్రంగా గాయపడ్డారు. అతన్ని స్థానికులు ఆసుపత్రిలో చేర్పించి చికిత్స అందిస్తున్నారు. ఈ ఘటనపై పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. గూడమలానీ తహసీల్‌లోని డాబర్ గ్రామానికి చెందిన ఐదుగురు యువకులు పని నిమిత్తం సింధారీకి వెళ్లారు. పని ముగించుకుని అర్ధరాత్రి దాటాక తమ స్కార్పియో వాహనంలో ఇంటికి తిరుగు ప్రయాణమయ్యారు. వారి గమ్యస్థానానికి ఇంకా 30 కిలోమీటర్ల దూరంలో ఉండగా, సింధారీ పోలీస్ స్టేషన్ పరిధిలోని సదా గ్రామ సమీపంలో మెగా హైవేపై ఎదురుగా వస్తున్న ఓ ట్రైలర్‌ను వారి కారు బలంగా ఢకొ?ట్టింది. ప్రమాదం జరిగిన తీరు ఎంత తీవ్రంగా ఉందంటే, ఢకొన్న వెంటనే కారులో పెద్ద ఎత్తున మంటలు చెలరేగాయి.

# ట్రంప్-మోదీల మధ్య సంభాషణ జరగలేదు

**న్యూఢిల్లీ(జనంసాక్షి):** రష్యా నుంచి చమురు కొనుగోలు నిలిపివేసేందుకు ప్రధాని మోదీ అంగీకరించారని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ చేసిన ప్రకటనపై భారత్ స్పందించింది. ట్రంప్-మోదీల మధ్య నిన్న అటువంటి సంభాషణ ఏదీ జరగలేదని విదేశాంగశాఖ అధికార ప్రతినిధి రణధీర్ జైశ్వాల్ పేర్కొన్నారు. ఈ అంశంపై విలేకరులు అడిగిన ప్రశ్నలకు బదులిస్తూ దీనిపై భారత్ ఇప్పటికే స్పష్టతనిచ్చిందన్నారు .వైట్ హౌస్‌లో బుధవారం మీడియా సమావేశంలో మాట్లాడిన ట్రంప్.. రష్యా నుంచి భారత్ చమురు కొనుగోలు చేయడంపై తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. ఈ క్రమంలో మోదీతో తాను మాట్లాడానని, మాస్కో నుంచి చమురు కొనుగోలు నిలిపివేస్తానని భారత ప్రధాని తనకు హామీ ఇచ్చినట్లు చెప్పారు. అంతేకాదు.. ఉక్రెయిన్ యుద్ధంలో మాస్కోను ఒంటరి చేసే ప్రయత్నాల్లో ఇదో కీలక అడుగు అన్నారు.ఈ విషయంపై భారత విదేశాంగశాఖ గురువారం ఉదయం స్పందిస్తూ ఓ ప్రకటన విడుదల చేసింది. ఇంధన విషయంలో దేశ ప్రజల ప్రయోజనాలను కాపాడటమే ముఖ్యమని పేర్కొంది. వీటి ఆధారంగానే తమ దిగుమతి విధానాలు ఉంటాయని స్పష్టం చేసింది. అమెరికా విషయానికొస్తే.. చమురు దిగుమతి పెంచడానికి ఎన్నో ఏళ్లుగా ప్రయత్నాలు చేస్తున్నామని, గత దశాబ్దం కాలంలో చాలా పురోగతి కనిపించిందని తెలిపింది. అఫ్గాన్-పాకిస్థాన్ మధ్య జరుగుతోన్న ఘర్షణలపైనా భారత విదేశాంగ శాఖ స్పందించింది.

జనంసాక్షి
www.janamsakshi.org
JANAMSAKSHI DAILY


# రామప్ప ఖ్యాతిని ప్రపంచానికి చాటి చెప్పాలి

- రాష్ట్ర పంచాయతీ రాజ్,గ్రామీణ అభివృద్ధి, గ్రామీణ నీటి సరఫరా,మహిళా,శిశు సంక్షేమ శాఖ మంత్రి ధనసరి అనసూయ సీతక్క
- వరల్డ్ హెరిటేజ్ వాలంటీర్ క్యాంప్ సందర్శన




**ములుగు/రామప్ప,అక్టోబర్16(జనం సాక్షి):** రామప్ప ఖ్యాతిని ప్రపంచానికి చాటి చెప్పాలనీ రాష్ట్ర పంచాయతీ రాజ్, గ్రామీణ అభివృద్ధి, గ్రామీణ నీటి సరఫరా, మహిళా,శిశు సంక్షేమ శాఖ మంత్రి ధనసరి అనసూయ సీతక్క అన్నారు.గురువారం వెంకటాపూర్ మండలం పాలంపేట లోని హరిత కాటేజ్ లో వరల్డ్ హెరిటేజ్ వాలంటీర్ క్యాంప్ శిక్షణలో భాగంగా గత తొమ్మిది రోజులుగా కాకతీయ హెరిటేజ్ ట్రస్ట్, తెలంగాణ టూరిజం తెలంగాణ ప్రభుత్వం సహకారంతో నడుస్తున్న ఈ శిక్షణా శిబిరాన్ని మంత్రి సీతక్క సందర్శించారు. ఈ సందర్భంగా కార్యక్రమాన్ని మంత్రి సీతక్క సందర్శించి శిక్షణ తీసుకుంటున్న వాలంటీర్స్ తో ముఖాముఖి మాట్లాడి వారి వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా మంత్రి సీతక్క కాకతీయుల చరిత్ర గురించి నిర్వహిస్తున్న ఈ కార్యక్రమానికి రాష్ట్రం,విదేశాల నుండి వచ్చిన విద్యార్థిని, విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతూ తన జీవితం లో ఏ విధంగా ఈ స్థితికి వచ్చాను ఇక్కడున్న ప్రాంత ప్రాముఖ్యత గురించి తెలుసుకోవడానికి వచ్చిన మీ అందరికీ అభినందనలు, మీరు ఇక్కడ నేర్చుకున్న ప్రతి అంశం మీరు ఇక్కడి నుంచి వెళ్ళాక మీ ప్రదేశాల్లో కాకతీయుల గురించి వివరించాలని అన్నారు. ఈ సందర్భంగా ప్రొఫెసర్ పాండురంగారావు మాట్లాడుతూ వరుసగా ఇది నాలుగవసారి వరల్డ్ హెరిటేజ్ క్యాంప్ రామప్పులో నిర్వహిస్తున్నామని ప్రతి సంవత్సరం వివిధ ప్రదేశాల నుండి వివిధ దేశాల నుండి వచ్చిన విద్యార్థిని విద్యార్థులకు కాకతీయుల కళా సంపద వారసత్వం వాటిని ఎలా కాపాడుకోవడం అనే అంశాల మీద మరియు వాటి ప్రాముఖ్యతను వివరించారు.ఈ సందర్భంగా అసిస్టెంట్ టూరిజం ప్రమోషన్ ఆఫీసర్ డాక్టర్ కుసుమ సూర్య కిరణ్ మాట్లాడుతూ మంత్రి గారు పర్యాటక రంగానికి మరియు మేడారంకి ఏవిధంగా అభివృద్ధి చెందడానికి ప్రయత్నిస్తున్నారో, టూరిజం తెలంగాణలో ఏ విధంగా అభివృద్ధి చెందుతుందో, ముఖ్యంగా యూత్ కి ప్రజలకు పర్యాటకం ఏ విధంగా దోహదపడుతుందనే అంశాల గురించి వివరించారు.గురువారం శిక్షణలో భాగంగా ప్రొఫెసర్ వెంకట్ రెడ్డి ఎన్ఐటి నుండి వచ్చి జాగ్రాఫికల్ ఇన్ఫర్మేషన్ సిస్టం మీద మరియు సమ్మక్క సారక్క ట్రైబల్ యూనివర్సిటీ వైస్ ఛాన్సర్ వైఎల్ శ్రీనివాస్ క్యాంపుకు వచ్చి వాలంటీర్స్ కి ముఖ్యమైన సలహాలు సూచనలు టూరిజం కల్చర్ హెరిటేజ్ గురించి వివరించారు.డాక్టర్ జి మహేష్ హెరిటేజ్ ఆఫ్ తెలంగాణ మీద ప్రసంగించారు.ఆ తర్వాత డాక్టర్ కుసుమ సూర్య కిరణ్ అసిస్టెంట్ టూరిజం ప్రమోషన్ ఆఫీసర్ తెలంగాణ టూరిజం ప్రొడక్ట్స్ తెలంగాణ టూరిజం ఏ విధంగా అభివృద్ధి చెందుతుంది తెలంగాణ టూరిజం యొక్క విశిష్టత గురించి వివరించారు.ఈ కార్యక్రమంలో కాకతీయ హెరిటేజ్ ట్రస్ట్ ట్రస్ట్ ప్రొఫెసర్ పాండురంగారావు, కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షులు పైడాకుల అశోక్,టిపిసిసి ప్రధాన కార్యదర్శి మల్లాడి రామ్ రెడ్డి, జిల్లా గ్రంధాలయ సంస్థ చైర్మన్ బానోత్ రవి చందర్,ములుగు వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ రేగ కల్యాణి తో పాటు కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర జిల్లా బ్లాక్ మండల గ్రామ నాయకులు కార్యకర్తలు మరియు డాక్టర్ కుసుమ సూర్యకిరణ్,అసిస్టెంట్ టూరిజం ప్రమోషన్ ఆఫీసర్,వాలంటీర్స్, తదితరులు పాల్గొన్నారు.

## ప్రైవేట్ ఆసుపత్రులు క్లినికల్ ఎస్టాబ్లిష్మెంట్ చట్టం

# నియమాలను పాటించాలి

- హనుమకొండ జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్



**వరంగల్ బ్యూరో, అక్టోబర్ 16 (జనం సాక్షి) :** జిల్లాలోని ప్రైవేట్ క్లినిక్ లు, ఆసుపత్రులు క్లినికల్ ఎస్టాబ్లిష్మెంట్ చట్టం నియమాలను తప్పనిసరిగా పాటించాలని హనుమకొండ జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్ అన్నారు. గురువారం హనుమకొండ జిల్లా కలెక్టరేట్ లోని మినీ కాన్ఫరెన్స్ హాలులో క్లినికల్ ఎస్టాబ్లిష్మెంట్, రిజిస్టరింగ్ అథారిటీ సమావేశాన్ని జిల్లా కలెక్టర్ నిర్వహించారు. జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ అప్పయ్య ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఈ సమావేశంలో ఐఎంఏ, తానా, గైనకాలజిస్ట్ అసోసియేషన్, డెంటల్, ఆయుర్వేదిక్, హోమియో, యునాని, ఫిజియోథెరపి అసోసియేషన్ల ప్రతినిధులతో ప్రభుత్వ నియమ నిబంధనలు మేరకు క్లినిక్ లు, ఆసుపత్రుల ఏర్పాటు, నిర్వహణ, అనుమతులు, ఫీజుల పట్టిక, ఫైర్ సేఫ్టీ, బయో మెడికల్ వేస్ట్ మేనేజ్మెంట్, తదితర అంశాలపై సమావేశంలో చర్చించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్ మాట్లాడుతూ ప్రభుత్వ అనుమతులు లేకుండా ఆసుపత్రులు, క్లినిక్ లు నిర్వహించవద్దని, చట్టం నియమాలకు అనుగుణంగా నిర్వహించడంలో అసోసియేషన్లు సహకరించాలని సూచించారు. ప్రైవేట్ ఆసుపత్రుల వద్ద పార్కింగ్ సమస్యలు తలెత్తుతున్నాయని, వీటిపై తరచుగా ఫిర్యాదులు అందుతున్నాయని అన్నారు. ఆసుపత్రిల వద్ద సరైన పార్కింగ్ స్థలం ఉండే విధంగా ఆసుపత్రుల యాజమాన్యాలు చూసుకోవాలన్నారు. కొత్తగా ఏర్పాటు చేసే ఆస్పత్రులకు ప్రభుత్వ నిబంధనల మేరకు నిర్మించాలని, ఆక్యుపెన్సి సర్టిఫికెట్ ను తప్పనిసరిగా తీసుకోవాలని, ఫైర్ సేఫ్టీ నిబంధనలు పాటిస్తేనే ఆసుపత్రులకు అనుమతులు ఇవ్వబడతాయన్నారు.

# బీసీ రిజర్వేషన్లపై బీజేపీ నాటకం

**సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి జాన్‌వెస్లీ**





**హైదరాబాద్ (జనంసాక్షి) :** బీసీలకు 42 శాతం రిజర్వేషన్లపై కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం నాటకమాడుతున్నదని సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి జాన్‌వెస్లీ విమర్శించారు. ఒకవైపు కేంద్రంలో బీసీ రిజర్వేషన్ల బిల్లును, ఆర్డినెన్స్‌ను అడ్డుకుంటూ ఇంకోవైపు రాష్ట్రంలో ఈనెల 18న బీసీ జేఏసీ రాష్ట్ర బంద్‌కు బీజేపీ మద్దతు ఇచ్చిందని అన్నారు. బీసీలకు 42 శాతం రిజర్వేషన్లను అమలు చేసే పూర్తి బాధ్యత కేంద్ర ప్రభుత్వానిదేనని డిమాండ్ చేశారు. కేంద్ర ప్రభుత్వం తీరుకు వ్యతిరేకంగా పోరాడితేనే ఈనెల 18న బీసీ జేఏసీ తలపెట్టిన రాష్ట్రబంద్‌లో పాల్గంటామనీ, లేదంటే స్వతంత్రంగా ఉద్యమిస్తామని స్పష్టం చేశారు. కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా జరిగే ఈ పోరాటంలో బీసీ సంఘాలు, అభ్యుదయవాదులు, ప్రజాతంత్రవాదులు భాగస్వాములు కావాలని కోరారు. బీసీ రిజర్వేషన్లపై కేంద్ర ప్రభుత్వ తీరుకు నిరసనగా శుక్రవారం చలో రాజ్‌భవన్ కార్యక్రమాన్ని చేపడుతున్నామని ఆయన పిలుపునిచ్చారు. గురువారం హైదరాబాద్‌లోని సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యాలయం ఎంబీ భవన్‌లో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ బీసీలకు 42 శాతం రిజర్వేషన్ అమలు కోసం రాష్ట్ర ప్రభుత్వం కులగణన చేసిందన్నారు. అసెంబ్లీలో అన్ని రాజకీయ పార్టీల మద్దతుతో ఏకగ్రీవంగా ఆమోదించి బిల్లును కేంద్ర ప్రభుత్వానికి పంపించిందని వివరించారు. ఆర్నెల్లైనా ఆమోదించలేదని చెప్పారు. రాష్ట్ర మంత్రివర్గం ఆర్డినెన్స్‌ను ఆమోదించి గవర్నర్‌కు పంపిస్తే దాన్ని కూడా కేంద్రానికి పంపించారని గుర్తు చేశారు. దీంతో రాష్ట్ర ప్రభుత్వం బీసీ రిజర్వేషన్లకు సంబంధించి జీవో నెంబర్ తొమ్మిదిని విడుదల చేసిందన్నారు. ఆ జీవోపై హైకోర్టు స్టే విధించిందని చెప్పారు. ఆ స్టేను సవాల్ చేస్తూ రాష్ట్ర ప్రభుత్వం సుప్రీం కోర్టును ఆశ్రయిస్తే ఆ పిటిషన్‌ను తిరస్కరించిందని వివరించారు. పాత రిజర్వేషన్ల ప్రకారమే స్థానిక సంస్థల ఎన్నికలను నిర్వహించుకోవాలంటూ సూచించిందని అన్నారు. బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పించే పూర్తి బాధ్యత కేంద్ర ప్రభుత్వంపైనే ఉందన్నారు. ఈనెల 18న బీసీ జేఏసీ రాష్ట్ర బంద్‌కు పిలుపునిచ్చిందనీ, అన్ని రాజకీయ పార్టీల మద్దతునూ కోరిందని చెప్పారు. ఈ బంద్‌కు బీజేపీ కూడా మద్దతు ప్రకటించిందని గుర్తు చేశారు. కేంద్రంలో బీజేపీ అధికారంలో ఉందనీ, బీసీ రిజర్వేషన్లను అమలు చేయాల్సిన బాధ్యత ఆ పార్టీపైనే ఉందని అన్నారు. కాంగ్రెస్ కూడా బంద్‌కు మద్దతు ఇచ్చిందన్నారు. ఇప్పుడు రాష్ట్రబంద్ ఎవరికి వ్యతిరేకంగా జరుగుతున్నదని ప్రశ్నించారు. బీసీలకు 42 శాతం రిజర్వేషన్లను కల్పించాలని కోరుతూ కేంద్రంపై ఒత్తిడి పెంచేందుకు శుక్రవారం చలో రాజ్‌భవన్ కార్యక్రమానికి ఆయన పిలుపునిచ్చారు. ఈనెల 18న బీజేపీకి వ్యతిరేకంగా బంద్ చేపడితే పాల్గంటామనీ, లేదంటే అదేరోజు సీపీఐ(ఎం) ఆధ్వర్యంలో మండలాలు, పట్టణాల్లో ప్రదర్శనలు, ధర్నాలు, బైక్ యాత్రలు నిర్వహిస్తామనీ, కేంద్రం తీరును నిరసిస్తామని అన్నారు. ఇందులో బీసీ సంఘాలు, అభ్యుదయ సంఘాలు, ప్రజాతంత్రవాదులు పాల్గనాలని కోరారు.

**బీసీ రిజర్వేషన్లకు ప్రధాన అవరోధం బీజేపీ : తమ్మినేని**

బీసీలకు 42 శాతం రిజర్వేషన్లను కేంద్రం అడ్డుకునే రాజకీయ పార్టీని అందరూ గుర్తించాలని సీపీఐ(ఎం) కేంద్ర కమిటీ సభ్యులు తమ్మినేని వీరభద్రం అన్నారు. ఈ రిజర్వేషన్లకు ప్రధాన అవరోధం కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వమేనని విమర్శించారు. ఆ పార్టీకి, ఆ ప్రభుత్వానికి వ్యతిరేకంగా ఈనెల 18న బీసీ జేఏసీ తలపెట్టిన రాష్ట్ర బంద్ జరగాలన్నారు. బీజేపీ ఉన్న వేదికల్లో తాము పాల్గనేది లేదని స్పష్టం చేశారు. తాము స్వతంత్రంగా ఉద్యమాలను చేపడతామని అన్నారు. బీసీలకు 42 శాతం రిజర్వేషన్ల అమలు కోసం కేంద్రంపై పోరాడాలని రాష్ట్ర ప్రభుత్వానికి సూచించారు. అఖిలపక్షం సహకారంతో ఢిల్లీ కేంద్రంగా ఉద్యమించాలని కోరారు. ఈ కార్యక్రమంలో సీపీఐ(ఎం) కేంద్ర కమిటీ సభ్యులు టి జ్యోతి, రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు టి సాగర్ తదితరులు పాల్గొన్నారు.



# బీసీ రాజ్యాధికారమే పార్టీ లక్ష్యం

- బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనారిటీలు ఏకం కావాలి
- గ్రామ స్థాయి వరకు పార్టీ బలోపేతానికి కృషి చేయాలి
- టీఆర్పీ రాష్ట్ర కార్యదర్శి అఖిల్ పాషా సూచన

**కరీంనగర్ (జనంసాక్షి) :**
బీసీ రాజ్యాధికారమే టీఆర్పీ పార్టీ లక్ష్యమని రాష్ట్ర కార్యదర్శి అఖిల్ పాషా అన్నారు. కరీంనగర్ జిల్లా కేంద్రంలో టీఆర్పీ పార్టీ ముఖ్య నాయకుల శమావేశం పార్టీ కార్యాలయంలో జరిగింది. ఈ కార్యక్రమానికి పార్టీ రాష్ట్ర కార్యదర్శి అఖిల్ పాషా హాజరై మాట్లాడుతూ టిఆర్పి పార్టీ బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనారిటీ వర్గాల హక్కుల కోసం పుట్టిన పార్టీ టీఆర్పీ పార్టీ అని తెలిపారు. గతంలో అగ్రవర్ణ నేతల చేతిలో సామాన్య వర్గాలు ఎన్నో సార్లు మోసపోయాయని, ఇకపై రాజకీయ అధికారం సామాన్యుల చేతుల్లో ఉండాలన్న లక్ష్యంతో తెలంగాణ రాజ్యాధికార పార్టీని పార్టీ రాష్ట్ర అధ్యక్షులు ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న గారు స్థాపించారన్నారు. త్వరలోనే కరీంనగర్ జిల్లాలో టిఆర్పి జెండా ఎగురవేయడంతో పాటు, జిల్లా కార్యాలయం ప్రారంభం కాబోతుందని అన్నారు. యధావిధిగా అదే రోజు మల్లన్న ఆధ్వర్యంలో వివిధ పార్టీల నుండి మన పార్టీలోకి చేరికలు కుడా వుంటాయని, స్పష్టం చేశారు. మండలాలలో ఉన్న నాయకులు గ్రామగ్రామానికి పార్టీ సిద్ధాంతాలను తీసుకెళ్తూనే సామాజిక న్యాయం సాధన దిశగా కృషి చేయాలని పార్టీని గ్రామ స్థాయి వరకు బలోపేతం చేయాలని తెలియజేసారు. తెలంగాణ రాష్టంలో బీసీల హక్కుల, సామాజిక న్యాయం, మరియు ప్రజల ఆత్మగౌరవం కోసం తీన్మార్ మల్లన్నతో కలసి పనిచేయాలని ప్రతి ఒక్కరు పార్టీకి సైనికుడిగా పని చేయాలని సంకల్పం వ్యక్తం చేశారు. త్వరలో కరీంనగర్ జిల్లాలో నిర్వహించే కార్యక్రమాలను విజయవంతం చేసే విధంగా అందరూ కలిసి కష్టపడాలని అభిప్రాయ పడ్డారు. ఈ కార్యక్రమంలో టిఆర్పి నాయకులు శివరాత్రి మోహన్, భుత్కూరి మధు, దురుశెట్టి చెందు, మంతెన శ్రీకాంత్, ఓర్సు రాజు, మొహమ్మద్ సులేమాన్, షేక్ చాంద్ పాషా, మొహమ్మద్ మహబూబ్ అలీ, దారముల గణేష్ తదితరులు పాల్గొన్నారు.

# సింగరేణి ప్రైవేటీకరణకు కుట్రలు

**టీబీజీకేఎస్ రాష్ట్ర అధ్యక్షుడు మిరియాల రాజిరెడ్డి**



**బెల్లంపల్లి, అక్టోబర్ 16 (జనంసాక్షి) :** కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు సింగరేణి సంస్థను ప్రైవేటు పరం చేసి హక్కులను కాలరాసేందుకు కుట్రలు చేస్తున్నాయని టీబీజీకేఎస్ రాష్ట్ర అధ్యక్షుడు మిరియాల రాజిరెడ్డి అన్నారు. గురువారం శాంతిఖని గనిలో జరిగిన గేటు మీటింగ్లో పాల్గొని మాట్లాడారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ కార్మికులకు పూర్తి లాభాల వాటాను ఇప్పించడంలో గుర్తింపు, ప్రాతినిధ్య సంఘాలు విఫలమయ్యాయని దుయ్యబట్టారు. లాబాల వాటాలో కార్మికులను దగా చేశారనీ మండిపడ్డారు. సింగరేణిలో కొత్త బొగ్గు గనులు ప్రారంభించే అవకాశాలు ఉన్నప్పటికీ, పట్టించు కోకుండా ఇతర రాష్ట్రాల్లో ఖనిజాలను వెలికి తీస్తామని రాష్ట్ర ప్రభుత్వం గొప్పలు చెపుతుందని విమర్శించారు. సింగరేణి కార్మికులు కష్టపడి సంస్థకు వేలాది కోట్ల లాబాలు తీసుకు వస్తే లాభాల్లో వాటా కార్మికులకు ఇప్పించడంలో ఐఎన్టీయూసీ, ఏఐటీయూసీ సంఘాలు విఫల మాయ్యాయన్నారు. శాంతిఖని, రామగుండంలోని అడ్రియాల లాంగ్ వాల్ ప్రాజెక్టుల్లో భారీగా నష్టం వస్తుందని చెప్పడం దుర్మార్గమైన చర్యన్నారు. ఈ గనులను మూసివేందుకు సింగరేణి సంస్థ కుట్రలో భాగంగానే ఇలా మాట్లాడుతుందన్నారు. ఈగనులకు ఎంతో భవిష్యత్ ఉందన్నారు. మెడికల్ బోర్డు నిర్వహణ ప్రతిష్టంబనకు గురైందన్నారు. ఇందుకు గుర్తింపు, ప్రాతినిధ్య సంఘాలు కార్మికులకు సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. గుర్తిపు కార్మిక సంఘం కార్మికుల పే షిట్లలో చందాలను రికవరీ చేయడం చట్ట విరుద్ధమన్నారు. ఈ విషయంపై సింగరేణి సంస్థ డైరెక్టర్ పాకు ఫిర్యాదు చేసి అడ్డుకుంటామన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చి 22 నెలల్లో ఐఎన్టీయూసీ, ఏఐటీయూసీ కార్మికులకు చేసిందేమి లేదన్నారు. సింగరేణి సంస్థ ను కాపాడేందుకు టీబీజీకేఎస్ పోరాటం చేపడుతుందన్నారు. ఈ సమావేశంలో సెంట్రల్ వైస్ ప్రెసిడెంట్ బడికలసంపత్ కుమార్, సెంట్రల్ కమిటీ వైస్ ప్రెసిడెంట్లు మేడిపల్లి సంపత్, మల్రాజు శ్రీనివాసరావు, వెంకటరమణ, డిప్యూటీ జనరల్ సెక్రటరీ రాజనాల రమేష్, సెంట్రల్ నాయకులు దాసరి శ్రీనివాస్, అనుముల సత్యనారాయణ, సంపత్ కుమార్, ట్రెసరర్ సతీష్, శాంతిఖని పిట్ కార్యదర్శి హనుమంత్ రావు తదితరులు పాల్గొన్నారు.

# రైతు సంక్షేమానికి పెద్దపీట

**స్టేషన్ ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి**



**స్టేషన్ ఘన్పూర్, అక్టోబర్ 16 (జనంసాక్షి) :** దేశంలో ఎక్కడలేని విధంగా రైతు సంక్షేమ పథకాలను తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తుందని మాజీ ఉపముఖ్యమంత్రి, స్టేషన్ ఘనపూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి తెలిపారు. మండలంలోని నమిలిగొండ, స్టేషన్ పట్టణ పరిధిలోని శివునిపల్లి లో ఐకేపీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఎమ్మెల్యే కడియం శ్రీహరి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ కొనుగోలు కేంద్రాలలో రైతులకు ఎలాంటి ఇబ్బందులు రాకుండా త్రాగు నీరు, విద్యుత్ లైట్లతో పాటు ఇతర ఏర్పాట్లు చేయాలని నిర్వహకులకు సూచించారు. మహిళలకు ఉపాధి కల్పించాలని,మహిళా సంఘాలను బలోపేతం చేయాలనే ఉద్దేశ్యంతోనే మహిళా సంఘాలకు ధాన్యం కొనుగోలు కేంద్రాలను కేటాయిస్తున్నట్లు వెల్లడించారు. ధాన్యం కొనుగోలుకేంద్రాల నిర్వాహకులు ఎవరికీ ఒక్క రూపాయి కూడా ఇవ్వకూడదని ఎవరైనా డబ్బులు అడిగితె తన దృష్టికి తీసుకురావాలని అన్నారు. రైతు లు ప్రభుత్వం ఏర్పాటు చేసిన కేంద్రాలలోనే ధాన్యం అమ్ముకోవాలని, దళారుల వద్దకు వెళ్లి నష్ట పోవద్దని సూచించారు. రైతులు ప్రభుత్వ కొనుగోలు కేంద్రాలలో నే ధాన్యం అమ్మాలని కోరారు. రైతుపక్షపాతి కాంగ్రెస్ ప్రభుత్వమని అన్నారు. దేశంలో నే ఎక్కడా లేని రైతు సంక్షేమ పథకాలను కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తుం దని తెలిపారు. నమిలిగొండ గ్రామ రోడ్డువెడల్పు చేయ దానికి గ్రామస్తులు సహకరించాలని కోరారు.రోడ్డు వెడ ల్పు పనులకు ఇప్పటికే 60లక్షలు మంజూరు అయ్యా యని అన్నారు.గ్రామస్తులు అందరుసహకరిస్తే సంక్రాతి నాటికీ 60 లక్షలతో పాటు మరో 60లక్షలు మంజూరు చేసి గ్రామం ప్రారంభం నుండి సబ్ స్టేషన్ వరకు సిసి రోడ్డు నిర్మాణంచేసే బాధ్యత తనదని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ లావణ్య, ఆర్డీవో వెంకన్న, డిఆర్ డివో వసంత, తహసీల్దార్ వెంకటేశ్వర్లు, ఎంపిడివో విజయశ్రీ,ఏవో చంద్రన్ కుమా ర్ ఏఈవో ఈశ్వరి, డిపిఎం, ఎపిఎం, నాయకులు పురమని రజాక్ యాదవ్, బూర్ల శంకర్, పోగుల సారంగపాణి, తోట సత్యం, ఇనగాల వెంకటే శ్వర్ రెడ్డి, నాగరబోయిన శ్రీరాములు, నాగరబోయిన యాదగిరి, కొలిపాక సతీష్, సుధాకర్, నీల గట్టయ్య, పురమని ఐలోని, ప్రభాకర్, గుర్రం రాజు,సింగపురం వెంకటయ్య, శ్రీనివాస్, వెంకటేశ్వర్లు మహిళా సంఘాల సభ్యులు, ప్రజా ప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు తదితరు లు పాల్గొన్నారు.



## గంజాయి సేవించిన ఇద్దరు యువకులు అరెస్ట్

**భీమదేవరపల్లి, అక్టోబర్ 16 (జనం సాక్షి) :** గంజాయి సేవించిన ఇద్దరు యువకులపై ముల్కనూరు పోలీసులు కేసు నమోదు చేశారు. ముల్కనూరు ఎస్ఐ రాజు తెలిపిన వివరాల ప్రకారం ముల్కనూరు గ్రామ శివారులో ఇద్దరు యువకులు గంజాయి సేవిస్తున్నారని నమ్మదగిన సమాచారం మేరకు పోలీసులు దాడి చేశారు.ఈ సందర్భంగా చేపూరి అజయ్,ఆదారి మహేందర్ అనే ఇద్దరిని అదుపులోకి తీసుకున్నారు. వారి వద్ద నుంచి ఒక ద్విచక్రవాహనం రెండు చరవాణాలు, ఐదు గ్రాముల ఎండు గంజాయి (విలువ రూ.500)ను స్వాధీనం చేసుకున్నారు.ఈ ఘటనపై ముల్కనూరు పోలీసు స్టేషన్‌లో కేసు నమోదు చేసి దర్యాప్తు కొనసాగిస్తున్నట్లుఎస్ఐ రాజు తెలిపారు.

## స్కూలుకు మాజీ ఎమ్మెల్యే బిగాల కోటి విరాళం

**నిజామాబాద్, అక్టోబర్16 (జనంసాక్షి) :** నిజామాబాద్ అర్బన్ నియోజకవర్గం మాజీ ఎమ్మెల్యే బిగాల గణెశిష్ గుప్తా మాక్లూర్ మండల కేంద్రంలోని ప్రభుత్వ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు రూ. కోటి విరాళం అందజేశారు. ఈ మేరకు గురువారం ఆయన తన సోదరుడు బిగాల మహేశ్‌తో కలిసి సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయానికి వచ్చి కలెక్టర్ టి. వినయ్ కృష్ణారెడ్డికి కోటి రూపాయల విలువ గల చెక్కును అందజేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా విద్యా శాఖ అధికారి అశోక్ పాల్గొన్నారు.

## రోగులకు భరోసా కల్పించండి: ఎమ్మెల్యే



**చేవెళ్ల, అక్టోబర్16 (జనంసాక్షి) :** రోగులతో ఆప్యాయంగా మాట్లాడి వైద్యం చేయాలని ఎమ్మెల్యే మనోహర్ రెడ్డి వైద్యులకు సూచించారు. చికిత్సకు వచ్చిన వారికి భరోసా కల్పించాలని అన్నారు. వారికి మనోధైర్యం ముఖ్యమని అన్నారు. గురువారం ఆయన తాండూరు జిల్లా ఆసుపత్రి, నర్సింగ్ విద్యార్థుల వసతి గృహాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. వార్డులన్నీ తిరిగి రోగులతో మాట్లాడారు. వైద్యులు సమయపాలన పాటించాలని కోరారు. ఈ సందర్భంగా ఆసుపత్రిలో ఎదుర్కొంటున్న నీటి సమస్య, డ్రైనేజీ వ్యవస్థ బాగాలేదని వైద్య సిబ్బంది ఆయన దృష్టికి తీసుకెళ్లారు. ఆసుపత్రిలో ఉన్న సమస్యల పరిష్కారానికి పక్షం రోజుల్లోగా చర్యలు తీసుకుంటానని ఎమ్మెల్యే వారికి హామీ ఇచ్చారు. ఈ పర్యవేక్షణలో వినయ్ కుమార్, ఆర్ఎంవో ఆనంద్ గోపాల్ రెడ్డి తదితరులు ఉన్నారు.

## వరంగల్ సూపర్ స్పెషాలిటీ హాస్పటల్ పనులు వేగవంతంగా పూర్తి చేయాలి

**జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద..**



**వరంగల్ ప్రతినిధి, అక్టోబర్ 16(జనంసాక్షి):** వరంగల్ సూపర్ స్పెషాలిటీ హాస్పటల్ పనులు వేగవంతంగా పూర్తి చేయాలని వరంగల్ జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద ఆదేశించారు. గురువారం వరంగల్ లో నిర్మాణంలో ఉన్న వరంగల్ సూపర్ స్పెషాలిటి హాస్పటల్ ను కలెక్టర్ సందర్శించి సంబంధిత అధికారులతో సమావేశమై పనుల పురోగతిని సమీక్షించారు.ఈ సందర్భంగా భవనంలోని సివిల్, ఎలక్ట్రికల్ పనుల వివరాలను కలెక్టర్ అడిగి తెలుసుకొన్నారు. ప్రతి అంతస్తు లోని నిర్మాణ స్తితి గతులను తెలుసుకొని, అట్టి నిర్మాణ పనులను వేగవంతంగా పూర్తి చేయాలని ఆదేశించారు. అలాగే, వైద్య పరికరముల అమరికను, మంచినీటి సౌకర్యాలు, రోడ్ల నిర్మాణం, మురుగు నీటి పారుదల తదితర గురించి తెలుసుకున్నారు. వివిద శాఖాధిపతులలో వారి శాఖలకు కేటాయించిన స్థలములో మార్పులు, ఇతర అవసరాల గురించి చర్చించారు. ప్రతి దశలో పనుల పురోగతిని తనిఖీ చేస్తూ, అవసరమైన మౌలిక వసతులను సమకూర్చేందుకు సంబంధిత శాఖలు సమన్వయంతో పనిచేయాలన్నారు. ఈ సమావేశంలో యం. జి. యం. హాస్పటల్ సూపరింటెండెంట్ కిషోర్, కెఎం సి ప్రిన్సిపాల్ సంధ్యారాణి, ఆర్. ఎం. వోలు, వివిధ విభాగాల అధిపతులు, ఆర్ అండ్ బి డిపార్ట్మెంట్ ఇజనీర్లు, ఎల్ అండ్ టీ అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# అసమాన కలం యోధుడు షహీద్ షోయబుల్లా ఖాన్



### అక్టోబర్ 17...షోయబ్ ఉల్లాఖాన్ జన్మదినం

పెన్నును గన్నుగా మార్చి, అక్షరాలను బుల్లెట్లుగా ప్రయోగించి, నాటి నిరంకుశ నిజాం పాలనకు వ్యతిరేకంగా రాజీలేని రచనలతో నిజాం ప్రభుత్వానికి నిద్దుర పట్టనీయకుండా వణికించిన షోయబ్ ఉల్లా ఖాన్ అక్షర వీరుడు. ప్రజల కోసం కలం పట్టి ప్రాణాలను తృణప్రాయంగా వదలిన ధీరుడు. పాత్రికేయ వృత్తికే వన్నె తెచ్చిన నిజాయితీ పరుడు. తన రచనలతో తెలంగాణ పాత్రికేయ చరిత్రలో సుస్థిర స్థానం పొందిన కలం యోధుడు. లక్ష్య సాధనలో ప్రాణ త్యాగం చేసిన అమరుడు. నిఖార్సైన వాడి వేడితో కూడిన తన రచనల ద్వారా నిజాం ప్రభుత్వ విధానాలను, రజాకార్ల దుశ్చర్యలను ఎండగట్టిన నిబద్దత కలిగిన పాత్రికేయుడు. తన స్వేచ్ఛా రచన జీవితానికి చరమగీతం పాడుతుందని తెలిసినా వెనుకంజ వేయని మేరు నగ ధీరుడు. అపూర్వ త్యాగ ధనుడు.

షోయబ్ ఉల్లాఖాన్ 1920, అక్టోబరు 17న ఖమ్మం జిల్లా సుబ్రవేడులో జన్మించాడు. తండ్రి హబీబుల్లా ఖాన్. తల్లి లాయహున్నీసా బేగం. వారి కుటుంబం ఉత్తర ప్రదేశ్ నుంచి నిజాం ప్రాంతానికి వలస వచ్చి ఇక్కడ స్థిరపడింది. షోయబ్ ఉస్మానియా విశ్వ విద్యాలయం నుండి బిఏ, జర్నలిజం డిగ్రీ పూర్తి చేశాడు. బొంబాయిలో ఇంటర్మీడియట్ గ్రేడ్ డ్రాయింగ్ పరీక్ష కూడా ఉత్తీర్ణుడైనాడు. తన కుమారునిలో గాంధీ మహాత్ముని పోలికలున్నాయని భావించి హబీబుల్లాఖాన్... 'షోయబుల్లా గాంధీ' అని ముద్దుగా పిలుచుకునే వాడు. గాంధీ లాగానే షోయబ్ కూడా తాను నమ్మిన మార్గంలో ప్రయాణించడంలో నిబద్ధతను, మొండితనాన్ని ప్రదర్శించాడు.

తెలంగాణ అగ్నిగోళంలా మండుతున్న కాలమది. నిరంకుశ పాలన, దోపిడీ, దౌర్జన్యాలు సాగదంటూ సామాన్యుడు సమరం సాగిస్తున్న సమయమది.

అది పత్రికలపై ప్రభుత్వం ఉక్కుపాదం మోపుతున్న కాలం. ప్రభుత్వానికి వ్యతిరేకంగా వార్తా ప్రచురణ చేయడానికి సాహసించని గడ్డుకాలం. ఉస్మానియా యూనివర్సిటీలో గ్రాడ్యుయేషన్ పూర్తిచేసి, ప్రజాస్వామ్య కాంక్షతో దుర్మార్గ పాలనను ఎదురించే చైతన్యంతో క్యాంపస్ నుండి షోయబుల్లా ఖాన్ బయట కొచ్చాడు. సమ సమాజం కోసం, అణగారిన అమాయక ప్రజల కోసం ఏదో చేయాలన్న తపన బలంగా ఉన్న షోయబ్ జాతీయోద్యమ స్ఫూర్తితో జర్నలిజాన్ని వృత్తిగా ఎంచు కున్నాడు. చిత్తశుద్ధి, అంకితభావం, నిబద్దత కలిగిన జర్నలిస్ట్ గా జీవితం ప్రారంభించాడు.

మొదట షోయబ్ 'తేజ్ 'అనే ఉర్దూ పత్రికలో ఉప సంపాదకుడిగా చేరాడు. నిరంకుశ నిజాం ప్రభుత్వం, ఆయన తాబేదార్లయిన రజాకార్ల దౌర్జన్యాలు, అరాచ కాలను తీవ్ర స్థాయిలో విమర్శిస్తూ వార్తలనే అస్త్రాలను సంధించాడు. ప్రజా సమస్యలపై పాలకులను నిలదీస్తూ ప్రజల్లో చైతన్యం తెచ్చే ప్రయత్నం చేశాడు. చివరకు 'తేజ్' పత్రికను నిషేధించారు. కణకణ మండుతున్న నిప్పుకణికల్లాంటి షోయబుల్లాఖాన్ అక్షరాలకు ప్రచురణ అవకాశం అప్పటికే ముందుముల నర్సింగ రావు నిర్వహణ లోని రయ్యత్ పత్రిక కల్పించింది. ఆయన స్వతంత్ర భావ ప్రకటనలకు ఆ పత్రిక వేదిక అయింది. కొంత కాలానికి నిజాం ప్రభుత్వం 'రయ్యత్' పత్రికను మూసి వేయించింది.

నిజాం దౌర్జన్యాన్ని ఎదిరించడానికి సొంత పత్రిక ఉంటేనే మంచిదను కున్నాడు షోయబుల్లా ఖాన్. మాజీ ముఖ్యమంత్రి బూర్గుల రామకృష్ణా రావు సహాయంతో భార్య, తల్లి నగలను అమ్మి ఇమ్రోజ్ ను స్థాపించాడు. 1947 నవంబర్ 17న మొదటి సంచిక వెలువడింది.

బూర్గుల రామకృష్ణారావు ఇంట్లో ఇమ్రోజ్ ఆఫీస్ ఉండేది. ఉర్దూలో ఇమ్రోజ్ అంటే ఈ రోజు. పాలక వర్గాల దౌర్జన్యాలను, దోపిడీని చీల్చి చెండాడాడు. 'ఇమ్రోజ్' దిన పత్రిక తొలి సంచిక 1947 నవంబరు 17 వ తేదీన వెలువ డింది. నిజాం సంస్థానాన్ని ఇండియన్ యూనియన్ లో విలీనం చేయాల్సిందేనని ఖరాఖండిగా చెబుతూ సంపాదకీయాలు రాశాడు. విశాల దేశ ప్రయోజనాల దృష్ట్యా విలీనం తప్పనిసరి అని పేర్కొన్నాడు. పదునైన విమర్శనాస్త్రాలు సంధించాడు.

ఎక్కడ ఏ మూలన నిజాం ఏలుబడిలో ఆగడాలు చెలరేగుతున్నా, ఎక్కడ ఆర్మీ క్యాంప్స్ ఉన్నా వాటి గురించి నిర్భయంగా రాసేవాడు. హైదరాబాద్ ఇండియాలో విలీనం కావాల్సిందేనని తన రాతలతో స్పష్టం చేసేవాడు. నిజాంకు వ్యతిరేకంగా ఉన్న ముస్లిం విద్యావంతుల అభిప్రాయాలను ప్రచురించే వాడు. నిజాం మొండి తనానికి, రజాకార్ల ఉన్మాదానికి ఎక్కువ బలవుతోంది పేద ముస్లిం కుటుంబాలు, యువకులేనని ఎన్నో సార్లు ఆవేదన చెందాడు. రచనల ద్వారా బహిర్గతం చేశాడు.

కమ్యూనిస్టులు, ఆర్యసమాజ్ వారు, విద్యార్థులు, యూత్ లీగ్ ఎవరు పోరాటాలు చేసినా తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటం వార్తలన్నీ ప్రముఖంగా ప్రచురించాడు. హైదరాబాద్ ఇండియాలో విలీనం కావడమనేది షోయబుల్లా ఖాన్ కల. లక్ష్యం. దాని కోసం ఆత్మార్పణ కైనా సిద్ధ పడ్డాడు. నడి రోడ్డు మీద ప్రాణాలను బలి పెట్టాడు. రజాకార్ల నాయకుడు ఖాసీం రజ్వీ 1948 ఆగష్టు 19 సభలో షోయబ్ చేతులు నరికి వేస్తామని బహిరంగం గానే హెచ్చరించాడు.

1948 అగష్టు 21న.. కాచిగూడ లోని రైల్వే స్టేషన్ రోడ్ లో ఇమ్రోజ్ ఆఫీసులో పని పూర్తి చేసుకుని అర్ధ రాత్రి బావమరిది ఇస్మాయిల్ ఖాన్ తో కలిసి ఇంటికి బయలు దేరిన షోయబుల్లాను ఒక్కసారిగా పదిమంది దుండగులు చుట్టుముట్టి

ఆయన వార్తలు రాసే కుడి అర చేతిని ముష్కరులు నిర్దాక్షిణ్యంగా నరికి వేశారు. అడ్డుకో బోయిన ఇస్మాయిల్ నూ తీవ్రంగా గాయ పరిచి గానీ వదల్లేదు. నెత్తిటి మడుగులో కొట్టుమిట్టాడిన షోయబుల్లాను ఉస్మానియా ఆసుపత్రికి తరలించగా 1948 ఆగస్టు 22 న తెల్లవారు జామున షోయబ్ తుది శ్వాస విడిచాడు. నిజాం సర్కార్ షోయబ్ అంతిమ యాత్రను నిషేధించింది. అంతిమ యాత్ర పోలీసు బందూకుల మధ్య జరిగింది. గోషామహల్ మాలకుంట శ్మశాన వాటికలో ఆయన ఖననం జరిగింది.

**రామ కిష్టయ్య సంగన భట్ల**
**9440595494**

# అరుణ కవిత్వం.. అవలోకనం


"లోకానికి అక్షరాలు అప్పు పడ్డాను/అందుకే కవిత్వం రాస్తున్నా అంటూ రెండు దశాబ్దాలుగా కవిత్వాన్ని రాస్తూ ఇటీవల అస్తమించిన ఉత్తమ కవయిత్రి ఎన్.అరుణ. తెలుగు సాహిత్యంలో రచయిత్రుల సంఖ్యతో పోలిస్తే కవయిత్రుల సంఖ్య పరిమితం అని చెప్పవచ్చు. కానీ వారి ప్రభావం చెప్పుకోదగినది. గ్రామీణ నేపథ్యం నుంచి వచ్చిన అరుణ మానవీయ విలువలను సంబంధాలను ఉట్టిపడేలా పాఠకులను అనుభూతి చెందేలా మరోవైపు ఆలోచింపచేసేలా కవితల్ని రాసి మరి ఎంతోమంది కవయిత్రులకు మార్గదర్శనం చేసిన మానవీయ కవయిత్రి అరుణ. నిరంతరం కవిత్వాన్ని శ్వాసిస్తూ ఒకవైపు సృజనాత్మక రంగంలోనూ మరోవైపు పరిశోధన రంగంలోనూ అందె వేసిన సుప్రసిద్ధ కవి ఆచార్య ఎన్ గోపి గారి శ్రీమతి అరుణ. ప్రతి పురుషుని విజయం వెనుక ఒక స్త్రీ ఉంటుందన్న నానుడిని నిజం చేస్తూ అందుకు ఉదాహరణగా ఆమెను చెప్పవచ్చు. ఒకవైపు కుటుంబ బరువు బాధ్యత నిర్వహిస్తూనే అంతర్లీనంగా ఆమెలో ఆవహించిన ఆర్ద్రత ఆ కవయిత్రి హృదయం నుంచి "మౌనము మాట్లాడుతుంది" అనే కవితా సంపుటి నుండి పాటల చెట్టు, గుప్పెడు గింజలు, అమ్మ ఒక మనిషి, హృదయమే వదనం, సూది నా జీవన సూత్రం, నిరీక్షణే ఒక గాయం అనే పేరుతో ఏడు కవితా సంపుటాలను వెలువరించింది. గోపి అరుణ దంపతులు ఇరువురు ఏకధాటిగా కవిత్వాన్ని వెలువరిస్తూ తెలుగు కవిత్వాన్ని సంపన్నం చేశారు. ముఖ్యంగా 2013లో అరుణ కవిత్వాన్ని విశ్లేషిస్తూ 48 మంది కవి పండితులు అరుణ కవిత్వం అవలోకనం పేరుతో డాక్టర్ నీరజ జవ్వాజి సంపాదకత్వంలో విశ్లేషణ గ్రంథాన్ని వెలువరించారు.

అరుణ తీసుకున్న వస్తువు ఏదైనా దాన్ని కవిత్వీకరించడంలో సిద్ధహస్తురాలు. సంపాదకీయ వ్యాసంలో చెప్పినట్టుగా "కవిత్వం వ్యక్తిత్వం రెండు వేరువేరుగా, తూర్పు పడమరల్లా ఉన్న కాలంలో అరుణ గారి వ్యక్తిత్వం కవిత్వంలో ఉషోదయమంత వాస్తవంగా వ్యక్తమైంది"అన్న సంపాదకుల మాటలు అక్షర వాస్తవాలు. "కుప్పనూర్చి, వడ్లను తూర్పార బడితే, తాలు గాలికి కొట్టుకుపోయి, మిగిలిన గట్టి గింజల్లా, నా అక్షరాలు" అంటూ ఆమె చెప్పిన మాటలు మాగిన పండులా పండిన ఆమె అనుభవంలో నుంచి వచ్చిన ప్రతీ కవితకు వర్తిస్తుంది అంటే అతిశయోక్తి కాదు. దంపతులు ఇరువురు కవిత్వం రాసే వాళ్ళు కాబట్టి అది గమనంలోకి తీసుకొని "కవిత్వం అలా ఎగురొచ్చి, మా ముంగిట్లో వాలుతుంది, అక్షరాల గింజల కోసం" అని భావుకతతో భావ గర్భితంగా చెప్పింది. జీవన ప్రస్థానంలో అప్పుడప్పుడు మనిషి లక్ష్యసాధనలో నిరాశ నిస్పృహలకు గురవడం సహజం. కానీ దానివల్ల కృంగిపోకుండా మనిషి ఆశాజీవిగా బ్రతకాలని చెబుతూ "శిశిరంలో మోడువారినప్పుడు, చిలుకలే ఆకులు, ఎర్రని ముక్కులే మొగ్గలు అని ప్రబోధిస్తుంది. పచ్చదనానికి చిలుకలను ఎర్రదనానికి వాటి ముక్కులను సంకేతించడం కవయిత్రిగా ఆమె ప్రతిభకు నిదర్శనం. ప్రపంచీకరణ, పట్టణీకరణ పెరగడంతో పర్యావరణం దెబ్బతింటుందని గుర్తు చేస్తూ అక్కడ చెట్టు, చేమ లేక గూళ్లను ఏర్పాటు చేసుకోలేని పక్షుల నిస్సహాయతను వ్యక్తం చేస్తూ "ఇంత పిట్టవు, ఈ ప్రపంచంలో నువ్వు పట్టవు?" అని మనలో లేని పట్టింపుతనాన్ని గుర్తుచేస్తుంది. ఆడపిల్లలను గుండె మీద కుంపటిగా భావించే సంప్రదాయాన్ని వారిని స్వాభిమాన లతలుగా కీర్తిస్తూ "గుండెల మీద కుంపట్లు, ఎప్పటి మాట, గుండె గూటిలో వెన్నెల దీపాలు, అడవిలో మానులు కాదు, జనారణ్యంలో కదిలే కాంతి దీపాలు" అని అమ్మాయిలలో ఆత్మవిశ్వాసాన్ని ప్రోది చేస్తుంది.

అందుకే "మనసులో వెలిగే, అపురూప చైతన్య దీపాన్ని, నిరంతరం కాపాడుకోవటమేగా, జీవితమంటే" అని వ్యాఖ్యానిస్తుంది. అరుణ ప్రతి కవితలో ఆర్ద్రత అంతర్వాహినిగా ప్రవహిస్తుంది. "వచ్చేటప్పుడు ఏం వెంట తెచ్చానో తెలియదు/పోయేటప్పుడు ఏం తీసుకెళ్తానో కూడా తెలియదు/ఈ అనుభవాల జ్ఞాపకాలే కదా జీవితం" అంటూ ఆమె రాసిన వాక్యాలు జీవన భాష్యంగా చెప్పవచ్చు. ఈ సందర్భంగా కదిలించే కవిత్వం రాసి కానరానిలోకాలకు వెళ్లిన అరుణ గారికి అక్షర నివాళు లర్పిస్తున్నాను.

**డాక్టర్ శంకరమంచి శ్యాంప్రసాద్ 9989148305**

# "హిందూ మతం"
## సంప్రదాయాలపై అనేక విమర్శలు



హిందూ మతంపై అనేక విమర్శలు వచ్చాక దాన్ని సంస్కరించి వ్యాఖ్యానించే క్రమంలో "హిందు"అనే పద ప్రయోగం.. ఒక "మతం"కాదు. అది ఒక "జీవన విధానం" అంటూ ఇటీవల కాలంలో ఆధునిక బాబాలు, స్వామీజీలు దానిని మరో కోణంలో "లౌక్యం" గా వ్యాఖ్యానించటం మొదలు పెట్టారు.నిజానికి చారిత్రక క్రమంలో "హిందు"... అనేది ఒక మతంగా,ఒక మత ధర్మం గానే, "మత క్రతువు"గానే ఆచరింప బడుతూ వస్తుంది. ఇప్పటికీ కొంత మేరకు "హిందూ మతం" లో కరుడుగట్టిన "దృఢత్వం" "రిజిడిటీ" సంప్రదాయాల ఆచరణలో కొంత "సరళీకరణ" (ఫ్లక్సిబిలిటీ) కనిపిస్తున్న.. ఇంకా "ఇంగువ గట్టిన గుడ్డ" వాసన కంపు (వాసన) పోలేదు. పైపై మెరుగులు కొంత విద్యవల్ల, పట్టణ జీవితం వల్ల, మీడియా ప్రభావం వల్ల, విదేశీ ప్రయాణాల వల్ల.. అక్కడ సామాజిక జీవితం ప్రభావంతో, సామాజిక, స్థితి,చేతల్లో వచ్చిన నాగరికత (పట్టణ జీవితం విధానంలో) కొంత మేరకు పైపై మెరుగులుగా మార్పులు కనిపిస్తాయి.అయితే ఆ మార్పు (మౌలిక, గుణాత్మక మార్పు కాదు). వివాహం, చావు, పుట్టుక, కుల, గోత్రాల ప్రసక్తి ఆయా సందర్భాలలో ప్రధాన భూమిక పోషిస్తుంది. సామాజిక మార్పు కాల ప్రవాహంలో కొద్ది, కొద్దిగా మార్పు సంస్కృతి (అంతర్గత మార్పు)లో భాగంగా కొన్ని మార్పులు తెస్తుంది.దీనినే సోషియాలజీలు "సోషల్ చేంజ్" అంటున్నారు.

నెమ్మదిగా సామాజిక జీవనంలో మార్పులు తెస్తుంది.అని ఎం.ఎన్. శ్రీనివాస్,ఎ.సీ.దూబే, మొదలైన సోషయాలజిస్టులు,సర్వేపల్లి రాధాకృష్ణన్, ఆచార్య, రజనీష్, మొదలైన తాత్వికులు, మజూందార్, ఆర్.ఎస్, శర్మ, ఈహెచ్ కార్, మొదలైన చరిత్ర కారులు, హిందూ మతంలో సంప్రదాయాలు (ముఖ్యంగా కుల వ్యవస్థ, మూఢనమ్మకాలు, స్త్రీలపై వివక్ష, పిత్రుస్వామ్య వ్యవస్థ,వేదాల అధికారం, రిచ్యువల్స్) ఇవి అన్నీ హిందూ మతంలో కొనసాగిన దుర్మార్గమైన,(అనాచారం) అంశాలే అంటారు.ఇటీవల "హిందుత్వ" అనే ట్రెండ్ మొదలైంది.సనాతన ధర్మానికి కొత్త, అర్థాలు, కొత్త నిర్వచనాలు ఇవ్వటం మనం చూస్తున్నాం.అంటే పాత హిందూ మతానికి, హిందుత్వ అనే పొలిటిసైజ్ కావటంతో దానికి ఉన్న పాత అవలక్షణాలతో పాటు "హింస" తోడై "రాజకీయ రంగు' పులుముకుని,ఓటు బ్యాంకు రాజకీయాలుగా మారి, మైనార్టీ మతాలను ద్వేషించి,"అరాజక" (ఆనార్కీ) 'గూండా" తత్వాన్ని ఉత్తర ప్రదేశ్ లో యోగీ ఆదిత్య నాథ్ పరిపాలనలో, కేంద్ర ప్రభుత్వం అండదండలతో మరింత వికృత రూపాన్ని సంతరించుకుంది.చరిత్రలో పలువురు మేధావులు, తాత్వికులు, రుషులు, బౌద్ధులు, జైనులు అలాగే ఆనాటి సంఘ సంస్కర్తలు నుండి హిందూ మతం/హిందూ ఇజం అనేక విమర్శలను ఎదుర్కొన్నాయి. ఈ విమర్శలు ప్రాచీన కాలం నుండి ఆధునిక యుగం వరకు విస్తరించాయి. సామాజిక సమానత్వం, హేతువాదం మరియు మానవీయతలను ప్రోత్సహించే ఉద్దేశ్యంతో. కాల క్రమాను సారంగా (క్రీ.పూ. నుండి 20వ శతాబ్దం వరకు) విమర్శకుల వారి ఖండనల సారాంశం:

**చార్వాకులు (లోకాయత దర్శనం, క్రీపూ. 600లు):**
ప్రాచీన భారతీయ మెటీరియలిస్ట్ తాత్వికులు అయిన చార్వాకులు హిందూ మతంలోని వేదాల అధికారం, దేవతలు, మూర్తి పూజ (విగ్రహారాధన), కర్మ సిద్ధాంతం, పునర్జన్మ వంటి అంశాలను తిరస్కరించారు. ఇది హెటెరోడాక్స్ స్కూల్‌గా, ప్రత్యక్ష ప్రమాణం (డైరెక్ట్ పర్సెప్షన్) మాత్రమే జ్ఞాన మూలమని వాదించింది. హిందూ ఆర్థడాక్సీని మూఢత్వంగా విమర్శించారు, మత ఆచారాలు లేకుండా జీవితం సాధ్యమని, ఎథిక్స్ బుద్ధిజనితమని ఖండించారు.

**మహావీర (జైన మత స్థాపకుడు, క్రీపూ. 599-527):**
జైన తాత్వికుడు అయిన మహావీర హిందూ మతంలోని వేదాల అధికారం, దేవతలు, రిచ్యువల్స్, కుల వ్యవస్థ వంటి అంశాలను ఖండించారు. జైనిజం అథీస్టిక్ క్రీడ్‌గా, అహింసా, కర్మ, సమానత్వాన్ని ప్రోత్సహించి, హిందూ ఆచారాలను సామాజిక అన్యాయాలకు కారణమని విమర్శించారు. హిందూ బ్రాహ్మణిక సంప్రదాయాలను తిరస్కరించి, సమాన సమాజాన్ని ప్రతిపాదించారు.

**గౌతమ బుద్ధ (బౌద్ధ మత స్థాపకుడు, క్రీపూ. 563-483):**
బౌద్ధ తాత్వికుడు అయిన బుద్ధ హిందూ మతంలోని ఆత్మ (ఆత్మన్), వేదాల అధికారం, కుల వ్యవస్థ, రిచ్యువల్స్, మూఢనమ్మకాలు వంటి డాక్ట్రిన్స్‌ను తిరస్కరించారు. బుద్ధిజం అథీస్టిక్‌గా మొదలై, కర్మ సిద్ధాంతాన్ని ఉంచి, హిందూ సంప్రదాయాలను సామాజిక దాస్యానికి మూలమని ఖండించారు. ఆయన బోధనలు హిందూ ఆర్థడాక్సీపై విమర్శలుగా పరిగణించ బడతాయి. సమానత్వం మరియు మధ్యమ మార్గాన్ని ప్రోత్సహించారు.

**రాజా రామ్ మోహన్ రాయ్ (1772-1833):**
"బ్రహ్మ సమాజ స్థాపకుడు" అతను సతీసహగమనం, బాల్య వివాహాలు, మూర్తి పూజ వంటి హిందూ ఆచారాలను ఖండించారు. "సతీసహగమనం హిందూ మతంలో, మహిళలపై హింస" అని విమర్శించి, 1829లో దానిని చట్టపరంగా నిషేధించేలా చేశారు. వేదాలు-ఉపనిషత్తులను ఆధారంగా చేసుకుని,వేల సంవత్సరాలుగా కొనసాగుతున్న మూఢ ఆచారాలను "వేదాలకు విరుద్ధం" అని ఆయన ప్రకటించి, ఖండించారు.

**స్వామి దయానంద సరస్వతి (1824-1883):**
ఆర్య సమాజ స్థాపకుడైన దయానంద సరస్వతి... మూర్తి పూజ, జాతి వ్యవస్థ, పురాణాలు, మూఢనమ్మకాలు వంటి హిందూ ఆచారాలను ఖండించారు. "వేదాలు తప్ప మిగిలిన ఆచారాలు మూఢత్వాలు" అని విమర్శించి, "సత్యార్థ ప్రకాశ్" అనే గ్రంథంలో హిందూ పురాణాలు, జాతి విభజనలను ఖండించారు. "వ్రత్య సంస్కార" ద్వారా సామాజిక సమానత్వాన్ని ప్రోత్సహించారు.

**స్వామి వివేకానంద (1863-1902):**
రామకృష్ణ మిషన్ స్థాపకుడైన వివేకానంద జాతి వ్యవస్థ, బ్రాహ్మణుల ప్రాబల్యం, మూఢనమ్మకాలు, స్త్రీలపై వివక్ష వంటి హిందూ ఆచారాలను ఖండించారు. "జాతి వ్యవస్థ హిందూ మతాన్ని బలహీనపరుస్తోంది" అని విమర్శించి, 1893 చికాగో మతాల సభలో "హిందూ ఆచారాలలోని మూఢత్వాలు మన సంస్కృతిని నాశనం చేస్తున్నాయి" అని ప్రసంగించారు. స్త్రీ శిక్షణ మరియు సామాజిక సమానత్వాన్ని ఆయన ప్రోత్సహించారు.

**మహాత్మా గాంధీ (1869-1948):**
గాంధీ జాతి వ్యవస్థ, అస్పృశ్యత, ద్రవ్యాసక్తి, మూఢనమ్మకాలు వంటి హిందూ ఆచారాలను ఖండించారు. "జాతి వ్యవస్థ హిందూ మతానికి కారు చిచ్చు" అని విమర్శించి, అస్పృశ్యులను " హరిజనులు" అని పిలిచి, వారి హక్కుల కోసం గట్టిగా పోరాడారు. భక్తి మార్గాన్ని ఆధారంగా చేసుకుని, జాతి వివక్షను అహింసా సూత్రానికి విరుద్ధమని ఖండించారు. హిందూ ఆచారాలను స్వరాజ్‌కు అడ్డుకట్టగా చూశారు. "రామ్... రహీం" ఏక్ హై అన్నారు.తన జీవితాన్ని ఓ హిందూమత ఉన్మాది చేతిలో మహాత్మాగాంధీ మరణించారు.ఆ తర్వాత కాంగ్రెస్ పార్టీ నేత ఆనాటి హోం మంత్రి సర్దార్ వల్లభాయ్ పటేల్.. ఆరెస్సెస్ దేశానికి ప్రమాదం అని ప్రకటించారు. విచిత్రంగా ఆ ఆరెస్సెస్, హిందూ జనసభ, జన సంఘ్,బీజేపీ వాళ్ళు సర్దార్ వల్లభాయ్ పటేల్ ను గోప్ప విగ్రహాన్ని నిర్మించి, ఆవిష్కరించారు. సర్దార్ వల్లభాయ్ పటేల్ తమ వాడు ఆని చెప్పుకుంటారు.

**పెరియార్ ఈ.వి. రామస్వామి (1879-1973):**
ద్రావిడ కార్యకర్త అయిన పెరియార్ బ్రాహ్మణిక హిందూఇజం ద్వారా కుల వివక్ష, స్త్రీల దమనం, మూఢనమ్మకాలు ప్రోత్సాహించబడుతున్నాయని ఖండించారు. "హిందూ మతం బ్రాహ్మణుల ఆధిపత్యానికి మాయమే" అని సెల్ఫ్-రెస్పెక్ట్ మూవ్‌మెంట్ ద్వారా విమర్శించారు. హిందూ దేవతలు, మను స్మృతి వంటివి బ్రాహ్మణుల సాధనాలుగా చూశారు. అథీస్ట్‌గా, హిందూఇజం సామాజిక దాస్యానికి మూలమని వాదించారు.

**ఎం.ఎన్. రాయ్ (1887-1954):**
మార్క్సిస్ట్ హ్యూమనిస్ట్ అయిన రాయ్ హిందూ ఇజంలో కులం, పితృ స్వామ్యం, స్త్రీలు-లైంగిక మైనారిటీల దమనం, మత ఆధిపత్యం వంటివి ఖండించారు. హిందూ సంస్కృతి మనిషిని దేవుని ఇచ్ఛకు లొంగదీస్తుందని విమర్శించారు. మతాన్ని సామాజిక ప్రగతికి అడ్డంకిగా చూశారు, హిందూఇజం సబ్‌మిషన్ సంస్కృతిని ప్రోత్సహిస్తుందని వాదించారు.

**డా. బి.ఆర్. అంబేద్కర్ (1891-1956):**
రాజ్యాంగ నిర్మాత అయిన అంబేద్కర్ అస్పృశ్యత, మహిళలపై అన్యాయాలు, జాతి వ్యవస్థ వంటి హిందూ ఆచారాలను ఖండించారు. "జాతి వ్యవస్థ మానవ హక్కులకు విరుద్ధం" అని విమర్శించి, 1956లో బౌద్ధ మతంలోకి మారి, "హిందూ ఆచారాలు దళితులను బానిసలుగా మార్చాయి" అని ప్రకటించారు. "అన్నిహిలేషన్ ఆఫ్ కాస్ట్"లో మను స్మృతిని తీవ్రంగా విమర్శించారు.ఈ హిందూ మతం తో " ఒక జాతినీ,ఒక నీతి నీ " నిర్మించలేరు. అని విమర్శించారు.

**నార్ల వెంకటేశ్వర రావు (1908-1985):**
తెలుగు హేతువాది అయిన నార్ల హిందూ మతంలోని మూఢనమ్మకాలు, కర్మ సిద్ధాంతం, భగవద్గీత వంటి గ్రంథాలను ఖండించారు. "%బష్త్రవ ఎతీబ్ష్త్ర ాఎశీబ్ ష్త్రవ +ఖ్శు%"లో భగవద్గీతను అనైతికమైనదిగా విమర్శించి, హిందూ ట్రెడిషన్‌ను రేషనల్ దృష్టితో పరిశీలించాలని వాదించారు.

**ఇన్నయ్య నరిశెట్టి (1937-2022):**
హ్యూమనిస్ట్ అయిన ఇన్నయ్య మతాలు (ముఖ్యంగా హిందూఇజం) పిల్లలపై బలవంతంగా రుద్దడం, మూఢనమ్మకాలు ప్రోత్సహించడం వంటివి ఖండించారు. సెంటర్ ఫర్ ఇంక్వైరీ ద్వారా హిందూఇజం విమర్శలు చేశారు. మతాలు మానవ నిర్మితమైనవే అని, సైంటిఫిక్ హ్యూమనిజం ప్రోత్సహించారు.ఈ విమర్శలు హిందూ మతాన్ని సంస్కరించి, మరింత సమానత్వవాదిగా మార్చడానికి దోహదపడ్డాయి, భారతదేశంలో చట్టాలు మరియు సామాజిక ఉద్యమాలకు ప్రేరణగా నిలిచాయి. మరిన్ని వివరాలకు సంబంధిత గ్రంథాలను సంప్రదించండి.



**డాక్టర్ కోలాహలం రామ్ కిశోర్**
**9849328496.**




# బడుల తనిఖీకి టీచర్ల బృందాలు

తెలంగాణ రాష్ట్రం ప్రభుత్వ పాఠశాలల్లో విద్యా నాణ్యతను పెంపొందించేందుకు పర్యవేక్షణ వ్యవస్థను మరింత బలోపేతం చేయాలని నిర్ణయించింది.ఈ క్రమంలో విద్యాశాఖ టీచర్ల (కమిటీల)ను తనిఖీ బృందాలుగా రంగంలోకి దింపేందుకు సిద్ధమవుతోంది. ప్రతి వంద ప్రాథమిక, ప్రాథమికోన్నత పాఠశాలలకు ఒకటి చొప్పున, ప్రతి యాభై ఉన్నత పాఠశాలలకు ఒక కమిటీని నియమించనున్నారు. ఈ కమిటీలు ప్రతి మూడు నెలలకు నిర్దేశిత లక్ష్యాలను సాధించడం, ప్రతి వారం డీఈఓలకు నివేదికలు సమర్పించడం వంటి బాధ్యతలు చేపడతాయి.



రాష్ట్రవ్యాప్తంగా 16,474 ప్రాథమిక పాఠశాలలకు 168 కమిటీలు, 3,100 ప్రాథమికోన్నత పాఠశాలలకు 35 కమిటీలు, 4,672 ఉన్నత పాఠశాలలకు 96 కమిటీలు ఏర్పాటు కానున్నాయి. ప్రాథమిక కమిటీలకు హెచ్‌ఎంలు, ప్రాథమికోన్నత పాఠశాల కమిటీలకు స్కూల్ అసిస్టెంట్లు నోడల్ అధికారులుగా ఉంటారు. హై స్కూల్ కమిటీలకు గెజిటెడ్ హెచ్‌ఎంలు నాయకత్వం వహించనున్నారు. ఈ కమిటీల్లో సబ్జెక్ట్ టీచర్లు, పీఈటీలు సభ్యులుగా వ్యవహరిస్తారు.

ఇంతకుముందు ఈ కమిటీల నియామకం గత మే నెలలోనే జరగాల్సి ఉన్నప్పటికీ, ఉపాధ్యాయ సంఘాల వ్యతిరేకతతో నిలిపివేయబడింది. అప్పట్లో ప్రాథమిక, ఉన్నత పాఠశాలలకు కలిపి ఒకే కమిటీ ఏర్పాటు చేసి, దానికి స్కూల్ అసిస్టెంట్‌ను నోడల్ అధికారిగా నియమించడం వివాదాస్పదమైంది. "జూనియర్ టీచర్లు సీనియర్లను ఎలా పర్యవేక్షి స్తారు?" అనే ప్రశ్నలతో చర్చ చెలరేగింది. ఫలితంగా ప్రభుత్వం వెనక్కి తగ్గింది. ఈసారి మాత్రం వేర్వేరు స్థాయిలకు వేర్వేరు కమిటీలు ఏర్పాటు చేస్తూ, ఆ లోపాన్ని సరిదిద్దే ప్రయత్నం చేస్తోంది.ప్రభుత్వ పాఠశాలలను ప్రైవేట్ పాఠశాలలకు దీటుగా నాణ్యమైన విద్య అందించాలనే ప్రభుత్వ ఉద్దేశ్యం ప్రశంసనీయమే. అయితే, ప్రస్తుతం విద్యాశాఖలో వివిధ కేటగిరీల్లో డీఈఓలు, డిప్యూటీ డీఈఓలు, ఎంఈఓలు,పీజీ హెచ్‌ఎంలు, పిఎస్‌హెచ్‌ఎంలు, స్కూల్ అసిస్టెంట్లు, పండిట్లు, ఎస్జీటీలు, పీఈటీలు, క్రాఫ్ట్ టీచర్లు వంటి పోస్టులు సుమారు 20 వేలకు పైగా ఖాళీగా ఉన్నాయని సమాచారం. ఈ ఖాళీలను భర్తీ చేయకపోవడం వల్ల బోధన, పర్యవేక్షణ రెండింటిలోనూ లోపాలు తలెత్తుతున్నాయి.

ఇలాంటి పరిస్థితుల్లో ఇప్పటికే బోధనా భారంతో నిండిన ఉపాధ్యాయుల భుజాలపై పర్యవేక్షణ బాధ్యతలు కూడా వేయడం ఆందోళన కలిగిస్తోంది. బోధనాభ్యసన నాణ్యత తగ్గే ప్రమాదం ఉంది. ఖాళీలను ముందుగా భర్తీ చేసి, తర్వాత ఈ కమిటీ విధానాన్ని అమలు చేస్తే మరింత సానుకూల ఫలితాలు సాధ్యమవుతాయి.

అంతేకాకుండా, ఉపాధ్యాయులకు బోధనలో స్వేచ్ఛ లేకుండా చేస్తూ, బోధనతోపాటు బోధనేతర పనులు, పరిపాలనా పనుల ఒత్తిడులు పెరుగుతున్నాయి. ప్రైవేట్ పాఠశాలలు మాత్రం పర్యవేక్షణకు దూరంగా ఉన్నాయనే విమర్శలు ఉన్నాయి. "ప్రభుత్వ పాఠశాలలకే కఠిన పర్యవేక్షణ - ప్రైవేట్ బడులకు మినహాయింపు ఎందుకు?" అనే ప్రశ్నలు తల్లిదండ్రుల, విద్యావేత్తల నుంచి వినిపిస్తున్నాయి.

ప్రభుత్వం, ప్రైవేట్ రెండింటిపైనా సమాన పర్యవేక్షణ వ్యవస్థ ఉండడం తోపాటు బోధనీతర పనులు అప్పగించకూడదని న్యాయస్థానాల సూచనలు ఉన్నప్పటికీ ప్రభుత్వాలు అమలు జరపడం లేదు.పై అంశాలు పరిగణలోకి తీసుకున్నప్పుడు మాత్రమే విద్యా నాణ్యత పెరుగుతుందని ప్రజా సంఘాలు, పేరెంట్ కమిటీలు సూచిస్తున్నాయి.

వాస్తవానికి, పర్యవేక్షణ కోసం ప్రత్యేక సిబ్బందిని నియమించడం, ఖాళీ పోస్టులను తక్షణమే భర్తీ చేయడం ద్వారా విద్యా వ్యవస్థకు కొత్త ఊపు వస్తుంది. ఇది నిరుద్యోగలకు ఉద్యోగావకాశాలు కల్పించడమే కాకుండా, పాఠశాలల నాణ్యతను పెంచే దిశలో సుస్థిర ఫలితాలు ఇస్తుంది.

ఇప్పటికే ఎంఈఓలు, స్కూల్ కాంప్లెక్స్ హెచ్‌ఎంలు పర్యవేక్షణ బాధ్యతలు నిర్వర్తిస్తున్నందున, కొత్త కమిటీల అవసరంపై కూడా పునరాలోచన అవసరం ఉందని నిపుణులు అభిప్రాయ పడుతున్నారు.

ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు బోధన మరియు బోధనేతర పనులతో నిమగ్నమై ఉన్న నేపథ్యంలో మరిన్ని పరిపాలనా బాధ్యతలు మోపడం విద్యార్థుల అభ్యాసంపై ప్రతికూల ప్రభావం చూపవచ్చని తల్లిదండ్రులు, విద్యావేత్తలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

అందువల్ల, ప్రభుత్వం ఈ నిర్ణయాన్ని అమలు చేసేముందు విద్యావేత్తలు, మేధావులు, ఉపాధ్యాయ సంఘాలు, ఉన్నతాధికారులతో సమగ్ర సమీక్ష జరిపి సరైన విధానాన్ని అవలంబిస్తే అది విద్యా నాణ్యతకు, విద్యార్థుల భవిష్యత్తుకు నిజమైన మేలు చేస్తుంది.



**మేకిరి దామోదర్**
**సామాజిక విశ్లేషకులు**
**వరంగల్ 9573666650**

# ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ నిబంధనలు పాటించాలి

- డ్రంక్ అండ్ డ్రైవ్ చేసి వాహనాలు నడిపితే కఠిన చర్యలు
- మైనర్లకు వాహనాలు ఇస్తే తల్లిదండ్రులకు శిక్ష
- అడ్డదిడ్డంగా రోడ్ల పైన బండ్లు పార్కింగ్ చేస్తే ఫైన్
- డిఎస్పి సత్తయ్య గౌడ్, ట్రాఫిక్ ఇన్స్పెక్టర్ రామకృష్ణారెడ్డి



**సంగారెడ్డి టౌన్, అక్టోబర్ 16 (జనం సాక్షి) :** స్పెషల్ డ్రైవ్ గత మూడు రోజుల నుండి వాహనాల తనిఖీ చేసి శబ్ద కాలుష్య నియంత్రణ చేసేందుకు ప్రతిష్టాత్మకంగా చేపట్టిన స్పెషల్ డ్రైవ్ లో వాహనాల తనిఖీ లో దొరికిన 106 సైలెన్సర్లను సంగారెడ్డి డి.ఎస్.పి సత్తయ్య , ట్రాఫిక్ సిఐ రామకృష్ణారెడ్డి ఆధ్వర్యంలో రోడ్ రోలర్ తో సైలెన్సర్లను ధ్వంసం చేశారు. డ్రంక్ అండ్ డ్రైవ్ త్రిబుల్ రైడింగ్, మైనర్ డ్రైవింగ్, నెంబరు ప్లేట్లులేని వాహనాలపై, నెంబర్ ప్లేట్ సరిగా లేని వాహనాలపై, స్పెషల్ డ్రైవ్ నిర్వహించి సంగారెడ్డి ఈ సందర్భంగా డిఎస్పి సత్తయ్య మాట్లాడుతూ...రోడ్డు నిబంధనలు ట్రాఫిక్ నిబంధనలు పాటించి వాహనాలు నడిపి క్షేమంగా గమ్యస్థానాలకు చేరుకోవాలని, మోటార్ సైకిల్ వాహనదారులు తప్పకుండా హెల్మెట్ ధరించాలని, నాలుగు చక్రాల వాహనదారులు తప్పకుండా సీట్ బెల్ట్ పెట్టుకోవాలని తెలిపారు. మూడు రోజులు డ్రైవ్ కాకుండా నిరంతరం ప్రక్రియ కొనసాగుతుందని తనిఖీలు ముమ్మారంగా చేస్తామని ట్రాఫిక్ నిబంధనలు తప్పనిసరిగా పాటించాలని సూచించారు. ఈ సందర్భంగా ట్రాఫిక్ ఇన్స్పెక్టర్ రామకృష్ణారెడ్డి మాట్లాడుతూ.. జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు సంగారెడ్డి పట్టణంలో స్పెషల్ డ్రైవ్ నిర్వహించడం జరిగింది. రోడ్డు ప్రమాదాల నివారణ గురించి స్పెషల్ డ్రైవ్ నిర్వహిస్తున్నామని తెలిపారు. తల్లిదండ్రులు వాహన యజమానులు సరదాల గురించి పిల్లలకు వాహనాలు ఇవ్వవద్దని సూచించారు. ఏదైనా రోడ్డు ప్రమాదం జరిగితే కుటుంబం మొత్తం దుఃఖసాగరంలో మునిగిపోతుందని తెలిపారు.సరదా ఎప్పుడు కూడా విషాదంగా మిగల వద్దన్నారు. ప్రతి వాహనదారుడు రవాణా శాఖ ఉత్తర్వుల మేరకు నెంబర్ ప్లేట్ వాహనాలకు బిగించుకోవాలి, తరచుగా నెంబరు ప్లేట్ లేని వాహనాల చోదకులు వేగంగా నడుపుతూ తోటి వాహదారులను, పాదాచారులను, భయబ్రాంతులకు గురిచేస్తున్నందున నంబరు ప్లేట్లులేని వాహనాలపై స్పెషల్ డ్రైవ్ నిర్వహించామని తెలిపారు, మరియు మోటార్ సైకిల్ వాహనదారుడు తప్పకుండా హెల్మెట్ ధరించాలని, నెంబర్ ప్లేట్ లేని వాహనదారులు అజాగ్రత్తగా, అతివేగంగా వాహనాలు నడుపుతునందున్న ప్రమాదం జరిగే అవకాశం ఉందని, నెంబర్ ప్లేట్ నెంబర్ ప్లేట్ లేని వాహనాలను సీజ్ చేస్తామని హెచ్చరించారు. మోటార్ సైకిల్ పై ముగ్గురు ప్రయాణించ వద్దని, వాహనం నడిపే ప్రతి వ్యక్తి డ్రైవింగ్ లైసెన్స్ కలిగి ఉండాలని, ప్రతి ఒక్కరూ వాహనానికి సంబంధించిన డాక్యుమెంట్స్ వెంబడి ఉంచుకోవాలని త్రిబుల్ రైడింగ్, రాష్ డ్రైవింగ్ చేయవద్దని సూచించారు. మరియు మోటార్ సైకిల్ వాహన చోదకులు తప్పకుండా హెల్మెట్ ధరించాలని హెల్మెట్ బరువుగా కాకుండా బాధ్యతగా భావించాలని, హెల్మెట్ మా శాసనం కాదు మీ సంక్షేమం, హెల్మెట్ ఒక వస్తువు కాదు ప్రాణాన్ని కాపాడే ఆయుధం, రోడ్ చిన్నదైనా పెద్దదైన, పడితే ప్రమాదమే ఆదమరిస్తే విషాదమైన ఎక్కడైనా ఎప్పుడైనా చిన్నవారైన పెద్దవారైనా ప్రమాదం పొంచి ఉన్నదని ఎవరికెరుక అందుకే ద్విచక్ర వాహనాలు నడిపేటప్పుడు ప్రజలందరూ తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని సూచించారు. రోడ్డు నిబంధనలు ట్రాఫిక్ నిబంధనలు పాటించి వాహనాలు నడపాలని సూచించారు. నెంబర్ సరిగ్గా లేని వాహనాలపై కొంతమంది నేరస్తులు బండ్లపైన వచ్చి దొంగతనాలు చేయడం, చట్టవ్యతిరేకమైన కార్యక్రమాలు నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. తరచుగా స్పెషల్ డ్రైవ్ నిర్వహిస్తామని అన్నారు. మైనర్లకు వాహనాలు ఇస్తే యజమానులకు తల్లిదండ్రులకు శిక్ష, కఠిన చర్యలు ఉంటాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో టౌన్ సీఐ రమేష్ , రూరల్ సీఐ, క్రాంతి కుమార్, మహేష్, ఎస్సైలు రాజశేఖర్, మధుసూదన్ రెడ్డి, ట్రాఫిక్ ఎస్ఐలు సాయిలు, రాములు, ట్రాఫిక్ సిబ్బంది పాల్గొన్నారు.

## మహిళ స్వయం ఉపాధి శిక్షణకు 2 లక్షల 50వేల ఆర్థికసాయం



**మల్కాజిగిరి, అక్టోబర్ 16 (జనంసాక్షి) :** మహిళలు స్వయం ఉపాధినీ ఎంచుకొని ఆర్థికంగా ఎదగాలని మల్కాజిగిరి ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి, మాజీ కార్పొరేటర్ జగదీష్ గౌడ్ సూచించారు. మల్కాజిగిరి డివిజన్ సర్దార్ పటేల్ నగర్ మహిళ సమైక్య గ్రూప్ మహిళలకు స్వయం శిక్షణ ఉపాధి కొరకు మరియు మహిళలను ఆర్థికంగా ప్రోత్సహించడానికి మల్కాజిగిరి ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి లక్ష 50 వేలు, మాజీ కార్పొరేటర్ జగదీష్ గౌడ్ ఒక లక్ష రూపాయలు మొత్తం 2,50,000 రెండు లక్షల యాభై వేల రూపాయల ఆర్థిక సహాయం అందజేశారు. ఈ సందర్భంగా మాజీ కార్పొరేటర్ మాట్లాడుతూ, కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు కల్పిస్తున్న సంక్షేమ పథకాలు, రుణ సదుపాయాలను వినియోగించుకోవాలని సూచించారు. ఈ నిధులతో అవసరమైన కుట్టు యంత్రాలు ఇతర సామాగ్రి కొనుగోలు చేసి మహిళలు స్వయం ఉపాధిని ఎంచుకొని ఆర్థికంగా ఎదగాలని ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో సమైక్య గ్రూప్ సభ్యులు ప్రేమలత చంద్రకళ లలిత శారద జయశ్రీ వసంత, భాగ్యలక్ష్మి, మంజుల,తార,బిఆర్ఎస్ పార్టీ నాయకులు లక్ష్మణరావు, నీలం సతీష్, రాములు, శ్రీకాంత్, నవీన్ మరియు మహిళలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

# సబ్సిడీ విత్తనాలు రైతులు ఉపయోగించుకోవాలి

- ఎమ్మెల్యే కాలే యాదయ్య



**నవాబుపేట్, అక్టోబర్ 16 (జనం సాక్షి) :** నవాబుపేట మండల కేంద్రంలోని రైతువేదికలో నిర్వహించిన రైతు ఉత్పత్తిదారుల సంస్థ (ఎన్ఎఫ్ఎస్ఎం )పథకం కింద ఎకరాకు 25కిలోల శనగలు, 4 కిలోల తెల్ల కుసుమలు గురువారం ఏర్పాటు చేసిన సబ్సిడీ శనగ, కుసుమ విత్తనాల పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇందులో భాగంగా స్వయంగా రైతులకు శనగ, కుసుమ విత్తనాలను ప్రజాప్రతినిధులు, అధికారులతో కలిసి స్థానిక ఎమ్మెల్యే కాలే యాదయ్య పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ రైతులు పంట మార్పిడితో ఉత్పత్తి పెరిగి అధిక లాభాలు వస్తాయని అందువలన ఈ సబ్సిడీ విత్తనాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. రైతులు తక్కువ పెట్టుబడితో ఎక్కువ దిగుబడులు పొందేలా ఈ విత్తనాలను సబ్సిడీతో అందిస్తున్నామన్నారు. ఈ పథకం కింద 100 శాతం విత్తనాలు పంపిణీ చేస్తారన్నారు.రైతులకు పంటల తక్కువ పెట్టుబడి, ఎక్కువ లాభాల పై అవగాహన కల్పిస్తూ, ప్రభుత్వం అనేక పథకాలను తీసుకువస్తోందని, వాటిని గ్రామస్థాయిలో ప్రజలు పూర్తిగా వినియోగించుకోవాలని, పంటల విస్తరణ, సమర్థవంతమైన సాగు పద్ధతులు, నీటి వినియోగం పై అవగాహన కల్పించేందుకు ప్రభుత్వం ఎల్లప్పుడూ రైతులకు తోడుగా ఉంటుందని అన్నారు. ఈ కార్యక్రమంలో ఏఎంసీ చేర్మెన్ రాథోడ్ గీతాసింగ్, పిఏసీ ఎస్ చైర్మన్ పోలీస్ రాంరెడ్డి, జిల్లా వ్యవసాయ అధికారి రాజరత్నం,ఏ డిఓ వెంకటేష్,మండల వ్యవసాయాధికారి జ్యోతి, డిప్యూటీ తాహసిల్దార్ శ్రీలత, జిల్లా ఉద్యానవనం అధికారి సత్తార్,వికారాబాద్ మండల వ్యవసాయ అధికారి ప్రసన్నకుమారి,క్లస్టర్ అధికారులు, మల్లేష్, కావ్య, లక్ష్మి, ఆదిల్, పవన్,ఏ ఎంసీ డైరెక్టర్ లు నర్సింహా రెడ్డి, ఖదీర్, వెంకటేష్,నాయకులు, వివిధ గ్రామాల రైతులు తదితరులు పాల్గొన్నారు.

# సామాన్యుడికి వైద్యం అందుబాటులోకి రావాలి



**ఖైరతాబాద్, అక్టోబర్ 16 (జనం సాక్షి) :** హైబిజ్ టీవీ ఆధ్వర్యంలో హెల్త్ కేర్ మేనేజ్మెంట్ అవార్డ్స్- 25 మొదటి ఎడిషన్ గురువారం హైదరాబాద్ హెచ్ఐసీసీ నోవోటెల్లో ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమం హెల్త్ కేర్ రంగంలో అసాధారణమైన సేవలు అందించిన నిర్వాహకులు, సంస్థలు, వ్యక్తు లను సత్కరించడంలో ఒక మైలురాయిగా నిలిచిం ది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా తెలంగాణ హోమ్ విభాగం స్పెషల్ సెక్రటరీ సీ.వి.ఆనంద్ ఐపి ఎస్ హాజరై మాట్లాడుటూ హెల్త్ కేర్ మేనేజ్మెంట్లో ఆవిష్కరణలు, సమర్థవంతమైన నిర్వహణ ద్వా రా ప్రజల ఆరోగ్యానికి తోడ్పాటు అందించడంలో ఉన్న ప్రాముఖ్యతను ప్రత్యేకంగా హైలైట్ చేశారు. హెల్త్ కేర్ రంగం విజయం కేవలం వైద్యులపై మాత్ర మే కాకుండా, అందరూ కలిసి పనిచేసే నిర్వాహక బృందాలపై ఆధారపడి ఉంటుందని, సామాన్యుల కు అందుబాటు ధరలో వైద్యం ఉన్నప్పుడే వైద్య సేవకు పరిపూర్ణ అర్థం అని ఆయన అన్నారు. ఈ అవార్డ్స్ కార్యక్రమంలో హెల్త్ కేర్ మేనేజ్మెంట్ రంగంలో ఉత్తమ సేవలు అందించిన వారికి వివిధ కేటగిరీల్లో 50కి పైగా అవార్డులు ప్రదానం చేశారు. ముఖ్యంగా, ఈ రంగంలో దీర్ఘకాలికమైన సేవలు అందించిన డాక్టర్ హరి ప్రసాద్, డాక్టర్ కె.ఎన్. సుధా రమణలకు లెజెండరీ పురస్కారాలు అందా యి. అలాగే, ప్రభుత్వ ఆసుపత్రి సూపరింటెండెం ట్లు అయిన డాక్టర్ ఎన్.వాణి, డాక్టర్ బీరప్ప నగరి, డాక్టర్ రాకేష్ సహాయ్, డాక్టర్ విజయ్ కుమార్లకు స్పెషల్ జ్యూరీ అవార్డులు ప్రధానం చేశారు. ఈ కార్యక్రమంలో హైబిజ్ టివి సంస్థ ఫౌండర్, ఎమ్డి మాడిశెట్టి రాజగోపాల్ మాట్లాడు తూ ఈ అవార్డులు భవిష్యత్తులో మరిన్ని ఆవిష్కరణలకు ప్రేరణగా నిలుస్తాయని ఆశాభావం వ్యక్తం చేశారు. కాగా, ఈ కార్యక్రమం హెల్త్ కేర్ రంగంలోని ప్రముఖులు, నిర్వాహకులు, పాలసీ మేకర్లను ఏకం చేసి, భవిష్యత్ సవాళ్లపై చర్చలకు దోహదప డిందని అన్నారు. ఈ కార్యక్రమంలో సైబర్ సిటీ బిల్డర్స్ అండ్ డెవలపర్స్ సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ వేణు వినోద్, ఏఐజి హాస్పిటల్స్ డైరెక్టర్ డా.జివి రావు, ఆర్ఈ సస్టైనబిలిటీ ఎగ్జిక్యూటివ్ వైస్ చైర్మన్ గౌతమ్ రెడ్డి మెరెడ్డి, కిమ్స్ సన్షైన్ హాస్పిటల్స్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ డా.ఆదర్శ్ అన్నపరెడ్డి, పల్స్ ఫార్మసుటికల్స్ డైరెక్టర్ దివ్య మైనేని, కన్వర్జ్ బయోటెక్ ఫౌండర్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్ అరుణ్ కుమార్ బిజ్జెళ్ల, క్రెడాయ్ మాజీ ప్రెసిడెంట్ వి.రాజశేఖర్ రెడ్డితో పాటు పలువురు ప్రముఖులు పాల్గొన్నారు.

## సైబర్ సెక్యూరిటీ పెంపొందించుకోవాలి



**మొయినాబాద్, అక్టోబర్ 16 (జనం సాక్షి) :** సైబర్ సురక్షితంగా ఉండటం అభివృద్ధి చెందుతున్న సాంకేతికతలకు అనుగుణంగా ఉండటం ప్రాముఖ్యతను తెలుసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందని సైబరాబాద్ కమిషనరేట్ రాజేంద్రనగర్ జోన్ అదనపు డీసీపీ కె.ఎస్.రావు అన్నారు. గురువారం మొయినాబాద్ పోలీస్ స్టేషన్ పరిధిలోని గ్లోబల్ ఇంజనీరింగ్ కళాశాలలో సైబర్ సెక్యూరిటీ క్లబ్ అనే పేరుతో గ్లోబల్ ఇంజనీరింగ్ కళాశాలలో నూతనంగా ఇది సైబర్ సెక్యూరిటీ క్లబ్ ను కళాశాల యజమాన్యం ఏర్పాటు చేయగా దీన్ని ప్రారంభించడానికి ముఖ్య అతిథిగా డీసీపీ కె.ఎస్.రావు పాల్గొని ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ.. సైబర్ సురక్షితంగా ఉండటం అభివృద్ధి చెందుతున్న సాంకేతికతలకు అనుగుణంగా ప్రాముఖ్యతను తెలుసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. పోలీస్ కోర్సులో ముఖ్యంగా సైబర్ క్రైమ్ ఇన్విటేషన్ డిజిటల్ ఫోరెన్సి లో కెరియర్లను అన్వేషించామని విద్యార్థులకు సూచించారు. ఇది సవాలుతో కూడిన ప్రతి ఫలదాయకమైన మార్గం గా గుర్తించారు. సైబర్ నేరగాళ్ల రకరకాలుగా ఉంటారని వారిని పట్టుకునేందుకు తగు జాగ్రత్తలు తీసుకోవడంలో నిక్షిప్తంగా ఉండవలసిన బాధ్యత ఉంటుందని సైబర్ క్రైమ్స్ ఇన్స్పెక్టర్ ఆఫ్ పోలీస్ సాయి ప్రసాద్ పేర్కొన్నారు. గ్లోబల్ ప్రొఫెషనల్ కాలేజీల డైరెక్టర్ డాక్టర్ విద్యార్థులు సైబర్ అవగాహనకు రాయబారులుగా మారాలని కోరారు. బాధ్యతమైన ఇంజనీర్లను రూపొందించడంలో సైబర్ భద్రత విద్య యొక్క ప్రాముఖ్యతను వివరించారు. కళాశాల డీన్ డాక్టర్ రవీందర్ తివారి మాట్లాడుతూ..విద్యార్థులు క్రమశిక్షణ విద్యతోపాటు అన్ని రంగాలలో ముందుకెళ్లినప్పుడే ఉన్నత స్థాయికి ఎదుగుతారని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో గ్లోబల్ కళాశాల డైరెక్టర్ కెఎం.పాసుద్దీన్, కళాశాల టీం డాక్టర్ రవీంద్ర తివారి, ప్రిన్సిపాల్ డాక్టర్ రాజారావు, డాక్టర్ అహ్మద్ జి షాన్, ఎండి.ఫైసల్ అసెం, డాక్టర్ ఆయుబ్ హుస్సేన్ ఖాన్ అధ్యాపకులు విద్యార్థులు పాల్గొన్నారు.

# ఆర్టీసీ కాలనీ ఫేజ్-2 సమస్యలు పరిష్కారానికి కృషి



**హయత్నగర్, అక్టోబర్ 16 (జనం సాక్షి) :** మన్సూరాబాద్ డివిజన్ పరిధిలోని ఆర్టీసీ కాలనీ ఫేజ్-2లో కొత్త డ్రైనేజ్ లైన్, రోడ్డు పునర్ నిర్మాణం కోసం ఎల్.బి.నగర్ శాసన సభ్యులు దేవిరెడ్డి సుధీర్ రెడ్డి ని కాలనీవాసులు గతంలో కలవడం జరిగిందని, దానిలో భాగంగా సుధీర్ రెడ్డి కాలనీ నందు పర్యటించి సమస్యలు తెలుసుకున్నారు. ఈ సందర్భం గా కాలనీవాసులు మాట్లాడుతూ ఆర్.టీ.సీ.కాలనీ ఫేజ్-2 లో ప్రధాన డ్రైనేజ్ ట్రంక్ పైప్లైన్ పనిచేయకపోవడం వల్ల సాయిబాబా ఆలయ వీధి డ్రైనేజ్ లైన్ ఎత్తుగా మారిందని దీని వలన ప్రతి వర్షాకాలంలో వర్షపు నీరు, డ్రైనేజ్ నీరు నిలిచిపోవడం జరుగుతోందని వారు తెలిపారు. సుధీర్ రెడ్డి స్థానిక జీ.హెచ్.ఏం.సీ. అధికారులకు సమాచారం ఇవ్వగా జీ.హెచ్.ఎం.సీ.అధికారులు పరిశీలించి, పాత డ్రైనేజ్ లైన్ సరిగా పనిచేయడం లేదని, కొత్త లైన్ వేయాల్సిన అవసరం ఉందని వారు తెలిపారు. ఈ సందర్భంగా సుధీర్ రెడ్డి మాట్లాడుతూ కొత్త డ్రైనేజ్ లైన్ పనులకు, రోడ్డు పునరుద్ధరణ పనులు ప్రతిపాదనలు సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించారు. త్వరలోనే నిధులు మంజూరు చేయడం జరుగుతుందని, రాబోయే రోజుల్లో కాలనీవాసులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూస్తానని వారు హామీ ఇచ్చారు.

# వికారాబాద్ జిల్లా బీజేపీ అధ్యక్షుడు రాజశేఖర్ రెడ్డి రాజీనామా

- ఇక అంతర్గత కొమ్ములాటకు బ్రేక్ పడినట్లే
- అధ్యక్షుడు పనితీరు పట్ల ఎంపీ కొండ అసంతృప్తి
- కొత్త అధ్యక్షుడు ఎంపికపై ఆసక్తి



**వికారాబాద్ జిల్లా బ్యూరో, అక్టోబర్ 16 (జనం సాక్షి) :** బిజెపి జిల్లా పార్టీ నాయకుల మధ్య అంతర్గత కొమ్ములాటకు ఇక బ్రేక్ పడినట్లే. వికారాబాద్ జిల్లా బిజెపి పార్టీ అధ్యక్షులు డాక్టర్ రాజశేఖర్ రెడ్డి తన పదవికి గురువారం నాడు రాజనామా చేశారు. రాజనామా పత్రాన్ని జిల్లా బిజెపి పార్టీ అధ్యక్షులు రాజశేఖర్ రెడ్డి స్వయంగా అధిష్టాన వర్గానికి అందజేశారు. జిల్లా బిజెపి అధ్యక్షుడు రాజశేఖర్ రెడ్డి రాజనామంపై రాష్ట్ర బిజెపి పార్టీ ఏ నిర్ణయం తీసుకోలేదు. అధిష్టాన వర్గ సీనియర్ నాయకుల తో చర్చించి రాజీనామా విషయమై ఒక నిర్ణయం తీసుకునే అవకాశం ఉందని తెలుస్తుంది. డాక్టర్ రాజశేఖర్ రెడ్డి వికారాబాద్ జిల్లా బిజెపి పార్టీ అధ్యక్షుడిగా ఎంపికైన నుంచి జిల్లా బిజెపి పార్టీలో లుకలుకలు మొదలయ్యాయి. కొన్ని సంవత్సరాలుగా బీజేపీ జెండా మోస్తూ పార్టీ బలోపితం కోసం కృషి చేసిన క్రియాశీల నాయకులకు బిజెపి పార్టీ జిల్లా పగ్గాలు అప్పగించకుండా నాన్ లోకల్ నాయకుడికి జిల్లా పార్టీ అధ్యక్ష బాధ్యతను అప్పగించడం పట్ల జిల్లాలోని ఒక క్యాడర్ అసంతృప్తితో ఉంటూ పార్టీ కార్యక్రమాలకు దూరంగా ఉన్నారు. స్థానిక సంస్థల ఎన్నికలపై చేవెళ్ల ఎంపీ కొండ విశ్వేశ్వర్ రెడ్డి వికారాబాద్ లో జిల్లా స్థాయి సమీక్ష సమావేశం నిర్వహించినప్పుడు బిజెపి పార్టీ నాయకుల మధ్య ఉన్న అంతర్గత తగాదా కుమ్ములాటలుమీడియా ముఖంగా బయటికి వచ్చింది. అంతకంటే ముందు జిల్లా పార్టీ అధ్యక్షులుగా ఉన్న డాక్టర్ రాజశేఖర్ రెడ్డి మండలాల వారీగా కమిటీలను ఏర్పాటు చేస్తూ సమీక్ష సమావేశాలు నిర్వహించి బిజెపి పార్టీని క్షేత్రస్థాయిలో బలోపితం చేయడానికి కృషి చేశారు. కానీ లోకల్ నాన్ లోకల్ ఫీలింగ్ తో ఎన్నో ఏళ్లుగా బిజెపి పార్టీలో క్రియ పాత్ర పోషించిన సీనియర్ నాయకులంతా ఒక తాటిపైకి వచ్చి జిల్లా అధ్యక్షుడు నిర్వహించే పార్టీ సమావేశాలకు దూరంగా ఉన్నారు. దీంతో బిజెపి పార్టీలో ఉన్న సీనియర్ నాయకుల మధ్య మరింత అగాధం పెరిగింది. అంతేకాకుండా స్థానిక సీనియర్ నాయకులంతా ఒక వేదికగా మండల స్థాయి కమిటీలను నియమిస్తూ నిర్ణయం తీసుకున్నారు. దీంతో ఆ కమిటీలు చెల్లవని రాష్ట్ర కమిటీ స్థానిక నాయకులు వేసిన కమిటీలను గుర్తించదని జిల్లా బిజెపి పార్టీ అధ్యక్షులు రాజశేఖర్ రెడ్డి ప్రముఖంగా ప్రకటించారు. దీంతో స్థానికంగా కమిటీల్లో చోటు చేసుకున్న చోట బీజేపీ నాయకుల్లో అయోమయం ఏర్పడి అసంతృప్తికి దారి తీసింది. గతంలో జిల్లా మండల గ్రామస్థాయి కమిటీల్లో పనిచేసిన ముఖ్య నాయకులంతా రెండుగా చీలిపోయి రెండు వర్గాలుగా ఏర్పడ్డారు. ఒక వర్గం జిల్లా అధ్యక్షుడికి మద్దతు ఇవ్వగా మరో వర్గం స్థానిక సీనియర్ బిజెపి నాయకుల వెన్నంటే ఉంటూ పార్టీ కార్యక్రమాల్లో చురుకుగా పాల్గొన్నారు. వికారాబాద్ జిల్లా బిజెపి పార్టీలో ఏర్పడిన అంతర్గత తగాదా రాష్ట్ర బిజెపి పార్టీకి తలనొప్పిగా మారింది. చేవెళ్ల ఎంపీ కొండ విశ్వేశ్వర్ రెడ్డి రాష్ట్ర అధ్యక్షుడు దృష్టికి వికారాబాద్ జిల్లా బిజెపి పార్టీలో నెలకొన్న అసంతృప్తిపై అనేక దఫాలుగా చర్చించారు. వికారాబాద్ జిల్లా బిజెపి కమిటీలో నెలకొన్న అసంతృప్తిని త్వరలోనే పరిష్కరిస్తామని రాష్ట్ర అధిష్టాన వర్గం ప్రముఖంగా ప్రకటించవలసిన పరిస్థితి నెలకొంది. అయితే స్థానిక సంస్థల ఎన్నికల నోటిఫికేషన్ వెలుబడినందున అధ్యక్షుని మార్పుపై అధిష్టాన వర్గం ఏ నిర్ణయం తీసుకోలేదు. స్థానిక సంస్థల ఎన్నికల్లో బిజెపి నాయకులంతా అసంతృప్తి పక్కనపెట్టి పార్టీ అభ్యర్థుల గెలుపు కోసం సమిష్టిగా కృషి చేయాలని బిజెపి పార్టీ కిందిస్థాయి నాయకులకు సాంకేతాలు పంపించింది. ఇప్పుడు స్థానిక సంస్థల ఎన్నికలు వాయిదా పడడంతో బిజెపి పార్టీలో ఉన్న సమస్యలను తొలగించడానికి అధిష్టానం వర్గం కంకణం కట్టుకుంది. బిజెపి జిల్లా పార్టీ అధ్యక్షుడు డాక్టర్ రాజశేఖర్ రెడ్డిని పదవి నుంచి తప్పించడం అనివార్యం అయింది. బిజెపిలో అంతర్గతంగా చర్చించిన తర్వాత జిల్లా బిజెపి అధ్యక్ష పదవికి డాక్టర్ రాజశేఖర్ రెడ్డి రాజీనామా చేసినట్లు తెలుస్తోంది. దీంతో బిజెపి పార్టీలో నెలకొన్న అంతర్గత కొమ్ములాటకు తెరపడినట్లు అయింది. అయితే జిల్లా అధ్యక్ష పదవికి రాజీనామా చేసిన డాక్టర్ రాజశేఖర్ రెడ్డి రాజకీయ భవిష్యత్తు ఏమిటన్నది ప్రశ్నార్థకంగా మిగిలింది. తన రాజకీయ భవిష్యత్తు కోసం బిజెపి పార్టీలో కొనసాగుతారా లేక ఇంకో పార్టీలోకి మారుతారా అనే విషయం సందిగ్ధంలో ఉంది. ఇప్పటివరకు డాక్టర్ రాజశేఖర్ రెడ్డి వెన్నంటే ఉన్న బిజెపి నాయకులు కార్యకర్తల పరిస్థితి ఏమిటన్నది ప్రశ్నార్థకంగా మారింది. డాక్టర్ రాజశేఖర్ రెడ్డి రాజకీయ భవిష్యత్తు ఏమిటన్నది కొద్ది రోజుల్లో తేలనుంది అప్పటివరకు వేచి చూద్దాం...

## గుంతలమయంగా తాడూరు - చిట్యాల రోడ్డు

- కనీస మరమ్మతులు చేపట్టాలని డిమాండ్
- పట్టించుకోని అధికారులు పాలకులు..



**చేర్యాల, అక్టోబర్ 16 (జనంసాక్షి) :** జనగామ-సిద్దిపేట జాతీయ రహదారి ఆవరణలో తాడూరు క్రాస్ రోడ్డు నుంచి తాడూర్, చిట్యాల, దానంపల్లి, అర్జున్ పట్ల, కమలాయపల్లి ఇతర ప్రాంతాలకు వెళ్లే రహదారి అధ్వానంగా మారి ఆ రోడ్లపై ప్రయాణం చేయాలంటే వాహనదారులకు ఇటు ప్రయాణికులకు నరకప్రాయంగా మారింది. గుంతలయంగా మారడంతో ఆ రోడ్లపై ప్రయాణం చేసే వాహనదారులు ప్రమాదాలబారిన పడుతూ క్షతగాత్రులవుతున్నారు. ఇందుకు ప్రధానంగా నాటి, నేటి ప్రభుత్వాలు అధికారంలోకి వచ్చిన నాటి నుంచి రోడ్ల ఆలనా పాలనా పట్టించుకోకపోవడంతో రోజురోజుకు రోడ్ల నాణ్యతలు దెబ్బతిని వాటికి కంకరరాళ్ళు, తారు, ఇతర మెటీరియల్ విడిపోయి గుంతలమయంగా మారాయి. ఇటీవల కురిసిన వర్షాలకు ఆ గుంతలు కాస్తా పెరుగుతూ రహదారి డొంకరోడ్లను తలపిస్తున్నాయి. ఆ రోడ్లపై ప్రయాణించే వాహనదారులకు నడుం నొప్పులు, ఇతరత్రా అనారోగ్య సమస్యల బారిన పడుతున్నామని, అంతేకాక వాహనాలు కూడా టైర్లు దెబ్బతినడం జరుగుతుందని వాహనచోదకులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. చేర్యాల, సిద్దిపేటలో ఉన్న ప్రభుత్వ ఆసుపత్రులకు 108 అంబులెన్సు ద్వారా రోగులు వెళ్లాలంటే సరైన సమయానికి గమ్యం చేరక ప్రాణాలు వదులుతున్నారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వెంటనే ఆర్ అండ్ బీ అధికారులు స్పందించి రోడ్డు ప్రయాణం సురక్షితంగా జరిగేలా గుంతలు పూడ్చి కనీస మరమ్మతులు చేపట్టాలని గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

# ఆదివాసీ, చెంచుల సర్వతోముఖాభివృద్ధికి కృషి

● రాష్ట్ర గవర్నర్ జిష్ణు దేవ్ వర్మ



**మహబూబ్‌నగర్ బ్యూరో, అక్టోబర్ 16 (జనం సాక్షి) :** జిల్లాలో ఉన్న 1441 మంది చెంచుల సమగ్ర, సర్వతోముఖాభివృద్ధికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న పథకాలు చివరి లబ్ధిదారునికి వరకు చేరాలని రాష్ట్ర గవర్నర్ జిష్ణు దేవ్ వర్మ సూచించారు. గురువారం మహబూబ్ నగర్ జిల్లాలోని పాలమూరు యూనివర్సిటీ నాల్గవ స్నాతకోత్సవం కార్యక్రమానికి హాజరైన అనంతరం రాష్ట్ర గవర్నర్ జిల్లా సమీకృత కార్యాలయాల సముదాయం సమావేశ మందిరంలో నిర్వహించిన జిల్లా అధికారులు, వివిధ రంగాల ప్రముఖులతో ముఖాముఖి కార్యక్రమంలో గవర్నర్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. మహబూబ్ నగర్ పార్లమెంట్ సభ్యులు డి.కె .అరుణ, స్థానిక శాసన సభ్యులు యెన్నం శ్రీనివాస్ రెడ్డి, దేవరకద్ర శాసన సభ్యులు జి. మధుసూదన్ రెడ్డి, గవర్నర్ ప్రిన్సిపల్ సెక్రెటరీ దానకిషోర్, ఐజి. ఎల్.ఎస్. చౌహాన్, ఎస్.పి.డి.జానకిలు కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర గవర్నర్ జిష్ణు దేవ్ వర్మ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం ద్వారా కల్పిస్తున్న ప్రధాన మంత్రి జన్మన్, దర్తి ఆబా అభియాన్ పథకాల ద్వారా, స్వయం ఉపాధి, సౌర విద్యుత్తు,పక్కా ఇండ్లు,విద్యుతదితర పథకాలు చెంచులకు అందే విధంగా చూడాలన్నారు. జిల్లాలోని అన్ని గ్రామాల్లో క్షయ వ్యాధి ముందస్తు పరీక్షలు నిర్వహించి మెరుగైన వైద్యం అందించాలని, క్షయ రహిత జిల్లా,రాష్ట్రంగా రూపొందేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. సమాజంలో ఉన్న మూఢాచారాలు, రుగ్మతలను పారద్రోలడంలో సామాజిక కార్యకర్తలు, ప్రముఖులు, రచయితలు, కవులు, కళాకారులు వీధి నాటకాలు,జానపద గేయాలు, రచనలు ద్వారా అవగాహన కల్పించి సామాజిక రుగ్మతలను, క్షయ వ్యాధిని రూపుమాపడంలో ప్రముఖులు తమవంతు కృషి చేయాలని సూచించారు. స్వయం సహాయక సంఘాల మహిళలు వినూత్న కార్యక్రమాల ద్వారా చెంచులు, ఆదివాసీ మహిళలను మహిళా సంఘాలలో చేర్చుకుంటూ వారి ఆర్థిక స్వావలంబన అభివృద్ధికి తోడ్పడాలని కోరారు. సమావేశం ప్రారంభంలో జిల్లా కలెక్టర్ విజయేందిర బోయి మాట్లాడుతూ మహబూబ్ నగర్ జిల్లా విశిష్టత, ప్రముఖ పర్యాటక స్థలాలు,విద్య,వైద్యం, వివిధ శాఖల ద్వారా సాధించిన అభివృద్ధి పై పవర్ పాయింట్ ప్రజంటేషన్ ద్వారా గవర్నర్‌కు వివరించారు.జిల్లాకు చెందిన విద్య,వైద్యం,క్రీడలు,రచనలు, సేంద్రియ వ్యవసాయం,సామాజిక సేవ వివిధ రంగాలలో 16 మంది ప్రముఖులు తమ తమ రంగాల్లో నిర్వహించిన సేవలను సమావేశంలో వివరించారు. తొలుత జిల్లా కలెక్టర్ కార్యాలయానికి చేరుకున్న రాష్ట్ర గవర్నర్ జిష్ణు దేవ్ వర్మ కు జిల్లా కలెక్టర్ విజయేందిర బోయి,అదనపు కలెక్టర్ లు శివేంద్ర ప్రతాప్, మధుసూదన్ నాయక్‌లు స్వాగతం పలికారు.జిల్లా కలెక్టర్ కార్యాలయ ఆవరణలో పోలీస్ గౌరవ వందనం స్వీకరించారు. విద్యార్థులచే నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలను తిలకించారు. తర్వాత గవర్నర్ గ్రామీణాభివృద్ధి శాఖ, వైద్య శాఖ, మెప్మా ద్వారా, రెడ్ క్రాస్ సొసైటీ,మహిళా శిశు సంక్షేమ శాఖ, తదితర శాఖలు ఏర్పాటు చెందిన స్టాళ్లను పరిశీలించారు. ప్రధాన మంత్రి జన్ జాతి ఆదివాసీ న్యాయ మహా అభియాన్ పథకం కింద చెంచులకు ఆరోగ్య పరీక్షల నిర్వహణకు ఏర్పాటు చేసిన మొబైల్ వైద్య వాహనాన్ని గవర్నర్ జెండా ఊపి ప్రారంభించారు. కార్యక్రమం అనంతరం జిల్లా కలెక్టర్ కార్యాలయ ప్రాంగణంలో మొక్క నాటి నీళ్లు పోశారు. అధికారులతో గ్రూప్ ఫోటోలు దిగారు. జిల్లా అధికారులు, మండల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## సీపీఆర్‌పై ప్రతీ ఒక్కరికి అవగాహన ఉండాలి




**రాజోలి, అక్టోబర్ 16 (జనంసాక్షి) :** గుండెపోటు వచ్చిన సమయంలో అత్యవసరంగా మొదట చేపట్టాల్సిన ప్రాథమిక చికిత్స సీపీఆర్ విధానంపై ప్రజలు అవగాహన కలిగి ఉండాలని గద్వాల జిల్లా 108 ప్రోగ్రాం మేనేజర్ డి.రత్నమయ్య తెలిపారు. గురువారం శాంతినగర్‌లోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో 108 అంబులెన్సు ఆధ్వర్యంలో విద్యార్థులకు సీపీఆర్‌పై అవగాహన కల్పించారు. అనంతరం ప్రోగ్రాం మేనేజర్ రత్నమయ్య మాట్లాడుతూ..ఇటీవల ఒత్తిడితో కూడిన జీవన విధానం, శారీరక శ్రమ లేకపోవడం, ఆహారపు అలవాట్లలో మార్పుల కారణంగా గుండెపోటు మరణాలు ఎక్కువయ్యాయని, వయస్సుతో నిమిత్తం లేకుండా వస్తున్నాయన్నారు. ఆస్పత్రికి వచ్చిన వారు కావచ్చు, బయట ఎక్కడైనా కావచ్చు గుండెపోటుతో అపస్మారక స్థితిలోకి వెళ్లిన వారికి వెంటనే సీపీఆర్ చేసి మెడికల్ ఎమర్జెన్సీ రెస్పాన్స్ బృందానికి సమాచారం ఇవ్వాలన్నారు. అకస్మాత్తుగా కొందరికి గుండెపోటు వచ్చి ప్రాణాలు కోల్పోయే ప్రమాదం ఉందని, అలాంటి వారికి సీపీఆర్ తో ప్రథమ చికిత్స అందజేస్తే ప్రాణాపాయస్థితి నుంచి బయట పడుతారన్నారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ శ్రీరామ ఓబ్లేస్, 108 వైద్య సిబ్బంది ఆర్.ఆనంద్, నవీన్ కుమార్, సతీష్, హనుమంతు తదితరులు పాల్గొన్నారు.

## నెంబర్‌ప్లేట్ లేని 21 వాహనాలకు జరిమానా



**కృష్ణ, అక్టోబర్ 16 (జనం సాక్షి) :** మండల పరిధిలో నెంబర్ ప్లేట్ లేని వాహనాలపై గురువారం పోలీసులు స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు. ఇందులో మొత్తం 21 సరిగ్గా నెంబర్ ప్లేట్ లేని టూ వీలర్స్, పోలీస్ స్టేషన్ కి తరలించి వాహనాలపై ఫైన్ వేసి వారికి నెంబర్ ప్లేట్స్ పెట్టుకోమని కౌన్సిలింగ్ ఇవ్వడం జరిగింది. మరల ఇలాగే నెంబర్ ప్లేట్ లేకుండా తిరిగినచో వారి వాహనాలను సీజ్ చేయడం జరుగుతుందని ఎస్సై నవీద్ హెచ్చరించారు.

# ఎన్‌హెచ్‌ఎం ఉద్యోగులకు వేతనాలు ఇవ్వాలి

● మెడికల్ యూనియన్ రాష్ట్ర కార్యదర్శి యాదగిరి డిమాండ్

**సంగారెడ్డి టౌన్, అక్టోబర్ 16 (జనం సాక్షి) :** జిల్లాలో ప్రభుత్వ ఆసుపత్రిలో పనిచేస్తున్న ఎన్ హెచ్ ఎం ఉద్యోగులకు పెండింగ్ లో ఉన్న 2 నెలల వేతనాలు విడుదల చేయాలని గురువారం సీఐటీయూ ఆధ్వర్యంలో స్థానిక డి ఎం ఎం హెచ్ వో కార్యాలయంలో ఏవో శ్రీహరికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా మెడికల్ యూనియన్ రాష్ట్ర కార్యదర్శి ఎం యాదగిరి మాట్లాడుతూ.. ఎన్ హెచ్ ఎం పరిధిలో పని చేస్తున్న అర్బన్ హెల్త్, ఏఎన్ఎం, స్టాఫ్ నర్స్, ల్యాబ్ టెక్నీ, ఉద్యోగులకు రాష్ట్ర ప్రభుత్వం గత 2 నెలల నుండి పెండింగ్లో ఉన్న వేతనాలు ఇవ్వకుండా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుందని ఆయన అన్నారు ఉద్యోగులందరికీ 2 నెలల వేతనం పి.ఆర్.సి. ఏరియర్స్ వెంటనే విడుదల చేయాలని, ఆయన ప్రభుత్వానికి డిమాండ్ చేశారు. 2018లో 510 జీ.వో.లో నష్టపోయిన 4000 కుటుంబాలకు న్యాయం చేయాలని ప్రభుత్వాన్ని నష్టపోయిన ఉద్యోగుల వారి



ఎన్‌హెచ్‌ఎం. ఉద్యోగులు అర్బన్ హెల్త్ సెంటర్ లోపనిచేస్తున్న పబ్లిక్ హెల్త్ మేనేజర్, అకౌంటెంట్, ఎం.ఎన్.ఓ, వాచ్ మెన్, స్వీపర్, బ్లాక్ లెవెల్ అకౌంటెంట్స్, బస్తీ దావఖన సపోర్టింగ్ స్టాప్, ఎస్.ఎన్. సి.యు. డాటా ఎంట్రీ ఆపరేటర్, డిస్ట్రిక్ ఎర్లీ ఎంట్రవెన్షన్ సెంటర్ లో డెంటల్ టెక్నీషియన్ సోషల్ వర్కర్, ఆర్.కే.ఎస్.కే. న్యూట్రిషన్ కౌన్సిలర్, ఎన్.సి.డి. కౌన్సిలర్, ఓ.టి. టెక్నీషియన్/ఓ.టి అసిస్టెంట్, ఎస్.ఎన్.సి యు సపోర్టింగ్ స్టాప్, బ్లడ్ బ్యాంక్‌లో డి.ఈ.ఓ, డ్రైవర్స్ టీ–హబ్ డాటా ఎంట్రీ ఆపరేటర్, ల్యాబ్ అటెండర్, పి.హెచ్.సి. డాటా ఎంట్రీ ఆపరేటర్, ప్రాథమిక ఆరోగ్య కేంద్రం కాంటిజెంటీ వర్కర్స్, ఎన్.ఆర్.సి. సపోర్టింగ్ స్టాఫ్, ఆయుష్ ఎస్.ఎన్.ఓ/ఎం.ఎన్.ఓ., ఎం.సి.హెచ్. స్టాప్, ఫిజియోథెరపిస్ట్, ఎస్. టి. ఎల్.ఎ స్.టీ.బీ. ఆల్ క్యాడర్స్, లేప్రోసి ఆల్ డిపార్ట్మెంట్ సూపర్వైజర్స్, అండ్ వీరందరికీ తక్కువ వేతనం వస్తున్నాయి వీరందరూ కూడా 510 జీవోలో మిస్ అయినవాళ్లు ఉ ద్యోగులందరికీ రెగ్యులర్ ఉద్యోగుల యొక్క బేసిక్ వేతనం అమలు చేయాలి, మహిళా ఉద్యోగులకు 180 రోజులు వేతనంతో కూడిన సెలవులు మంజూరు చేయాలి, ప్రతినెల 1వ తేదీ లోపు వేతనాలు చెల్లించాలని ఆయన ప్రభుత్వానికి డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ యునైటెడ్ మెడికల్, ఎంప్లాయిస్ యూనియన్ జిల్లా ఉపాధ్యక్షులు, రాజు కే,సదానందం నాయకులు విజయ్ శంకర్ రాజు తదితరులు పాల్గొన్నారు.

## తెలంగాణ అభివృద్ధి బోర్డు ఏర్పాటు చేయాలి

● నారాయణ్ స్వామి కి సీనియర్ సిటిజన్ ఫోరం వినతి



**గద్వాల నడిగడ్డ, అక్టోబర్ 16 (జనం సాక్షి) :** పాండిచ్చేరి మాజీ ముఖ్యమంత్రి నారాయణస్వామి గురువారము గద్వాలను సందర్శించారు. ఈ సందర్భంగా సీనియర్ సిటిజన్ ఫోరమ్ జిల్లా అధ్యక్షులు మోహన్‌రావు నాయకత్వంలోని ప్రతినిధి బృందం ఆయనను కలసి వినతిపత్రం అందజేసింది. మోహన్‌రావు మాట్లాడుతూ గద్వాల నడిగడ్డ ప్రాంత ప్రజలు ఇప్పటికీ విద్య, ఉపాధి, మౌలిక సదుపాయాల పరంగా వెనుకబడి ఉన్నారని ఆవేదన వ్యక్తం చేశారు. గతంలో ఈ ప్రాంతం రాయచూర్ జిల్లాలో భాగంగా ఉన్నప్పుడు కాంగ్రెస్ ప్రభుత్వం ప్రత్యేక డెవలప్మెంట్ బోర్డు ఏర్పాటు చేసి గణనీయమైన అభివృద్ధి సాధించిందని గుర్తు చేశారు.ప్రస్తుతం తెలంగాణలో కాంగ్రెస్ పార్టీ అధికారంలో ఉన్నందున, గద్వాల,అలంపూర్ సహా కర్ణాటక, మహారాష్ట్ర సరిహద్దులకు ఆనుకుని ఉన్న ప్రాంతాలకు కూడా అలాంటి అభివృద్ధి బోర్డు ఏర్పాటు చేయడం అవసరమని ఆయన సూచించారు. ఈ బోర్డు ఏర్పాటుతో వెనుకబడిన సరిహద్దు మండలాలకు ఆర్థిక, సామాజిక రంగాలలో కొత్త ఊపిరి దక్కుతుందని తెలిపారు. దశాబ్దాలుగా ఈ ప్రాంత ప్రజలు కాంగ్రెస్ ప్రభుత్వం వస్తే అభివృద్ధి బోర్డు ఏర్పాటు అవుతుందన్న ఆశతో ఉన్నారు.ఇప్పుడు ఆ స్వప్నం నెరవేర్చే సమయం వచ్చిందని మోహన్‌రావు పేర్కొన్నారు. 1956లో కర్ణాటక నుండి ఈ ప్రాంతం విడిపోయిన తర్వాత ఈ ప్రాంతానికి నష్టం జరిగిందన్నారు.నీతి అయిగ్ ప్రతిపాదనాలను పూరించే బాధ్యత కాంగ్రెస్ ప్రభుత్వందే అని మోహన్ రావు విజ్ఞప్తి చేశారు.నారాయణస్వామి ఈ వినతిని శ్రద్ధగా ఆలకించి ఈ అంశాన్ని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి దృష్టికి తీసుకువెళ్తాను, ప్రాంత అభివృద్ధి దిశగా పార్టీ కట్టుబడి ఉందని హామీ ఇచ్చారనీ జోగులాంబ గద్వాల జిల్లా సీనియర్ సిటిజన్ ఫోరం అధ్యక్షుడు కె.మోహన్ రావు అన్నారు.

## మధ్యాహ్నం భోజన బాధ్యతల నుంచి ఉపాధ్యాయులను తప్పించాలి



**నంగునూరు, అక్టోబర్ 16 (జనం సాక్షి) :** మధ్యాహ్న భోజన బాధ్యతల నుంచి ఉపాధ్యాయులను తప్పించాలని డెమోక్రటిక్ టీచర్స్ ఫెడరేషన్(డీటీఎఫ్) సిద్దిపేట జిల్లా అధ్యక్షుడు దేవులపల్లి కిష్టయ్య డిమాండ్ చేశారు. సిద్ధిపేట జిల్లా నంగునూరు మండలంలోని వివిధ పాఠశాలల్లో పర్యటించి విద్యారంగ సమస్యలను తెలుసుకున్నారు. ఈ సందర్భంగా డీటీఎఫ్ సభ్యత్వ నమోదు కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా డీటీఎఫ్ జిల్లా కార్యదర్శులు ఎనగందుల మనీష్ కుమార్, దేవర మల్లయ్య, సీనియర్ నాయకుడు జి.సత్తయ్య, సభ్యులు శ్రావణ్ తదితరులతో కలిసి నంగునూరులో మీడియాతో మాట్లాడుతూ పాఠశాలల్లో పారిశుద్ధ్య కార్మికులు, వంట కార్మికులకు కనీస వేతనాలు ఇవ్వకుండా వారిని ఇబ్బంది పెట్టడం సరికాదన్నారు. వంట కార్మికులకు మధ్యాహ్న భోజనం బిల్లులను సకాలంలో చెల్లించకుండా మెనూ ప్రకారం భోజనం పెట్టలేదని ప్రధానోపాధ్యాయులపై చర్యలు తీసుకోవడం తగదన్నారు. బద్దిపడగ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మధ్యాహ్న భోజనం విషయంలో హెచ్ఎం. పద్మను సస్పెండ్ చేయడాన్ని డీటీఎఫ్ సిద్దిపేట జిల్లా కమిటీ తీవ్రంగా ఖండిస్తోందన్నారు. వంట వాళ్ల ఆర్థిక పరిస్థితిని దృష్టిలో పెట్టుకొని వాళ్లకు భరోసా కల్పించకుండా వంట బాగా లేదంటూ, మెనూ ప్రకారం పెట్టలేదంటూ అక్కడి ప్రధానోపాధ్యాయురాలిని బాధ్యులు చేస్తూ సస్పెండ్ చేయడం తీవ్ర అన్యాయమన్నారు. వెంటనే ఆ పాఠశాల హెచ్.ఎం. సస్పెన్షన్ ను రద్దు చేసి తిరిగి విధుల్లోకి తీసుకోవాలని కోరారు.

## సకాలంలో సీపీఆర్ చేస్తే ప్రాణాలు కాపాడవచ్చు

● జిల్లా కలెక్టర్ సిక్తా పట్నాయక్




**నారాయణపేట జిల్లా బ్యూరో, అక్టోబర్ 16 (జనం సాక్షి) :** అకస్మాత్తుగా గుండె పోటుకు గురైన వ్యక్తులకు సకాలంలో సీపీఆర్ చేసి ప్రాణాలను కాపాడవచ్చు అని, ఈ సీ పీ ఆర్ విధానంపై ప్రతి ఒక్కరికి అవగాహన అవసరమని జిల్లా కలెక్టర్ సిక్తా పట్నాయక్ అన్నారు. గురువారం జిల్లా కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో జిల్లాలోని అన్ని లైన్ డిపార్ట్మెంట్ అధికారులు, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి కార్యాలయంలో వైద్యాధికారులకు ఎంఎల్‌హెచ్‌పిలకు సిపిఆర్‌పై వేర్వేరుగా శిక్షణ కార్యక్రమం ఏర్పాటు చేశారు. కలెక్టరేట్ సమావేశ మందిరంలో జరిగిన శిక్షణ కార్యక్రమానికి హాజరైన జిల్లా కలెక్టర్ సిక్తా పట్నాయక్ మాట్లాడుతూ సిపిఆర్ చేయడం, నేర్చుకోవడం వల్ల సగటు మనిషి ప్రాణాలను ఆగిపోయిన గుండెల్లో రక్తప్రసరణను మళ్లీ పెంపొందించడానికి అవకాశం ఉంటుందని ఆమె తెలిపారు. ప్రతి ఒక్కరూ ఈ శిక్షణను ఉపయోగించుకోవాలని సూచించారు.సిపిఆర్ చేయడం నేర్చుకొని సగటు వ్యక్తి యొక్క ప్రాణాన్ని కాపాడడానికి కృషి చేయాలని ఆరోగ్య శాఖలోని సిబ్బంది మాత్రమే కాకుండా సగటు మనిషి ఎవరైనా కూడా దీన్ని నేర్చుకోవచ్చని చెప్పారు.ఈ శిక్షణ మొత్తాన్ని మహబూబ్ నగర్ నుండి వచ్చిన ఎంఐసియు డాక్టర్ రఘు రెడ్డి సి పి ఆర్ గురించి శిక్షణ ఇచ్చారు.ముఖ్యమైన అంశాలను వివరించారు. అలాగే జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి కార్యాలయంలో వైద్యాధికారులు పర్యవేక్షకులకు మరియు ఎమ్. ఎల్ . హెచ్. పి లకు సిపిఆర్ పైన శిక్షణ ఇచ్చారు.ఈ కార్యక్రమంలో డాక్టర్ కే జయచంద్ర మోహన్ తో పాటు ప్రోగ్రామ్ అధికారి డాక్టర్ సత్య ప్రకాష్ ఎన్ సీ డి కోఆర్డినేటర్ విజయ్ కుమార్, అరవింద్ కుమార్ ,అశోక్ , సిబ్బంది పాల్గొన్నారు.

## ఐకేపీ వివోఏల ముందస్తు అరెస్ట్



**చిలప్‌చెడ్, అక్టోబర్ 16 (జనంసాక్షి) :** ఐకెపి వివోఏల సమస్యలు పరిష్కరించాలని హైదరాబాదులోని సెర్ఫ్ ఆఫీస్ ముట్టడికి వెళుతున్న ఐకెపి వీవోఏలను చిలప్ చేడ్ మండల పోలీసులు ముందస్తు అరెస్టు చేశారు. అనంతరం మండల వివోఏలు మాట్లాడుతూ ప్రతినెలా కనీసం రూ.20వేల జీతం ఇవ్వాలని. ప్రతి గ్రామ సంఘానికి ట్యాబ్, నెట్‌వర్క్ సౌకర్యం కల్పించాలన్నారు. 58 జీవో రద్దు చేసి సెర్ఫ్ ఉద్యోగుల గుర్తించాలన్నారు. రాష్టంలో ఉన్న ప్రతి ఒక్క వివోఏ లకు ప్రతి ఒక్కరికి ఇన్సూరెన్స్ కల్పిస్తూ,ప్రమాద బీమా కల్పించాలన్నారు. గ్రామ సంఘాల ట్రేడింగ్‌తో సంబంధం లేకుండా ప్రతినెల వేతనాలు వ్యక్తిగత ఖాతాలకు చెల్లించాలని కోరారు. అర్హులైన వారికి సీసీలుగా పదోన్నతులు కల్పించాలన్నారు. బకాయి పాడిన శ్రీనిధి నిధులు వెంటనే విడుదల చేయాలి అని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో వీవోఏలు వీరమణి, బాగయ్య, మాధవి, రేణుక, సరిత, లక్ష్మి, మంజుల తదితరులు ఉన్నారు.

# ఎఫ్ఏక్యూ ప్రకారం నాణ్యమైన వరి ధాన్యాన్ని సేకరించాలి

● కలెక్టర్ ఆదర్శ్ సురభి

**వనపర్తి బ్యూరో, అక్టోబర్ 16 (జనంసాక్షి) :** ఖరీఫ్ 2025–26 సీజన్లో ఎఫ్ ఏ క్యూ నిబంధనల ప్రకారం ఉన్న నాణ్యమైన వరి ధాన్యాన్ని సేకరించే విధంగా కొనుగోలు కేంద్రాల ఇన్చార్జిలకు అవగాహన కల్పించాలని జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి ఆదేశించారు.గురువారం కలెక్టరేట్లోని సమావేశ మందిరంలో జిల్లా పౌరసరఫరాల శాఖ, సంస్థ ఆధ్వర్యంలో ఖరీఫ్ 2025–26 సీజన్ కొనుగోళ్లకు సంబంధించి సన్నాహక సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి జిల్లా కలెక్టర్ తో పాటు మహబూబ్నగర్ జిల్లా డిసిసిబి చైర్మన్ మామిల్లపల్లి విష్ణువర్ధన్ రెడ్డి, అదనపు కలెక్టర్ రెవెన్యూ ఖీమ్యా నాయక్ పాల్గొన్నారు. కొనుగోలు కేంద్రాల నిర్వాహకులకు ధాన్యం కొనుగోళ్లకు సంబంధించి ఎఫ్ ఏ క్యూ ప్రమాణాల ప్రకారం ఉన్న నాణ్యమైన ధాన్యాన్ని గుర్తించడంపై ఎంఏఓలకు, ఏఈఓలకు అవగాహన కల్పించారు.కలెక్టర్ మాట్లాడుతూ మండల వ్యవసాయ అధికారులు, ఏఈవోలు ఎఫ్ఏక్యూ ప్రమాణాలు కలిగిన నాణ్యమైన వరి ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాల్లో సేకరించే విధంగా ఇన్చార్జిలకు సోమ, మంగళవారాల్లో శిక్షణ ఇవ్వాలని ఆదేశించారు. ప్రతి పీపీసీ ఇన్చార్జికి తప్పనిసరిగా ధాన్యం కొనుగోళ్లపై మంచి అవగాహన కల్పించాలన్నారు. నిర్దేశించిన తేమశాతం ఉండేలా, తాలు లేకుండా ధాన్యం ఉండేలా వారికి సూచనలు చేయాలన్నారు. గత సీజన్ లో ట్రాన్స్పోర్ట్ కాంట్రాక్టర్ల నుంచి కొంత ఇబ్బందులు ఎదురైనట్లు పేర్కొన్న కలెక్టర్ ఈసారి ఆ పరిస్థితులు తీసుకురావద్దని ట్రాన్స్పోర్ట్ కాంట్రాక్టర్లకు ఆదేశించారు. తప్పనిసరిగా నిర్దేశించిన వాహనాలు వరి ధాన్యం తరలింపు నాకు అందుబాటులో ఉండాలని తెలియజేశారు. పీపీసీలకి ఏ మిల్లును కేటాయించడం జరుగుతుందో అదే మిల్లుకి ధాన్యాన్ని తరలించాలని సూచించారు. ఈ విషయంలో మిల్లర్లు కూడా కొనుగోలు కేంద్రాల నిర్వాహకులతో సమన్వయం చేసుకోవాలని సూచించారు. అదేవిధంగా మిల్లర్లు రైతులకు ఇబ్బందులు తలెత్తే పరిస్థితులు రానీయకుండా జాగ్రత్త పడాలన్నారు.ధాన్యం మిల్లుకి వచ్చిన వెంటనే ట్రక్ షీట్లను వాట్సాప్ ద్వారా పంపి రైతులకు వెంటనే నగదు వచ్చే విధంగా కృషి చేయాలన్నారు. మిల్లర్లకు ఏవైనా సమస్యలు తెలియజేస్తే పరిష్కార మార్గం చూపించడానికి కృషి చేస్తామని చెప్పారు.డిసిసిబి చైర్మన్ మాట్లాడుతూ ఈ సీజన్లో వరి ధాన్యం కొనుగోళ్ల విషయంలో గతంలో జరిగిన తప్పులు పునరావృతం కాకుండా చూసుకోవాలని తెలిపారు. ప్రతి కొనుగోలు కేంద్రానికి టార్పాలిన్ కవర్లు, గన్ని బ్యాగులు, క్లీనర్లు సరిపడినన్ని అందుబాటులో ఉంచే విధంగా చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. ఎట్టి పరిస్థితుల్లోనూ రైతులకు నష్టం వాటిల్లకుండా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ను కోరారు. సీజన్లో వరి ధాన్యం కొనుగోలు సజావుగా సాగేలా ప్రతి ఒక్కరు సహకరించాలని తెలిపారు.ఈ కార్యక్రమంలో జిల్లా పౌరసరఫరాల శాఖ అధికారి కాశీ విశ్వనాథ్, డిఎం జగన్, డి ఆర్ డి ఓ ఉమాదేవి, డి సి ఓ రాణి, డిటిఓ మానస, డి ఎం ఓ స్వరణ్ సింగ్, వనపర్తి మార్కెట్ యార్డ్ చైర్మన్ శ్రీనివాస్ గౌడ్, కొత్తకోట మార్కెట్ యార్డ్ చైర్మన్ ప్రశాంత్, పాక్స్ సీఈవోలు, ఎంఏవోలు, ఏఈవోలు, ఐకెపి ఏపిఎంలు తదితరులు పాల్గొన్నారు.



# బీసీ ఉద్యమాన్ని ఉధృతం చేద్దాం

- కాంగ్రెస్‌వన్నీ మోసపూరిత హామీలే..
- బీసీలకు 42 శాతం అన్ని రంగాల్లో రిజర్వేషన్లు కల్పించాలి
- బీసీ మంత్రిత్వ శాఖను ఏర్పాటు చేయడంలో కాంగ్రెస్ విఫలం
- బీసీ జేఏసీ బందును విజయవంతం చేద్దాం
- శాసనమండలి ప్రతిపక్ష నేత, ఎమ్మెల్సీ సిరికొండ మధుసూదనాచారి




**జయశంకర్ భూపాలపల్లి బ్యూరో, (జనంసాక్షి):** మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ నాడు చేసిన తెలంగాణ ఉద్యమ స్ఫూర్తితో తెలంగాణలో బీసీ ఉద్యమాన్ని ఉధృతం చేద్దామని కాంగ్రెస్ చేస్తున్న మోసాలను ఎండగడదామని శాసనమండలి ప్రతిపక్ష నేత, ఎమ్మెల్సీ సిరికొండ మధుసూదనాచారి అన్నారు. జయశంకర్ భూపాలపల్లి జిల్లా కేంద్రంలోని మంజూరు నగర్ లో గల తన క్యాంపు కార్యాలయంలో మధుసూదనాచారి గురువారం స్థానిక విలేకరులతో మాట్లాడుతూ బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు దక్కాలంటే మరో ఉద్యమం చేయాలన్నారు. కాంగ్రెస్ పార్టీ మోసపూరిత మాటలతో ప్రజలను మభ్యపెడుతుందని అన్నారు. బీసీల పట్ల ఏమాత్రం చిత్తశుద్ధి లేకుండా వ్యవహరిస్తూ అన్యాయం చేస్తుందన్నారు. కేంద్రంపై ఒత్తిడి తీసుకురాకుండా, పార్లమెంటును స్తంభింపజేసే కార్యక్రమాలు చేపట్టకుండా వ్యవహరిస్తూ కావాలనే పబ్బం గడుపుతున్నట్లు తెలియజేశారు. కేంద్రంలో రాహుల్ గాంధీ బీసీల వ్యవహారం పట్ల ఎందుకు పట్టించుకోకపోవడం లేదో తెలియజేయాలన్నారు. ఇక్కడి రాష్ట్ర ప్రభుత్వం బీసీలను నయవంచన చేసే విధంగా వ్యవహరిస్తూ ముందుకు సాగుతుందని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం సుప్రీంకోర్టులో వేసిన పిటిషన్ను కొట్టివేయడమే దానికి నిదర్శనం అన్నారు. బీసీలను మోసం చేసేందుకే ఆ పార్టీ చట్టపరంగా ముందుకు వెళ్లడం లేదని విమర్శించారు. ఈ విషయం ఇటీవలే వచ్చిన కోర్టు తీర్పులతో తేటతెల్లమైందని ఆయన చెప్పారు.

**తమిళనాడు తరహాలో ఈ ప్రభుత్వం ఎందుకు చేయలేదు: సిరికొండ**

తమిళనాడులో అవలంబించిన తరహాలో ఈ ప్రభుత్వం ఎందుకు ముందుకుపోలేదని ఎమ్మెల్సీ సిరికొండ మధుసూదనాచారి విమర్శించారు. బీఆర్ఎస్ పార్టీ తరపున మాజీ సీఎం కేసీఆర్ ఆదేశాల మేరకు పార్టీలోని బీసీ ముఖ్య నూతలందరూ, తాను కలిసి తమిళనాడులో బీసీల పట్ల అవలంభించిన విధానాన్ని అధ్యయనం చేసి రావడం జరిగిందన్నారు. అక్కడి ముఖ్య నాయకులు, అధికారులతో చర్చించి, వారు అనుసరించిన విధానం తెలుసుకొని రావడం జరిగిందన్నారు. ఢిల్లీ స్థాయిలో తీవ్రమైన ఒత్తిడి తీసుకురావడమే బీసీల సమస్యకు పరిష్కారమని, ఈ విషయం రాష్ట్ర ప్రభుత్వం దృష్టికి తీసుకు వెళ్లడం జరిగిందని అయినప్పటికీ పట్టించుకోలేదన్నారు. గతంలో తమిళనాడులో బీసీ రిజర్వేషన్లపై అప్పటి సీఎం జయలలిత అన్ని పార్టీలను ఒకే తాటిపైకి తీసుకువచ్చి వారందరితో అప్పట్లో ఢిల్లీలో ఉన్న కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకు వచ్చిందని, రిజర్వేషన్లు ఇస్తేనే ఇక్కడి నుండి వెళ్తామని భీష్మించుకుని కూర్చుని పట్టుబట్టి 9వ షెడ్యూల్లో చేర్పించడం జరిగిందని తెలియజేశారు. శాసనమండలి, శాసనసభలో ఈ విషయం చర్చకు వచ్చినప్పుడు 42 శాతం బీసీలకు రిజర్వేషన్లు అమలు జరగాలంటే ఢిల్లీ స్థాయిలో చేయాలని సూచనలు ఇచ్చినప్పటికీ ఏమాత్రం పట్టించుకోలేదు అన్నారు. కాంగ్రెస్ పార్టీకి బీసీల పట్ల ఏమాత్రం చిత్తశుద్ధి లేదని అందుకే భిన్నంగా వ్యవహరించి బీసీలను నయవంచనకు గురి చేస్తుందని, నమ్మకద్రోహం చేస్తుందని ఈ సందర్భంగా ఎమ్మెల్సీ సిరికొండ మధుసూదనా చారి విమర్శించారు.

**బీసీలకు న్యాయం జరగాలంటే పోరాటం తప్పదు**

బీసీలకు తగిన న్యాయం జరగాలంటే పోరాటం తప్పదని మధుసూదనాచారి అన్నారు. బీసీ జేఏసీల ఆధ్వర్యంలో ఈనెల 18న నిర్వహించే బందుకు సంపూర్ణ మద్దతు తెలియజేయాలని, అన్ని వర్గాల ప్రజలు సహకరించాలని బందును విజయవంతం చేయాలని ఆయన పిలుపునిచ్చారు. సమాజంలో మేమెంతో మాకంత రిజర్వేషన్లు కావాలి అనే నినాదంతో అన్ని వర్గాల ప్రజలు తెలంగాణ ఉద్యమాన్ని స్ఫూర్తిగా తీసుకొని మరో పోరాటానికి సిద్ధం కావాలని ఎమ్మెల్సీ సిరికొండ మధుసూదనాచారి పిలుపునిచ్చారు.

# ధాన్యం కొనుగోళ్లకు సిద్ధంగా ఉండాలి

- జిల్లా కలెక్టర్ అద్వైత్ కుమార్ సింగ్



**మహబూబాబాద్ బ్యూరో, అక్టోబర్ 16(జనం సాక్షి):** వానాకాలం సీజన్ ధాన్యం కొనుగోళ్లకు సిద్ధంగా ఉండాలని జిల్లా కలెక్టర్ అద్వైత్ కుమార్ సింగ్ అన్నారు. గురువారం కలెక్టరేట్ ప్రధాన సమావేశం మందిరంలో అదనపు కలెక్టర్ (రెవెన్యూ) కె.అనిల్ కుమార్, డీఆర్డీఓ పిడి మధుసూదనరాజు, సహకార శాఖ అధికారి వెంకటేశ్వర్లు, డిఏఓ విజయనిర్మల, ఆర్డీవోలు గణేష్, కృష్ణవేణి, మండల ప్రత్యేక అధికారులు, వ్యవసాయ, సహకార, ఐకెపి, పౌరసరఫరాలు, తహసీల్దారులు, ఏపీవోలు, లతో కలిసి ఆయన సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ కేంద్రాలలో రైతుల సౌకర్యార్థం అన్ని మౌలిక వసతులు త్రాగునీరు, విశ్రాంతి ప్రదేశాలు, ప్యాడి క్లీనర్స్, వేయింగ్ మిషన్స్, మాయిశ్చర్ మిషన్లు, గన్ని సంచులు, టార్పాలిన్లు, తదితర సదుపాయాలను కల్పించాలని, జిల్లాలో జరిగే హార్వెస్టింగ్, వివరాలను ముందస్తుగా సమాచారం తెలుసుకొని కొనుగోలు కేంద్రాలకు వచ్చే విధంగా వ్యవసాయ శాఖ అధికారులు చర్యలు తీసుకోవాలని, వాతావరణ మార్పులు, చేర్పుల విషయాలు ప్రతి విషయాలను రైతులకు తెలియజేయాలలని సూచించారు. ధాన్యం కొనుగోళ్ల కేంద్రాలలో ఎలక్ట్రానిక్ పరికరాల ను, లీగల్ మెట్రోలజీ మార్కెటింగ్ అధికారులు తనిఖీ చేసి ఎలాంటి అసౌకర్యాలు లేకుండా మిషన్ల నిర్వహణ చేయాలన్నారు. క్షేత్రస్థాయిలో ధాన్యం కొనుగోళ్ల కేంద్రాల సిబ్బంది పకడ్బందీగా విధులు నిర్వహించాలని ఎలాంటి నిర్లక్ష్యం ఆరోపణలు వచ్చిన కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందని ఆయన ఆదేశించారు. ఈ సమావేశంలో పాల్గొన్న అధికారులు సంబంధిత విభాగాల క్షేత్రస్థాయి సిబ్బంది అభిప్రాయాలను అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వ సూచనలు ఆదేశాలు, నిబంధనల ప్రకారం అందుకు అనుగుణంగా పక్కా ప్రణాళికతో ఒక ముఖ్యమైన విధులుగా బాధ్యతాయుతంగా ధాన్యం కొనుగోళ్ల కేంద్రాలను ఏర్పాటు చేసి నిర్వహించాలని సూచించారు.

# గురుకులాల్లో సీట్ల భర్తీకి దరఖాస్తుల స్వీకరణ

**ఈ నెల 18న లాటరీ పద్ధతిలో విద్యార్థుల ఎంపిక**

**మంచిర్యాల జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్**



**మంచిర్యాల ప్రతినిధి, అక్టోబర్ 16, (జనంసాక్షి) :** జిల్లాలోని అన్ని సాంఘిక సంక్షేమ గురుకుల విద్యాలయాల్లో 2025–26 విద్యా సంవత్సరానికి గాను 5వ తరగతి నుంచి 9వ తరగతి వరకు ఖాళీగా ఉన్న సీట్లను భర్తీ చేసేందుకు అభ్యర్థుల నుండి దరఖాస్తులు స్వీకరించడం జరుగుతుందని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ విద్యా సంవత్సరంలో గురుకుల ప్రవేశ పరీక్ష రాసిన విద్యార్థినీ, విద్యార్థులు, గతంలో దరఖాస్తు చేసుకున్న వారితో పాటు, ఆసక్తి ఉన్న వారు దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు. ఈ నెల 17 వ తేదీ సాయంత్రం 5 గంటలలోగా లక్షెట్టిపేట (బాలికల) గురుకుల విద్యాలయంలో దరఖాస్తులు సమర్పించాలని తెలిపారు. కుల ధ్రువీకరణ పత్రంతో పాటు ప్రవేశ పరీక్ష రాసిన విద్యార్థులు హాల్ టికెట్, ర్యాంకు ధ్రువీకరణ పత్రాల నకలు ప్రతులు జత పరచాలని సూచించారు. లక్షెట్టిపేట, చెన్నూరు, మందమర్రి, బెల్లంపల్లి (బాలికలు), బెల్లంపల్లి, కాసిపేట, కోటపల్లి, మంచిర్యాల, జైపూర్ (బాలుర) సాంఘిక సంక్షేమ గురుకులాలలో ఖాళీగా ఉన్న సీట్లను ఈ నెల 18న లాటరీ పద్ధతిలో విద్యార్థులను ఎంపిక చేసి, భర్తీ చేయడం జరుగుతుందని తెలిపారు. బాలికల గురుకులాలలోని 6వ తరగతిలో ఎస్ సి 6, ఎస్టి 2, బీసీ 3, జనరల్ 3, మైనారిటీ 2 సీట్లు ఉన్నాయని, 7వ తరగతిలో బీ సి 5 సీట్లు, 8 వ తరగతిలో ఎస్ సి 4, ఎస్టి 1, బీసీ 10, జనరల్ 6, మైనారిటీ 5, 9వ తరగతి లో ఎస్ సి 3, ఎస్టి 4, బీసీ 4, జనరల్ 5, మైనారిటీ 3 సీట్లు ఉన్నాయని తెలిపారు. బాలుర గురుకులాలలో 5వ తరగతిలో, ఎస్టి 3, జనరల్ 3, మైనారిటీ 2 సీట్లు, 6వ తరగతిలో ఎస్ సి 9, ఎస్టి 5, జనరల్ 1, మైనారిటీ 6 సీట్లు, 7వ తరగతిలో ఎస్ సి 5 సీట్లు, 8వ తరగతిలో ఎస్ సి 8, బీసీ 8, జనరల్ 6, మైనారిటీ 8, 9వ తరగతి లో ఎస్ సి 11, బీసీ 4, ఓసీ 7, మైనారిటీ 5 సీట్లు ఉన్నాయని తెలిపారు.

# ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులకు ఆర్థిక ఆసరాను అందించాలి

- నిర్మాణాల పురోగతిని ఆన్‌లైన్‌లో వెంటనే నమోదు చేయాలి
- బ్రిక్స్, సిమెంట్, యూనిట్స్ ఏర్పాటుకు స్వయం సహాయక సభ్యులకు రుణ మంజూరు చేయాలి
- జనగామా జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్




**జనగామ ప్రతినిధి, అక్టోబర్ 16(జనంసాక్షి ):** దశల వారీగా జరిగే ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలకు సంబందించిన బిల్లులు వెంటనే లబ్ధిదారులకు అందేలా క్షేత్ర స్థాయి లో అధికారులు కృషి చేయాలనీ జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ అన్నారు. ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాల మీద హౌసింగ్ పీడీ, మండల స్పెషల్ అధికారులు, ఎంపీడీఓ, ఎంపీఓ, ఇంజనీరింగ్ అధికారులతో... గురువారం క్యాంపు కార్యాలయం నుండి జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ గూగుల్ మీటింగ్ ద్వారా సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ దశల వారీగా నిర్మాణాలు అవుతున్న ఇందిరమ్మ ఇళ్ల ఫోటోలను ....త్వరగా ఆన్లైన్ లో నమోదు చేసి.. లబ్ధిదారులకు బిల్లు లు వచ్చేలా అధికారులు కృషి చేసి వారికి ఆర్థిక ఆసరా కలిగించాలన్నారు. ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలలో... మరుగు దొడ్లు నిర్మించుటకు లబ్ధిదారులకి వెంటనే మంజూరు ఇవ్వాలన్నారు. డి ఆర్ డి ఓ ఆధ్వర్యంలో స్వయం సహాయక సభ్యులకు బ్రిక్, సిమెంట్, సెంట్రింగ్ యూనిట్స్ ఏర్పాటు కి రుణలని అందించాలన్నారు. ప్రధాన మంత్రి ఆవాస్ యోజన పథకం లో భాగంగా గుర్తించిన అర్హులైన లబ్ధిదారుల జాబితా ను గ్రామ స్థాయి లో... పరిశీలన అధికారులని నియమించి మరోసారి ఆ జాబితాను క్షుణ్ణం గా పరిశీలించి ధ్రువీకరించాలన్నారు.



# ఆర్ట్స్ కాలేజ్ విద్యార్థులకు మైక్రోసాఫ్ట్ సర్టిఫికెట్స్

**వరంగల్ ఎంజీఎం, అక్టోబర్ 16(జనంసాక్షి):** ట్రైనింగ్ అండ్ ప్లేస్మెంట్ సెల్ ఆధ్వర్యంలో నిర్మాన్ ఆర్గనైజేషన్ వారి టై అప్ కూడుకున్న మైక్రోసాఫ్ట్ ఈ వై కండక్ట్ చేసిన ఏఐ ఆర్టిఫిషియల్ ఇంటెలిజెంట్ పాస్పోర్ట్ మీద జరిగిన నాలుగు మాడ్యూల్స్ లో జనరల్ , స్కిల్స్ సెక్షన్లలో విజయం సాధించి మైక్రోసాఫ్ట్ కి సంబంధించిన సర్టిఫికెట్లను పొందారు. ఎమ్మెస్సీ కంప్యూటర్ సైన్స్ ఎంసీఏ విద్యార్థులు మొత్తం 17 మందికి ఈ సర్టిఫికెట్లు పొందారని ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ సుంకరి జ్యోతి తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ట్రైనింగ్ ప్లేస్మెంట్ అధికారి డాక్టర్ ఎల్ జితేందర్ ,సభ్యులు అజ్మీర రాజేష్ పాల్గొనడం జరిగింది.

# రాష్ట్రస్థాయి ఫోటోగ్రఫీ, షార్ట్ ఫిల్మ్, వ్యాసరచన పోటీలకు ఆహ్వానం

- వరంగల్ పోలీస్ కమిషనర్ సన్ ప్రీత్ సింగ్




**వరంగల్ బ్యూరో, అక్టోబర్ 16 (జనం సాక్షి) :** పోలీస్ అమరవీరుల సంస్మరణ దినోత్సవం (పోలీస్ ఫ్లాగ్ డే)ను పురస్కరించుకొని జిల్లా పరిధిలో గల ఔత్సాహిక ఫోటోగ్రాఫర్లకు ఫోటోగ్రఫీ, షార్ట్ ఫిల్మ్‌కు సంబంధించి, విద్యార్థులకు వ్యాసరచన పోటీలకు సంబందించి తెలంగాణ రాష్ట్ర పోలీస్ శాఖ ఆధ్వర్యంలో రాష్ట్ర స్థాయిలో పోటీలను నిర్వహిస్తున్నట్లుగా వరంగల్ పోలీస్ కమిషనర్ సన్ ప్రీత్ సింగ్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. పోలీస్ ఫ్లాగ్ డే సందర్భంగా పోలీస్ అమరవీరుల ప్రాణ త్యాగాలను స్మరిస్తూ ఈ నెల 21నుండి పలు కార్యక్రమాలను నిర్వహించబడుతాయని తెలిపారు. ఇందులో భాగంగా విద్యార్థులతో పాటు,యువత ఔత్సాహిక ఫోటోగ్రాఫర్లు ఫోటోగ్రఫీ,షార్ట్ ఫిల్మ్స్ పోటీలలో ఉత్సాహంగా పాల్గొనాలని కోరారు. ఇందులో భాగంగా పోలీసుల త్యాగాలు,పోలీసు విధుల్లో పోలీసుల ప్రతిభను తెలిపే విధంగా ఉండే ఇటీవల కాలంలో తీసిన (03) ఫోటోలు, తక్కువ నిడివి (03 నిమిషాలు) గల షార్ట్ ఫిలిమ్స్ తీసి రాష్ట్రస్థాయి పోటీల కోసం ఈ నెల 25వ తేదీ లోపు జిల్లా వరంగల్ పోలీస్ కమిషనరేట్ కార్యాలయంలో సంబంధిత షార్ట్ ఫిల్మ్ లోడ్ చేసిన పెన్ డ్రైవ్,10x8 సైజ్ ఫోటోలను పోలీస్ పిఆర్వోకు అందజేయాలన్నారు. ఈ పోటీలకు నామినేషన్లు పంపించే ఔత్సాహికులు మూడనమ్మకాలు, ఇతర సామాజిక రుగ్మతలు, అత్యవసర సమయాల్లో పోలీసులు స్పందన, ప్రకృతి వైపరిత్యాల్లో పోలీసుల సేవ, ఇతర సందర్భాల్లో పోలీసుల కీర్తి ప్రతిష్టలను, సైబర్ నేరాలు ఈవ్ టీజింగ్,ర్యాగింగ్, మత్తు పదార్థాల సేవనం వాటి అనర్థాలు అవగాహన పెంపొందించే అంశాలకు సంబంధించి గత సంవత్సరం 2024 అక్టోబర్ నుండి ప్రస్తుత సంవత్సరం అక్టోబర్ నెల ఇప్పటివరకు తీసిన మూడు ఫోటోలు,షార్ట్ ఫిల్మ్ లు మాత్రమే పంపించాల్సి వుంటుందని తెలిపారు.

# కొండాపూర్‌లో దారుణం

- తీసుకున్న అప్పు డబ్బులు ఇవ్వలేదని అన్న పై కత్తితో తమ్ముడి దాడి
- అడ్డొచ్చిన మహిళ మృతి, అన్నకు తీవ్ర గాయాలు



**నల్లబెల్లి, అక్టోబర్ 16 (జనంసాక్షి):** అప్పు తీసుకున్న డబ్బులు ఇవ్వలేదని అన్న పై తమ్ముడు కత్తితో దాడి చేయగా అడ్డొచ్చిన మహిళ మృతి చెంది.... అన్నకు తీవ్ర గాయాలైన సంఘటన మండలంలోని కొండాపూర్ గ్రామంలో గురువారం జరిగింది. కుటుంబ సభ్యులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం వరంగల్ జిల్లా నల్లబెల్లి మండలం కొండాపురం గ్రామానికి చెందిన మేరగుర్తి సమ్మక్క మల్లయ్య దంపతులకు రమేష్, సురేష్ అనే ఇద్దరి కుమారులు ఉన్నారు. పెద్ద కుమారుడైన రమేష్ కు పెళ్ళై ఇద్దరు సంతానం కలిగిన తర్వాత ఎనిమిది ఏళ్ల కిందట భార్య మృతి చెందింది. తర్వాత గీసుగొండా మండలం మచ్చపురం గ్రామానికి చెందిన స్వరూప (34) అనే మహిళతో గ్రామంలోనే సహజీవనం చేస్తున్నాడు. నాలుగు నెలల క్రితం అన్న రమేష్ తమ్ముడు సురేష్ వద్ద రూ.10 వేలు అప్పు తీసుకున్నాడు. తీసుకున్న అప్పు డబ్బులను తిరిగి ఇవ్వమని అన్నను ఎన్నిసార్లు అడిగినా ఇవ్వలేదు. ఈ క్రమంలో బుధవారం సాయంత్రం మద్యం మత్తులో ఇంటికి చేరుకున్న సురేష్ తీసుకున్న అప్పు డబ్బులు తిరిగి ఇవ్వాలని అన్నతో గొడవకు దిగాడు. ఇద్దరి మధ్య మాట మాట పెరిగింది. ఆవేశంతో సురేష్ కత్తితో అన్న రమేష్ పై దాడికి దిగాడు. పక్కనే ఉన్న స్వరూప ఆపడానికి ప్రయత్నించగా ఆమెపై కూడా దాడి చేశాడు. దీంతో ఇద్దరికీ తీవ్ర గాయాలు కావడంతో స్థానికులు ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ స్వరూప మృతిచెందగా, మెరుగైన వైద్యం కోసం రమేష్ ను వరంగల్ లోని ఎంజీఎం కు తరలించారు. మృతురాలి కుమారుడు శివకుమార్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై గోవర్ధన్ తెలిపారు.

# పేకాట ఆడుతున్న నలుగురు అరెస్టు

- రూ. 2 వేల నగదు, 3 సెల్ ఫోన్లు, పేక ముక్కలు స్వాధీనం...

**చెన్నారావుపేట, అక్టోబర్ 16 (జనం సాక్షి):** పేకాట ఆడుతున్న నలుగురిని అరెస్ట్ చేసినట్లు చెన్నారావుపేట ఎస్సై రాజేష్ రెడ్డి గురువారం తెలిపారు. మండలంలోని పాపయ్యపేట గ్రామ శివారులో పేకాట ఆడుతున్నారని నమ్మదగిన వ్యక్తులు ఇచ్చిన సమాచారం మేరకు పేకాట స్థావరం పై దాడి చేసినట్లు తెలిపారు. ఇదే గ్రామానికి చెందిన మురహరి విటల్, కాట ప్రశాంత్, కొత్తపెల్లి కృష్ణ, పరకాల సతీష్ లు నలుగురు పేకాట ఆడుతుండగా పట్టుకున్నట్లు తెలిపారు. వారి వద్ద రూ.2 వేల నగదు, 3 సెల్ ఫోన్లు, పేక ముక్కలను స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏఎస్ఐ లక్ష్మణమూర్తి, పోలీస్ సిబ్బంది సతీష్, విజయ్ కుమార్, తదితరులు పాల్గొన్నారు.

# ఇసుక రవాణాపై కఠినంగా వ్యవహరించాలి

- ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు



**జయశంకర్ భూపాలపల్లి బ్యూరో, (జనంసాక్షి):** ఇసుక రవాణాలో పర్యవేక్షణ లోపం రావొద్దని, కఠినంగా వ్యవహరించాలని భూపాలపల్లి శాసన సభ్యులు గండ్ర సత్యనారాయణ రావు తెలిపారు. గురువారం ఐడిఓసి కార్యాలయంలో ఇందిరమ్మ ఇళ్లకు ఇసుక సరఫరాపై రెవెన్యూ, పోలీస్, అటవీ, మైనింగ్, గృహ నిర్మాణ, పంచాయతి రాజ్ తదితర శాఖల అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నంబర్ ప్లేట్లు లేని వాహనాలను తక్షణం సీజ్ చేయాలని, అలాగే అక్రమ ఇసుక రవాణాను అరికట్టేందుకు ఏర్పాటు చేసిన స్పెషల్ టాస్క్ ఫోర్స్ బృందాలు నిరంతర పర్యవేక్షణ చేయాలని సూచించారు. ప్రభుత్వం నిర్దేశించిన రీచ్ ల నుండి మాత్రమే ఇసుక రవాణా చేయాలని స్పష్టం చేశారు. లబ్ధిదారుల జాబితా, ఇతర ప్రభుత్వ పనులు పూర్తి అయిన వివరాలు ఎంపిడిఓ కు ఇవ్వాలని, పూర్తి అయిన పనులకు ఇసుక రవాణాను అరికట్టాలని తెలిపారు. మన జిల్లా ప్రజలకు మాత్రమే ఇసుక సరఫరా చేయాలని, ఇతర జిల్లాలకు లేదా ప్రాంతాలకు రవాణా పూర్తిగా నిషేధమని స్పష్టం చేశారు. సరిహద్దుల్లో సిసి కెమెరాలు ఏర్పాటు ద్వారా పటిష్ట పర్యవేక్షణ చేయాలని తెలిపారు. అక్రమ ఇసుక నిల్వలు ఉంచితే అవి సీజ్ చేసి చట్టపరమైన చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఉదయం 6 గంటల నుండి సాయంత్రం 6 గంటల వరకు మాత్రమే ఇసుక రవాణాకు అనుమతి ఉంటుందని తెలిపారు. ఒక రోజుకు ఒక వాహనానికి మాత్రమే జారీ చేసిన కూపన్ ఆధారంగా ఒక ట్రిప్పు రవాణాకు అనుమతి ఉంటుందని, కూపన్ లేని వాహనాలను సీజ్ చేయాలని ఆదేశించారు. అధిక లోడు వేసే వాహనాలను సీజ్ చేయడంతో పాటు జరిమానాలు విధించడం జరుగుతుందని తెలిపారు. ఇందిరమ్మ గృహ నిర్మాణదారులు ఇసుక కొరకు తమ గ్రామపంచాయతీ కార్యదర్శి ద్వారా కూపన్ పొందాలని, గుర్తించిన రీచ్‌ల నుండి మాత్రమే రవాణా చేయాలని సూచించారు. ఆదివారాలు, ప్రభుత్వ సెలవు దినాల్లో ఇసుక రవాణాకు అనుమతి ఉండదని ఆయన స్పష్టం చేశారు. జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ మాట్లాడుతూ విధుల నిర్వహణ లో నిర్లక్ష్యం వహిస్తే విధుల నుండి సస్పెండ్ చేస్తామని హెచ్చరించారు. ఇసుక రవాణాలో జిల్లాకు ఎలాంటి చెడ్డ పేరు తెవొద్దని పారదర్శకంగా, నిష్పక్షపాతంగా, కఠినంగా వ్యవహరించాలని స్పష్టం చేశారు. ఎస్పి కిరణ్ ఖరే మాట్లాడుతూ అక్రమ ఇసుక రవాణాను కంట్రోల్ చేయాల్సిన బాధ్యత అన్ని శాఖల అధికారులపై ఉందని తెలిపారు. పటిష్ట పర్యవేక్షణ వల్ల ఫలితాలు ఉంటాయని తెలిపారు. అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేస్తే క్రమబద్ధీకరణ జరుగుతుందని ఆయన తెలిపారు. ప్రతిరోజు జారీ చేసిన కూపన్ల నివేదిక అందజేయాలని తెలిపారు. తక్షణ సమాచారాన్ని వాట్సప్ గ్రూపులో పెట్టాలని తెలిపారు. ప్రతి పోలీస్ స్టేషన్ లో ట్రాక్టర్ల జాబితా అందుబాటులో ఉండాలని తెలిపారు. ఈ సమావేశంలో అటవీ శాఖ అధికారి నవీన్ రెడ్డి, అదనపు కలెక్టర్లు అశోక్ కుమార్, విజయలక్ష్మి, ట్రైనీ డిప్యూటీ కలెక్టర్ నవీన్ రెడ్డి, మైనింగ్ ఎడి జయరాజు, డిపిఓ శ్రీలత, భూపాలపల్లి నియోజకవర్గ మండలాల తహసిల్దార్లు, ఎంపీడీవోలు తదితరులు పాల్గొన్నారు.

# క్రీడలకు తెలంగాణ ప్రభుత్వం ప్రాధాన్యం

**నేషనల్ ఓపెన్ అండర్-23 అథ్లెటిక్స్ పోటీలు ప్రారంభించిన ఎంపీ కడియం కావ్య**




**వరంగల్ ఈస్ట్, అక్టోబర్ 16 (జనం సాక్షి) :** హనుమకొండ జవహర్‌లాల్ నెహ్రూ స్టేడియంలో గురువారం ప్రారంభమైన 5వ నేషనల్ ఓపెన్ అండర్–23 అథ్లెటిక్స్ ఛాంపియన్షిప్ పోటీలను వరంగల్ ఎంపీ డాక్టర్ కడియం కావ్య ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ తెలంగాణ ప్రభుత్వం క్రీడా రంగానికి అత్యంత ప్రాధాన్యం ఇస్తోందని అన్నారు. ఖేలో ఇండియా–2026 క్రీడలను హైదరాబాద్‌లో నిర్వహించేందుకు రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తోందని తెలిపారు. 2036లో భారత్‌లో జరగనున్న ఒలింపిక్స్ క్రీడల్లో కొన్ని గేమ్స్ తెలంగాణలో నిర్వహించేందుకు సీఎం రేవంత్ రెడ్డి కృషి చేస్తున్నారని చెప్పారు. జవహర్‌లాల్ నెహ్రూ స్టేడియాన్ని క్రీడాకారులకు అనువుగా అన్ని సౌకర్యాలతో అభివృద్ధి చేస్తున్నామని తెలిపారు. క్రీడలు మానసిక, శారీరక ఉల్లాసానికి దోహదం చేస్తాయని, క్రీడా స్ఫూర్తితో ప్రతి క్రీడాకారుడు పోటీల్లో పాల్గొనాలని పిలుపునిచ్చారు. ఈ పోటీల్లో దేశవ్యాప్తంగా 945 మంది మహిళా అథ్లెటిక్స్ పాల్గొంటుండగా, వారిలో 20 మంది తెలంగాణకు చెందినవారని ఎంపీ పేర్కొన్నారు. రానున్న రోజుల్లో రాష్ట్ర క్రీడాకారులు జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో విజయాలు సాధించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర అథ్లెటిక్స్ చైర్మన్ ఎర్రబెల్లి రాజేశ్వరరావు, జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్, మేయర్ గుండు సుధారాణి, గ్రంథాలయ చైర్మన్ అజీజ్ ఖాన్, క్రీడా అధికారులు తదితరులు పాల్గొన్నారు.

జనంసాక్షి
www.janamsakshi.org
శుక్రవారం
17 అక్టోబర్ 2025

# రైతాంగాన్ని ఆదుకోవాలి

- సీపీఐ(ఎం) ఖమ్మం జిల్లా కార్యదర్శి నున్నా నాగేశ్వరరావు

**ఖమ్మం, అక్టోబర్ 16 (జనం సాక్షి) :** అతివృష్టి వల్ల ఖమ్మంజిల్లాలో పంటలు తీవ్రంగా దెబ్బతిన్నాయని సీపీఐ(ఎం) ఖమ్మం జిల్లా కార్యదర్శి నున్నా నాగేశ్వరరావు పేర్కొన్నారు. దిగుబడులు, ధరలు భారీగా పడిపోయి ఆందోళనలో ఉన్న రైతాంగాన్ని ఆదుకోవాలని కోరారు. రైతులకు అండగా పార్టీ అధ్వర్యంలో నేటి నుంచి 24వ తేదీ వరకు ఆందోళనలు చేపడుతామన్నారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీల రిజర్వేషన్ పెంపుపై బీజేపీ ద్వంద్వ వైఖరీ అవలంబిస్తోందన్నారు. వర్షాలకు రోడ్లు దెబ్బతిని ప్రమాదాలు చోటు చేసుకుంటన్న నేపథ్యంలో యుద్ధ ప్రాతిపదికన మరమ్మతులు చేపట్టాలని కోరారు. ఖమ్మంలోని సుందరయ్య భవనంలో గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో పార్టీ రాష్ట్ర కమిటీ సభ్యులు బండి రమేశ్, కళ్యాణం వెంకటేశ్వరరావు, వై. విక్రమ్, జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు యర్రా శ్రీనివాసరావుతో కలిసి నున్నా మాట్లాడారు. ఖమ్మం జిల్లాలో ఈ ఏడాది ఐదులక్షల ఎకరాల విస్తీర్ణంలో పంటలు సాగయ్యాయని, దీనిలో 2.25 లక్షల ఎకరాల వరి, 1.80 లక్షల ఎకరాల్లో పత్తి, 40 వేల ఎకరాల్లో మిర్చి, మరో 40 వేల ఎకరాల్లో మొక్కజొన్న, 18 వేల ఎకరాలు పెసర పంటలు సాగు చేశారని వివరించారు. ఈ పంటలన్నీ కూడా అధిక వర్షాల వల్ల దెబ్బ తిన్నాయని, పంటలు ఎర్రబారిపోవటం వల్ల దిగుబడులు లేక రైతులు తీవ్ర ఆందోళనలో ఉన్నారని చెప్పారు. వర్షాల కారణంగా పెసర పంట చేతికి రాకుండానే పోయిందని అన్నారు.



### బీసీ రిజర్వేషన్ పై బీజేపీ ద్వంద్వ వైఖరి

జనాభా ప్రాతిపదికన బీసీ రిజర్వేషన్ అమలు చేయాలని సీపీఐ(ఎం) డిమాండ్ చేస్తోందన్నారు. పార్టీ రాష్ట్ర కార్యదర్శిగా తమ్మినేని వీరభద్రం ఉన్న సమయంలో మహాజన పాదయాత్రనూ చేపట్టిన విషయాన్ని గుర్తు చేశారు. ఎస్సీ, ఎస్టీ సబ్ప్లాన్ నిధులను షెడ్యూల్ ఏరియాలు, జనాభాకే ఖర్చు పెట్టాలని డిమాండ్ చేస్తున్నామని తెలిపారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 42% రిజర్వేషన్ కల్పనకు సీపీఐ(ఎం) మద్దతు తెలిపిందన్నారు. రాష్ట్రంలోని అన్ని పార్టీలు దీనిని స్వాగతించాయని, అసెంబ్లీలో తీర్మానం చేసి పంపినా బీజేపీ అదుపాజ్ఞల్లో పనిచేసే గవర్నర్ తొక్కిపట్టారని తెలిపారు. జీవో 9 ద్వారా రాష్ట్ర ప్రభుత్వం 42% రిజర్వేషన్ అమలు చేస్తూ నోటిఫికేషన్ ఇచ్చినా హైకోర్టు స్టే విధించిందన్నారు. బీసీల రిజర్వేషన్ పెంపునకు ఆటంకంగా మారిన బీజేపీ రాష్ట్రంలో దీనికి మద్దతుగా ఆందోళనల్లో పాల్గొనటం హాస్యాస్పదంగా ఉందన్నారు. బీసీల రిజర్వేషన్ పెంపు బాధ్యత కేంద్రానిదే కాబట్టి... కేంద్ర ప్రభుత్వ తీరును నిరసిస్తూ సీపీఐ(ఎం) స్వతంత్రంగా శుక్రవారం ఛలో రాజ్ భవన్ కు పిలుపునిచ్చిందన్నారు. అన్ని జిల్లా కేంద్రాల్లో నిర్వహించే ఆందోళనలకు సీపీఐ(ఎం) మద్దతు ఇస్తోందన్నారు.

## వీధికుక్కలను నివారించాలని ఎంపీడీవోకు వినతి

- వీధి కుక్కల స్వైర విహారం



**పెన్‌పహాడ్, అక్టోబర్ 16 (జనం సాక్షి) :** గ్రామంలో వీధి కుక్కలు స్వైర విహారం చేస్తున్నాయని,కనిపించిన వ్యక్తులపై విచక్షణారహితంగా దాడి చేసి గాయపరుస్తున్నాయని, ఎక్కడ చూసినా గుంపులు గుంపులుగా రోడ్లపై తిరుగుతూ భయభ్రాంతులకు గురి చేస్తున్నాయనీ మండల పరిధిలోని పొట్లపహాడ్ గ్రామానికి చెందిన టిఎంఆర్పిఎస్ జిల్లా అధ్యక్షుడు పుట్టల శ్రవణ్ కుమార్ గ్రామ యువతతో కలిసి గురువారం స్థానిక మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో ఎంపీడీవో జానయ్యకు వినతి పత్రం అందించారు. ఈ సందర్భంగా శ్రవణ్ కుమార్ మాట్లాడుతూ ఇప్పటికే వీధి కుక్కలు పలువురు గ్రామస్తులను గాయపరిచాయని,ఎక్కడ ప్రాణాంతకమైన రేబిస్ వ్యాధి సోకుతుందోనని భయాందోళనలతో జీవించాల్సి వస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు. పలు కుక్కలకు వింత శర్మ వ్యాధి సోకడంతో వాటి వలన గ్రామ ప్రజలు ఆందోళన చెందుతున్నారని, కావున తక్షణమే స్పందించి తగిన చర్యలు చేపట్టి కుక్కల నుండి గ్రామ ప్రజలను రక్షించవలసిందిగా కోరుతున్నామన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ యువత సంతోష్, మధు, నాగరాజు, వేణు, సైదులు, అభినయ్, అఖిల్, తదితరులు పాల్గొన్నారు.

## కార్యకర్తల అభిప్రాయ సేకరణతోనే డీసీసీ ఎన్నిక



**తాండూరు, అక్టోబర్ 16 (జనంసాక్షి) :** తెలంగాణ కాంగ్రెస్ ప్రదేశ్ కమిటీ ఇంచార్జ్ మీనాక్షి నటరాజ్ , టీపీసీసీ అధ్యక్షులు మహేష్ కుమార్ గౌడ్ ఆదేశాల మేరకు డిసిసి అధ్యక్షులు, పరిగి ఎమ్మెల్యే టి.రామ్మోహన్ రెడ్డి సూచనల మేరకు తాండూరు ఎమ్మెల్యే బుయ్యని మనోహర్ రెడ్డి ఆధ్వర్యంలో తాండూరు పట్టణంలోని వెంకొబ ఫంక్షన్ హాల్ లో యాలాల్, బషీరాబాద్ మండలాల నాయకులతో కాంగ్రెస్ పార్టీ సంస్థాగత నిర్మాణ జిల్లా స్థాయి సంఘటన్ సృజన్ అభియాన్" సమావేశం నిర్వహించారు. డిసిసి అధ్యక్ష పదవి కోసం దరఖాస్తులను స్వీకరించారు. తాండూర్ నియోజకవర్గం నుండి ధారాసింగ్, ఉత్తమ్ చంద్, శంకరప్ప డిసిసి అధ్యక్ష పదవికి దరఖాస్తు చేసుకున్నారు. అనంతరం బూత్ స్థాయి కార్యకర్తలతో ఎఐసిసి ఇన్‌చార్జ్ సూరజ సింగ్ ఠాగూర్ మాట్లాడి, పార్టీ బలపర్చడంలో ప్రతి కార్యకర్త పాత్ర కీలకమని పేర్కొన్నారు.ఈ సమావేశంలో ఎఐసిసి తరఫున ఇన్‌చార్జ్‌గా సూరజ్ సింగ్ ఠాగూర్ , టీపీసీసీ నుండి బెల్లయ్య నాయక్ , ఫైనాన్స్ కమిషన్ మెంబర్ రమేష్ మహారాజ్, ఆర్యవైశ్య కార్పొరేషన్ చైర్మన్ కల్వ సుజాత, రెండు మండలాల నాయకులు పాల్గొన్నారు.

## ఆల్‌రౌండ్ బెస్ట్ బ్రాంచ్‌గా కామారెడ్డి ఐఎంఏ

**కామారెడ్డి జిల్లా ప్రతినిధి, అక్టోబర్ 16 (జనం సాక్షి) :** కామారెడ్డి ఐఎంఏ తెలంగాణ రాష్ట్రంలోనే ఆల్ రౌండ్ బెస్ట్ బ్రాంచ్ అవార్డును గెలుచుకోవడం ఐఎంఎ సభ్యుల సమిష్టి కృషి వల్లనే ఇది సాధ్యమైందని జిల్లా ప్రధాన కార్యదర్శి డాక్టర్ అరవింద్ గౌడ్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ అవార్డు నిజంగా ఐఎంఏ కు కామారెడ్డికి ప్రతిష్టాత్మకమైన గౌరవం మరియు గర్వకారణం. మన అందరి సమిష్టి కృషి, కార్యక్రమాలు చేయాలన్న ఉత్సాహం కారణంగా ఈ అవార్డును సాధించుకోవడం సాధ్యమైందన్నారు. క్రీడలు, సాంస్కృతిక కార్యక్రమాలే కాకుండా ఎయిడ్స్ దినోత్సవం రోజున ఎయిడ్స్‌పై అవగాహన, బాలికా దినోత్సవం, అగ్నిమాపక భద్రతా అవగాహనతో సహా, సంక్షోభ నిర్వహణ, ఆసుపత్రిలో ఆటంకాలు, రోగి వైద్యుల సంఘర్షణల సమయంలో సమస్యలు, ఆరోగ్య సంరక్షణ సమస్యలపై తదితర కార్యక్రమాలు నిర్వహించడం జరిగిందన్నారు. మహిళాల కోసం మహిళ వైద్యులు మహిళలకు వచ్చే క్యాన్సర్ స్క్రీనింగ్ శిబిరాలతో సహా ఆరోగ్య శిబిరాలు నిర్వహించి మహిళలకు అవగాహన కల్పించడం జరిగిందన్నారు. ఆరోగ్యం అవగాహన పైననీ కకుండా సమాజ సేవలో సైతం వరదల వల్ల ఇబ్బందులు పడ్డ ప్రజలకు ఆహారం, బట్టలు అందించి




సమాజ సేవలో మేమున్నామని అయ్యే సభ్యులు నిరూపించడం జరిగిందన్నారు.డాక్టర్ వెల్నెస్ ఇనిషియేటివ్స్ ధ్యానం, యోగా సెషన్లు, అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా ప్రజలకు ధ్యానం యోగ పై అవగాహన కల్పించడం జరిగిందని, మా సీనియర్ వైద్యులు, గత అధ్యక్షులు, కార్యదర్శులు, ఎథిక్స్ కమిటీ చైర్మన్ డాక్టర్ కిరణ్, ఐఎంఏ స్పోర్ట్స్ కమిటీ సభ్యులకు వారి అపారమైన సహకారం, నిరంతర మద్దతు అందించిన వీరికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలుపుతున్నామన్నారు. ముందు ముందు మరిన్ని ఆరోగ్యం పై అవగాహనలు సమావేశ సేవలు చేస్తూ ముందుకు సాగుదాం అని ఈ సందర్భంగా ఐఎంఏ సభ్యులను కోరుతున్నాం అన్నారు.

## సీపీఆర్‌పై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలి

- జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్



**సూర్యాపేట ప్రతినిధి, అక్టోబర్ 16 (జనంసాక్షి) :** గుండె పని చేయకుండా ఆగిపోయిన వ్యక్తులకు వైద్య సహాయం అందే వరకు ప్రాణాలు నిలపడానికి సీపీఆర్ అత్యవసరమని జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ పేర్కొన్నారు.గురువారం కలెక్టరేట్‌లో సిబ్బందికి సిపిఆర్ పై ఏర్పాటు చేసిన అవగాహన కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. గుండె పని చేయకుండా ఆగిపోయి శ్వాస తీసుకోకుండా స్పృహ కోల్పోయిన వ్యక్తులకు మాత్రమే సిపిఆర్ విధానం ఉపయోగించాలని, గుండె పోటుకు ఈ విధానము ఉపయోగించరాదని సూచించారు.ఇటీవల గుండె పనిచేయకుండా ఆగిపోవటం లాంటి సంఘటనలు పెరిగిపోతున్నాయని, అలాంటి సమయంలో సిపిఆర్ పై ప్రతి ఒక్కరు కనీస అవగాహన కలిగి ఉండాలని అన్నారు. ఎవరైనా ప్రమాదంలో ఉంటే వెంటనే స్పందించి సిపిఆర్ చేస్తే ప్రాణాలు కాపాడిన వారవుతారని తెలిపారు.సిపిఆర్ చేసేటప్పుడు వ్యక్తులను బట్టి ఛాతిపై ఒత్తిడి చేయాలని, ఎక్కువ ఒత్తిడి చేయకూడదని స్పష్టం చేశారు.అనంతరం వైద్యులు సృజన, శరణ్య సిపిఆర్ ఎలా చేయాలో ప్రాక్టికల్ గా చేసి చూపించారు.ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ కే సీతారామారావు, డిఎంహెచ్ఓ డాక్టర్ చంద్రశేఖర్, డిసిహెచ్ఎస్ వెంకటేశ్వర్లు, పరిపాలన అధికారి సుదర్శన్ రెడ్డి, వైద్య ఆరోగ్య సిబ్బంది, కలెక్టరేట్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## సెల్లార్‌ను కేవలం పార్కింగ్ కొరకే వినియోగించాలి




**భువనగిరి, అక్టోబర్ 16 (జనం సాక్షి) :** భువనగిరి పురపాలక సంఘంలో జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) మరియు పురపాలక సంఘ ప్రత్యేక అధికారి ఏ. భాస్కర రావు అధ్యక్షతన మున్సిపల్ కౌన్సిల్ హాల్‌లో పట్టణంలోని సెల్లార్ కలిగి ఉన్నటువంటి భవన యజమానులు, జన్మభూమి షాపుల లీజుదారులతో సమావేశం నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) మరియు ప్రత్యేక అధికారి మాట్లాడుతూ భువనగిరి పట్టణంలో అనుమతులు కలిగియున్న సెల్లార్ భవనాలు వారందరూ తమ సెల్లార్ను కేవలం పార్కింగ్ కొరకే వినియోగించాలని, ఇతర ఏ అవసరాలకు వినియోగించకూడదని తెలియజేయడమైనది. ఒకవేళ సదరు సెల్లార్ను ఇతర వినియోగం కొరకు వినియోగించినచో అట్టి భవనాలను సీజ్ చేయబడతాయని హెచ్చరించడం జరిగింది. ఈ కార్యక్రమంలో కమిషనర్ జి. రామలింగం, మున్సిపల్ అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## విచ్చలవిడిగా మట్టి తవ్వకాలు

- పట్టించుకోని సంబంధిత అధికారులు..

**దమ్మపేట, అక్టోబర్ 16 (జనం సాక్షి) :** దమ్మపేట మండలవ్యాప్తంగా మట్టి మాఫియా చెలరేగిపోతుంది. ప్రభుత్వాదాయానికి గండికొడుతూ ఇందిరమ్మ కమిటీ పేరు మీద జోరుగా మట్టి దందాను కొనసాగిస్తున్నారు. మట్టిమాఫియా దారులకు సమయం, రోజుతో సంబంధం లేకుండా ఇష్టారీతిన వారికి తగిన సమయంలో మట్టిని తోలుతూ బడుగు బలహీన వర్గాల ప్రజల నుంచి పెద్ద మొత్తంలో డబ్బులు దండుకుంటూ లక్షలు గడుస్తున్నారు. దమ్మపేట మండల తాసిల్దార్ ప్రభుత్వ కార్యాలయానికి కోతవేటూ దూరంలో ఇంత తతంగం జరుగుతున్న కనీసం అధికారులు స్పందించకపోవడంపై మండల ప్రజలు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. మట్టి మాఫియా నుంచి ప్రభుత్వ అధికారులు కాసులకు లోబడి అటువైపు వెళ్ళటం లేదా అని ప్రజలు వాపోతున్నారు.అధికార పార్టీ నాయకుల పేర్లు చెబుతూ మీడియా వారిని అధికారులను భయభ్రాంతులకు గురిచేస్తున్నారని మండలంలో వార్త చర్చనీయాంశంగా మారింది.ప్రజా పాలనలో పేద ప్రజల జేబులకు చిల్లు



పడుతున్న నాయకులు ఏం చేస్తున్నారని ప్రజలు చర్చించుకుంటున్నారు. సంబంధిత అధికారుల సైతం అంధకారంలో ఉండటంవల్ల మట్టి మాఫియా పేట్రేగిపోతుందని ఇందిరమ్మ కమిటీ పేరున ఇష్టం వచ్చినట్లు డబ్బులు వసూలు చేస్తూ మట్టి మాఫియా కోట్లు గడిస్తుందని మండల ప్రజలు బహుటుంగానే చర్చించుకుంటున్నారు.ఇకనైనా సంబంధిత అధికారులు చొరవ తీసుకొని మట్టి మాఫియా ఆగడాలను అరికట్టాలని పేద ప్రజలకు ప్రభుత్వం ద్వారా సరసమైన ధరలకు మట్టిని అందించాలని మండల ప్రజలు కోరుకుంటున్నారు. ఇకనైనా సంబంధిత అధికారులు చొరవ తీసుకుంటారా లేదా అని మండల ప్రజలు వాపోతున్నారు.

## విధులకు సమయపాలన పాటించని ఉద్యోగులపై కఠిన చర్యలు



**మునగాల, అక్టోబర్ 16 (జనంసాక్షి) :** విధులకు గైర్హాజరయ్యే, సమయపాలన పాటించని ఉద్యోగులపై కఠిన చర్యలు తప్పవని సూర్యాపేట జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ అన్నారు. గురువారం మునగాల తహసిల్దార్ కార్యాలయాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. జిల్లా కలెక్టర్ ఆకస్మిక తనిఖీలో భాగంగా డిప్యూటీ తహసిల్దార్ డి. సత్యనారాయణ, ఎంపీఎస్ఓ సంపత్, జూనియర్ అసిస్టెంట్ సునీల్ గవాస్కర్, రికార్డ్ అసిస్టెంట్ ప్రశాంత్ లు విధులకు రిపోర్ట్ చేయలేదు. కార్యాలయ సమయం ఉదయం 10.30 దాటినప్పటికీ సిబ్బంది విధులకు హాజరు కాకపోవడంపై ఆగ్రహించిన జిల్లా కలెక్టర్ గైర్హాజరైన వారందరినీ విధులనుండి సస్పెండ్ చేస్తున్నట్లు ప్రకటించారు. అంతేగాక ఈ అంశంపై తహసీల్దార్ సరితను వివరణ కోరారు. జిల్లా కలెక్టర్ తహసిల్దార్ కార్యాలయ సిబ్బంది హాజరు రిజిస్టర్ ను పరిశీలించగా మొత్తం కార్యాలయంలో 18 మంది ఉద్యోగులకు గాను నలుగురు ఉపనియామకంపై ఇతర కార్యాలయాలలో పని చేస్తుండగా, ఇద్దరు ఆకస్మిక సెలవులపై ఉన్నారు. మరొక ఉద్యోగి సర్వే విధులకు వెళ్లారు. డిప్యూటీ తహసిల్దార్, ఎంపీఎస్ఓఎస్, రికార్డ్ అసిస్టెంట్లు విధులకు హాజరు కాలేదు. తక్కినవారు హాజరయ్యారు. సిబ్బంది అందరూ సకాలంలో విధులకు హాజరుకావాలని, ఒకవేళ విధులకు గైర్హాజరైనా, ఆలస్యంగా వచ్చినా చర్యలు తప్పవని కలెక్టర్ హెచ్చరించారు.

## నాణ్యతా ప్రమాణాలు పాటించాలి

**పాపన్నపేట, అక్టోబర్ 16 (జనంసాక్షి) :** నాణ్యతా ప్రమాణాలను పాటిస్తూ వరిధాన్యం కొనుగోళ్లు జరగాలని,దశల వారీగా జరిగే ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణాలకు సంబంధించిన బిల్లులు వెంటనే లబ్ధిదారులకు అందేలా క్షేత్రస్థాయిలో కృషి చేయాలని సంబంధిత అధికారులకు జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్ సూచించారు. గురువారం పొడిచన్ పల్లి గ్రామంలో ధాన్యం కొనుగోలు కేంద్రం,ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణ పురోగతి పనులను పరిశీలించారు. కలెక్టర్ మాట్లాడుతూ..ఆలస్యం లేకుండా ఎప్పటికప్పుడు కొనుగోళ్లు జరగాలని ఏ కేంద్రం లోను ఎలాంటి సమస్య రాకుండా చూడాలని అధికారులకి తెలిపారు. ధాన్యం తేమ శాతాన్ని సరిగ్గా నిర్ధారించాలన్నారు.



## మురికి కూపంగా రహదారి..

- పట్టించుకోని అధికారులు..?
- అవస్థలు పడుతున్న ప్రజలు, వాహనదారులు
- సీపీఎం హయత్ నగర్ సర్కిల్ కమిటీ



**హయత్‌నగర్, అక్టోబర్ 16 (జనం సాక్షి) :** భాగ్యలత నుండి ఇంజాపురం, సామ నగర్, ముదిరాజ్ కాలనీ, హయత్ నగర్, వెంకటేశ్వర కాలనీ, వెళ్లే దారిలో ఉన్న గత నెల రోజులకు పైగా డ్రైనేజీ పొంగిపొర్లుతుంటే చోద్యం చూస్తున్న అధికారులు, తక్షణమే డ్రైనేజ్ పొంగే దానిని అరికట్టి బాటసారులకు, వాహనదారులకు అసౌకర్యాలను తొలగించాలని సిపిఎం హయత్ నగర్ సర్కిల్ కార్యదర్శి కీసర నర్సిరెడ్డి డిమాండ్ చేశారు. సిపిఎం సర్వేలో భాగంగా సామ నగర్ లో నిర్వహించగా ప్రజలు చెప్పిన డ్రైనేజీని రోడ్డులో ప్రవహిస్తున్న దానిపై చెప్పగా సిపిఎం పరిశీలించి ఈ సమస్యని జిహెచ్ఎంసి దృష్టికి, షేవరేజ్ అధికారులు తక్షణమే నివారణ చర్యలు చేపట్టాలని వారు కోరారు. ఈ దారి నుండి నిత్యం వేలాది వాహనములు, ప్రజలు, విద్యార్థులు, కాలేజి, అపార్ట్మెంట్స్, హాస్టల్ లోకి ఈ దారిలో వెళ్తుంటారని వారు తెలియజేశారు. తక్షణమే ఈ డ్రైనేజ్ పొంగే దాని పైన తగిన చర్యలు తీసుకొని, ప్రజల సౌకర్యార్థం మురుకు నీరును అరికట్టాలని వారు అన్నారు. ఈ సర్వే లో సిపిఎం సర్కిల్ కార్యదర్శి కీసరి నర్సిరెడ్డి, సర్కిల్ కమిటీ సభ్యులు సిహెచ్ కృష్ణయ్య , శాఖ కార్యదర్శులు కొత్త గణేష్ గౌడ్, హయత్ నగర్ కార్యదర్శి ముషం నరహరి, సామ నగర్ కార్యదర్శి బిట్ల మూర్తి, పబ్బు సత్యనారాయణ గౌడ్, ఏ యాదగిరి, తదితరులు పాల్గొన్నారు.

# కష్టపడ్డ కార్యకర్తలను కడుపులో పెట్టుకుంటాం

- పార్టీ వెన్నుపోటుదారుల భరతం పడతాం
- ఎమ్మెల్యే బీఎల్ఆర్

**మిర్యాలగూడ, అక్టోబర్ 16 (జనం సాక్షి) :** కాంగ్రెస్ పార్టీ కోసం కష్టపడ్డ ప్రతి కార్యకర్తను కడుపులో పెట్టి చూసుకుంటామని అదేవిధంగా పార్టీలో ఉండే వెన్నుపోటుదారుల భరతం పడతామని మిర్యాలగూడ ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి (బిఎల్ఆర్)అన్నారు. గురువారం పట్టణంలోని రాజీవ్ భవన్ లో డిసిసి అధ్యక్షుడి ఎంపిక కోసం నిర్వహించిన అభిప్రాయ సేకరణ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ రాహుల్ గాంధీని ప్రధానమంత్రిని చేయడమే ప్రధాన లక్ష్యంగా ప్రతి కాంగ్రెస్ కార్యకర్త పనిచేయాలన్నారు. కానీ కొందరు పార్టీలో ఉంటూనే వెన్నుపోటు రాజకీయాలు చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. అందరి జాతకాలు తనకు తెలుసన్నారు. తాను రైతాంగం కోసం




రెండు కోట్ల రూపాయలు ముఖ్యమంత్రి సహాయనిధికి ఇవ్వటంపై కూడా ప్రతిపక్షాలతో కలిసి కొందరు అసత్య ప్రచారాలు చేస్తున్నారని అన్నారు. తన రాజకీయ జీవితంలో ఇంతవరకు ఒక్క రూపాయి కూడా అవినీతికి పాల్పడలేదని, పాల్పడినట్లు ఎవరైనా నిరూపిస్తే దేనికైనా సిద్ధం అంటూ సవాల్ విసిరారు. తన కుటుంబ సభ్యుల పేరు మీద 165 లారీలు ఉండగా వాటిలో 92 లారీలు అమ్ముకొని ప్రజా సంక్షేమం కోసం పాటుపడుతున్న వ్యక్తిత్వం తనదన్నారు. ప్రతి నాయకుడు ప్రజా సంక్షేమం కోసం, నమ్ముకున్న పార్టీ అభివృద్ధి కోసం పనిచేయాలన్నారు. రాజకీయాల్లోకి వచ్చిన మొదటి నుండి వేలాదిగా నియోజకవర్గ ప్రజలు కుల మతాలకతీతంగా తనకు వెన్నంటి నిలిచారని, నమ్ముకున్న ప్రజలను పొమ్ము చేసే పనులు తాను ఎన్నటికీ చేయబోనని స్పష్టం చేశారు. నియోజకవర్గ అభివృద్ధిలో ప్రతి ఒక్కరు భాగస్వామ్యం కావాలని కోరారు. మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి సహకారంతో మరో 300ఇళ్ళు అదనంగా తీసుకొచ్చామన్నారు. చివరి శ్వాస వరకు పార్టీ ప్రజల అభివృద్ధి కోసమే తాను పనిచేస్తానని అన్నారు. పార్టీలో వెన్నుపోటుదారులు తమకు తామే రాజకీయ సమాధిచేసుకుంటున్నారని ఇది తెలుసుకొని కాంగ్రెస్ పార్టీ అభివృద్ధికి కృషి చేయాలని కోరారు. కష్టపడి పని చేసే కార్యకర్తలకు పదవులు దక్కుతాయని అన్నారు.

# స్టాక్ మార్కెట్లకు మళ్లీ లాభాలు




దేశీయ స్టాక్ మార్కెట్లు గురువారం లాభాల్లో ముగిశాయి. సెన్సెక్స్, నిఫ్టీ రెండూ ఎగిశాయి. కొనసాగుతున్న క్యూ2 ఫలితాల సీజన్ లో స్టాక్-నిర్దిష్ట చర్యల మధ్య వరుసగా రెండవ సెషన్ లోనూ లాభపడ్డాయి.బీఎస్ఈ సెన్సెక్స్ 862.23 పాయింట్లు లేదా 1.04 శాతం పెరిగి 83,467.66 వద్ద, ఎన్ఎస్ఈ నిఫ్టీ 261.75 పాయింట్లు లేదా 1.03 శాతం పెరిగి 25,585.3 వద్ద ముగిశాయి.బీఎస్ఈలో టైటాన్, కోటక్ మహీంద్రా బ్యాంక్, యాక్సిస్ బ్యాంక్, ఎం అండ్ ఎం టాప్ గెయినర్లలో ఉండగా, ఇన్ఫోసిస్, ఎటర్నల్ (జొమాటో) మాత్రమే వెనుకబడి ఉన్నాయి.రంగాలవారీగా అన్ని రంగాలు (గ్రీన్ లో ముగిశాయి. నిఫ్టీ ఎఫ్ఎంసీజీ 2.02 శాతం లాభపడింది. నిఫ్టీ ఆటో, బ్యాంక్, కన్స్యూమర్ డ్యూరబుల్స్, రియల్టీ ఒక్కొక్కటి 1 శాతానికి పైగా లాభపడ్డాయి. విస్తృత మార్కెట్లలో, నిఫ్టీ మిడ్ క్యాప్ 100, స్మాల్ క్యాప్ 100 వరుసగా 0.46 శాతం, 0.24 శాతం పెరిగాయి.

# 'అప్పటికి బంగారం ధరలు భారీగా పడిపోతాయ్'



న్యూఢిల్లీ:ప్రస్తుతం బంగారం ధరలు రికార్డు స్థాయిలో పెరుగుతున్నాయి. అయితే వచ్చే ఏడాది ప్రథమార్ధం ధరలు పడిపోవచ్చని నిపుణులు చెబుతున్నారు. 2026 ద్వితీయార్ధంలో బంగారం ధర గణనీయంగా తగ్గే అవకాశాలున్నాయని ఏఎన్‌జెడ్ బ్యాంక్ అంచనా వేసింది.స్పాట్ గోల్డ్ ధర ఔన్స్ కు 0.4 శాతం పెరిగి 4,224.79 డాలర్లకు చేరుకుంది. యూఎస్ గోల్డ్ ఫ్యూచర్స్ (డిసెంబర్ డెలివరీ) 0.9 శాతం పెరిగి 4,239.70 డాలర్లకు చేరుకుంది. భారత్‌లో ప్రస్తుతం (అక్టోబర్ 16) 24 క్యారెట్ల బంగారం 10 గ్రాముల ధర రూ. 1,29,590 వద్ద ఉంది.అనిశ్చిత భౌగోళిక-రాజకీయ పరిస్థితులు, ఆర్థిక ఒడిదుడుకులు, యూఎస్ డాలర్ బలహీనత, వడ్డీ రేట్లు తగ్గే అంచనాలు అన్నీ కలిసి బంగారం ధరను ప్రస్తుతం ఆల్‌టైమ్ హై స్థాయికి చేర్చాయని నిపుణులు పేర్కొన్నారు.తక్కువ వడ్డీ రేటు వాతావరణంలో ధరలు బాగా పనిచేసే అనిశ్చిత కాలంలో సురక్షితమైన ఆస్తిగా కనిపించే బంగారం ఇప్పటి వరకు 61 శాతం పెరిగింది. యూఎస్ డాలర్ ఇండెక్స్ 0.1 శాతం పడిపోయి ఒక వారం కనిష్ట స్థాయికి చేరుకుంది.ఏఎన్‌జెడ్ అంచనా ప్రకారం బంగారం ధరలు ఇదే విధంగా పెరిగి 2026 మొదటి ఆరు నెలలు శిఖరానికి చేరుకుంటాయి. 2026 జూన్ నాటికి బంగారం ధర ఔన్స్‌కు 4,400 డాలర్లకు చేరే అవకాశం ఉంది. అయితే, ఆ తర్వాత ఈ ఏడాది రెండో భాగంలో ధరలు పడిపోవచ్చని ఏఎన్‌జెడ్ అంచనా వేసింది.

వెండి కూడా..

2026 మధ్య నాటికి వెండి ఔన్స్ కు 57.50 డాలర్లకు చేరుకుంటుందని ఏఎన్‌జెడ్ బ్యాంక్ అంచనా వేసింది. ఏదేమైనా, హాకిష్ ఫెడ్ వైఖరి, ఊహించిన దానికంటే బలమైన యూఎస్ ఆర్థిక వృద్ధి ప్రతికూల ప్రమాదాలను కలిగిస్తుందని ఏఎన్‌జెడ్ హెచ్చరించింది.




## పెరిగిన బంగారం, వెండి దిగుమతులు

అంతర్జాతీయంగా వాణిజ్య అనిశ్చితుల్లోనూ దేశ ఎగుమతుల రంగం పటిష్ట పనితీరు చూపించింది. సెప్టెంబర్‌లో ఎగుమతులు బలంగా నమోదయ్యాయి. క్రితం ఏడాది ఇదే నెలతో పోల్చి చూస్తే 6.74 శాతం అధికంగా 36.38 బిలియన్ డాలర్ల (3.20 లక్షల కోట్లు) విలువ మేర ఎగుమతులు జరిగాయి.దిగుమతులు సైతం 16.6 శాతం పెరిగి 68. 53 బిలియన్ డాలర్లు(రూ.6.03 లక్షల కోట్లు)గా ఉన్నాయి. దీంతో వాణిజ్య లోటు సెప్టెంబర్ నెలకు మరింత విస్తరించి 31.15 బిలియన్ డాలర్లు(రూ.2.74 లక్షల కోట్లు)గా నమోదైంది. 2024 సెప్టెంబర్ నెలలో దిగుమతులు 58. 74 బిలియన్ డాలర్లుగా ఉండడం గమనార్హం. కేంద్ర వాణిజ్య శాఖ ఈ వివరాలను విడుదల చేసింది.ప్రధానంగా బంగారం, వెండి, ఎరువుల దిగుమతులు పెరిగిపోయాయి. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం తొలి ఆరు నెలల్లో (ఏప్రిల్ నుంచి సెప్టెంబర్ వరకు) ఎగుమతులు క్రితం ఏడాది ఇదే కాలంతో పోలిస్తే 3 శాతం పెరిగి 220 బిలియన్ డాలర్లకు చేరాయి. ఇదే కాలంలో దిగుమతులు 4.53 శాతం పెరిగి 375.11 బిలియన్ డాలర్లుగా ఉన్నాయి. వాణిజ్య లోటు 155 బిలియన్ డాలర్లకు విస్తరించింది.అంతర్జాతీయంగా ఆర్థిక అనిశ్చితులు నెలకొన్న తరుణంలోనూ భారత వస్తు, సేవల ఎగుమతులు మంచి పనితీరు చూపించినట్టు కేంద్ర వాణిజ్య శాఖ కార్యదర్శి రాజేష్ అగర్వాల్ పేర్కొన్నారు. మెరుగైన పనితీరుకు కారణం ఏంటన్న మీడియా ప్రశ్నకు దేశీ పరిశ్రమ బలంగా ఉండటంతో.. తమ సరఫరా వ్యవస్థలను, వ్యాపార సంబంధాలను మెరుగ్గా కొనసాగించినట్టు చెప్పారు.

సెకండ్ హ్యాండ్ కారు కొంటున్నారా..!

# ఇవి కీలకం..



న్యూఢిల్లీ:ఢిల్లీ వంటి మహా నగరాల్లో కాలుష్యం అధికమవడంతో పదిహేళ్లు దాటిన కార్లు, ట్రాక్టర్లపై ఆంక్షలు విధిస్తున్నారు. ఈ తరుణంలో డీజిల్, పెట్రోల్ కార్ల అమ్మకాలు గణనీయంగా పెరిగాయి.వీటి విక్రయాలకు ఇక్కడ ప్రత్యేక మార్కెట్లు ఉంటాయి. కాగా, ఉమ్మడి వరంగల్ జిల్లాలోని పలువురు వ్యాపారులు తక్కువ ధరకు వాటిని అక్కడ కొనుగోలు చేసి సెకండ్ హ్యాండ్ కార్లుగా విక్రయిస్తున్నారు. వరంగల్ నగరంలో రకరకాల పేర్లతో సుమారు 20 వరకు పాత కార్ల దుకాణాలు ఉన్నాయి. ఏటా సుమారు 1,500 నుంచి 2వేల లోపు కార్ల విక్రయాలు సాగుతున్నాయి. ఇవి కాక తెలిసిన వారు, మధ్యవర్తుల సహకారంతో తెప్పిస్తున్నవి మరో 1,000 వరకు ఉంటాయని తెలుస్తోంది.వాహనం కొనుగోలు చేసే ముందు ఆర్సీ, బీమా, కాలుష్య నియంత్రణ ధ్రువీకరణ పత్రాలు అధీకృతమైనవి తీసుకోవాలి. వాహనంపై ఎలాంటి కేసులు లేవని పోలీసు శాఖ నుంచి ధ్రువీకరణ పత్రం పొందాలి. ఎన్ఓసీ పొందిన 15 రోజుల లోపు రిజిస్ట్రేషన్ చేయించుకోవాలి. లేదంటే నెలవారీగా జరిమానా విధిస్తారు. వాహన కాల పరిమితి 15 ఏళ్లు, మోడల్, కంపెనీ(ఇన్వాయిస్) ధరను బట్టి రోడ్ ట్యాక్స్ విధిస్తారు. ఇంజిన్ ఆన్ చేసే సమయంలో ఆయిల్ పైకి ఎగజిమ్మినా లీకైనా, పొగవచ్చినా ప్రమాదమని గుర్తించాలి. గేర్ ఇంజిన్ సరి చూసుకోవాలి. టైర్లు సరిగా లేకపోతే మైలేజీ తగ్గుతుంది. వాహన అద్దాల చివర కంపెనీ పేరు, ఏడాది సంఖ్య ముద్రించి లేకపోతే మార్చారని గ్రహించాలి. డోర్ బాటమ్ ప్రాంతంలో రబ్బర్లు తీసి వాటిపై గుండీల ఆకారంలో అచ్చులుంటే ఎలాంటి మార్పు చేయలేదని అర్థం. కార్పు కింది డిక్కీ ప్రాంతంలో మ్యాట్‌లు ఎత్తి కింది వైపు దెబ్బతింటే లేదో చూసుకోవాలి. ప్రమాదం జరిగిన వాహనాలకు రంగులు వేసి బఫింగ్ చేసే పొల్చుకోవడం కష్టమవుతుంది.

# బీఐఎస్ లైసెన్స్ పొందిన ఎన్ఎండీసీ స్టీల్

భారతదేశంలో మొదటిది పైప్‌లైన్ రవాణా, వెల్డెడ్ స్టీల్ పైపు, హాట్ రోల్డ్ స్టీల్ కోసం..



రాయ్‌పూర్(జనంసాక్షి):భారతదేశంలో అతి పిన్న వయస్కుమైన అత్యాధునిక ఇంటిగ్రేటెడ్ స్టీల్ ప్లాంట్ అయిన ఎన్ఎండీసీ స్టీల్ లిమిటెడ్ (ఎన్ఎస్ఎల్), "పైప్‌లైన్ రవాణా వ్యవస్థల కోసం వెల్డెడ్ స్టీల్ పైపు కోసం హాట్ రోల్డ్ స్టీల్ స్ట్రిప్, షీట్, ప్లేట్లు - సాధారణ అవసరాలు (ఐఎస్ 18384:2023)" కోసం ఇండియన్ స్టాండర్డ్ (ఐఎస్) లైసెన్స్ పొందిన దేశంలో మొట్టమొదటి కంపెనీగా అవతరించడం ద్వారా చారిత్రాత్మక మైలురాయిని సాధించింది. రాయ్‌పూర్‌లోని పండిట్ దీన్‌దయాల్ ఉపాధ్యాయ ఆడిటోరియంలో బీఐఎస్, రాయ్‌పూర్ నిర్వహించిన 2025 ప్రపంచ ప్రమాణాల దినోత్సవ వేడుకల సందర్భంగా బ్యూరో ఆఫ్ ఇండియన్ స్టాండర్డ్స్ (బీఐఎస్) ఈ సర్టిఫికేషన్‌ను ప్రదానం చేసింది. ఈ అవార్డును ఛత్తీస్‌గఢ్ ముఖ్యమంత్రి విష్ణు దేవ్ సాయి, ఆహార, పౌర సరఫరాల శాఖ మంత్రి దయాళ్ దాస్ బాఘేల్, బీఐఎస్ రాయ్‌పూర్ డైరెక్టర్, హెడ్ ఎస్.కె. గుప్తా సమక్షంలో ఎన్ఎండీసీ స్టీల్ చీఫ్ జనరల్ మేనేజర్ (స్టీల్) అమృత్ నారాయణ్ అందుకున్నారు. ఈ సర్టిఫికేషన్ నాణ్యత, ఆవిష్కరణ, స్థిరమైన అభివృద్ధికి ఎన్ఎండీసీ స్టీల్ నిబద్ధతను నొక్కి చెబుతుంది. పెట్రోలియం, సహజ వాయువు రంగాలలో భద్రత, పనితీరు అత్యంత డిమాండ్ ప్రమాణాలకు అనుగుణంగా ప్రపంచ స్థాయి ఉక్కు ఉత్పత్తులను ఉత్పత్తి చేయాలనే ఎన్ఎస్ఎల్ దార్శనికతను ఇది బలోపేతం చేస్తుంది. పెట్రోలియం, సహజ వాయువు పరిశ్రమలో పైప్‌లైన్ రవాణా వ్యవస్థల కోసం రూపొందించిన ఉక్కు ఉత్పత్తులలో శ్రేష్టతకు ఐఎస్ 18384:2023 సర్టిఫికేషన్ ఒక ముఖ్యమైన ప్రమాణాన్ని సూచిస్తుంది. ఇది సాంకేతిక పురోగతి, ఉన్నతమైన ఉత్పత్తి నాణ్యత, స్థిరమైన తయారీ పద్ధతులపై ఎన్ఎండీసీ స్టీల్ దృష్టిని హైలైట్ చేస్తుంది. ఎన్ఎండీ, చంద్ర అమితావా ముఖర్జీ, అమితావ ముఖర్జీ మాట్లాడుతూ "భారతదేశంలో ఈ బీఐఎస్ లైసెన్స్ పొందిన మొదటిగా మేము గర్విస్తున్నాము. ఇది మా శ్రేష్ఠత పట్ల అంకితభావానికి, భారతదేశ పారిశ్రామిక ప్రమాణాలు, మౌలిక సదుపాయాలను బలోపేతం చేయడంలో మా సహకారానికి నిదర్శనం." ఎన్ఎండీసీ స్టీల్ లిమిటెడ్ 3.0 ఎంటీపీఏ సామర్థ్యంతో పనిచేస్తుంది. ఉక్కు రంగంలో భారతదేశం స్వావలంబనను ముందుకు తీసుకెళ్లడంలో కీలక పాత్ర పోషిస్తోంది.

## గుడ్ల ధరలు

| హైదరాబాద్ | వరంగల్ |
|---|---|
| ₹ 5.20 | ₹ 5.22 |

**బంగారం ధరలు** (10 గ్రాములు)

హైదరాబాద్

| ₹ 1,18,650 | ₹ 1,29,440 |
|---|---|
| (22 క్యారెట్లు) | (24 క్యారెట్లు) |

**వెండి ధరలు (కేజీ)**

హైదరాబాద్

₹ 2,06,000

# తాలిబాన్ల చేతిలో.. పాక్‌కు ఘోర అవమానం




ఇస్లామాబాద్(జనంసాక్షి):పరస్పర ఆరోపణలతో.. అఫ్ఘనిస్తాన్-పాకిస్తాన్ సరిహద్దుల్లో నెలకొన్న ఉద్రిక్తతలు తారా స్థాయికి చేరాయి. బుధవారం జరిగిన పాకిస్తాన్ వైమానిక దాడుల్లో కనీసం 15 మంది అఫ్ఘాన్ పౌరులు మృతి చెందగా, 100 మందికి పైగా గాయపడ్డారు.దీంతో తాలిబాన్ సైన్యం ప్రతిచర్యలకు దిగడంతో పాక్ సైన్యం తోకముడిచినట్లు తెలుస్తోంది. అయితే యుద్ధం తర్వాతనే భావిస్తున్న తరుణంలో.. అమాన్యూగా 48 గంటలపాటు కాల్పుల విరమణ తెరపైకి రావడం గమనార్హం. ఈ క్రమంలో..కాబూల్, కాందహార్ దాడులపై అఫ్ఘనిస్తాన్ ప్రజలు రగిలిపోతున్నారు. స్పిన్ బోల్డక్ వద్ద పాక్ మిలిటరీ ఔట్ పోస్టులపై తాలిబాన్ బలగాలు మెరుపు దాడులు చేయగా, సైనికులు పరారైనట్లు, కొంత మందిని బంధించినట్లు సమాచారం. భారీగా ఆయుధాలు, ఆహార పదార్థాలు, పాక్ సైనికుల దుస్తులు, ఇతర సామాగ్రిని స్వాధీనం చేసుకొని నంగర్‌హార్ ప్రావిన్స్‌లో బహిరంగంగా ప్రదర్శించారు. పాక్ సైనికుల ప్యాంట్లను ప్రదర్శిస్తూ.. వ్యతిరేక నినాదాలు చేశారు. ఇందుకు సంబంధించిన దృశ్యాలు సోషల్ మీడియాలో వైరల్ అయ్యాయి.పాక్ దాడుల నేపథ్యంలో అఫ్ఘన్ ప్రజలు తాలిబాన్లకు మద్దతుగా నిలిచారు. అవసరమైతే మేము కూడా ముజాహిదీన్‌గా మారిపోయి యుద్ధానికి సిద్ధం అని కాందహార్ యువకులు కొందరు చెబుతున్నారు. ఇస్లామిక్ ఎమిరేట్(తాలిబాన్ తాత్కాలిక ప్రభుత్వం) సరైన ప్రతీకారం తీసుకుంది. ప్రజలంతా పాకిస్తాన్‌కు వ్యతిరేకంగా తాలిబాన్‌తో ఉన్నారు అని పక్తియా ప్రజలు అంటున్నారు. మా భూమిని రక్షించిన భద్రతా బలగాలకు కృతజ్ఞతలు. మేము ఎల్లప్పుడూ వారి పక్షాన ఉంటాం అని కాబూల్ వాసి ఒకరు తెలిపారు.బీబీసీ జర్నలిస్టు దౌద్ జున్బిష్ ఈ దృశ్యాలను సోషల్ మీడియాలో షేర్ చేస్తూ.. పాక్ సైన్యం విడిచిపెట్టిన అవుట్‌పోస్టుల వద్ద నుండి స్వాధీనం చేసుకున్న ప్యాంటులను తాలిబాన్ ప్రదర్శిస్తోంది అని ధృవీకరించారు. ఈ నేపథ్యంలో ఇది పాక్‌కు తీవ్ర అవమానమే అనే చర్చ నడుస్తోంది.పాకిస్తాన్, అఫ్ఘనిస్తాన్ ఒకప్పుడు మిత్రదేశాలే అయినా.. డ్యూరాండ్ లైన్ విషయంలో కయ్యానికి కాలు దువ్వుకున్నాయి. గత వారం రోజులుగా రెండు దేశాల సైన్యాలు 7 చోట్ల ఘర్షణలకు దిగాయి. తొలుత కాబూల్‌లోని తెహ్రీక్-ఇ-తాలిబన్ పాకిస్తాన్(టీటీపీ) క్యాంపులపై పాక్ సైన్యం వైమానిక దాడులకు దిగింది. దాంతో తాలిబన్లు సైతం ఎదురుదాడి ప్రారంభించారు. అయితే దాడుల విషయంలో పరస్పర ఆరోపణలు గుప్పించుకుంటున్నాయి ఈ రెండు దేశాలు. మంగళవారం అర్ధరాత్రి తర్వాత ఈ పరిస్థితి మరింత దారుణంగా తయారైంది. ఈ ఉద్రిక్తతతో ఇప్పటిదాకా 200 మంది తాలిబన్లు, 58 మంది పాక్ సైనికులు మరణించినట్లు తెలుస్తోంది.2021లో అఫ్ఘానిస్తాన్‌ను తాలిబన్లు స్వాధీనం చేసుకున్న తర్వాత పాక్‌తో ఇదే అతిపెద్ద ఘర్షణ కావడం గమనార్హం. మరోవైపు.. అఫ్ఘనిస్తాన్ మంత్రి భారత పర్యటనకు వెళ్లిన వేళ.. ఈ దాడులు మొదలయ్యాయి. కాబూల్‌లో రాయబార కార్యాలయం ప్రారంభిస్తామని భారత ప్రభుత్వం ప్రకటించడం పాకిస్తాన్‌కు కంటగింపుగా మారింది. భారత్, అఫ్ఘనిస్తాన్ మధ్య సంబంధాలు బలపడుతుండడాన్ని పాక్ జీర్ణించుకోలేకపోతున్నట్లు స్పష్టమవుతోంది. కాల్పుల విరమణ విషయంలో ఇరు దేశాలు పరస్పర విరుద్ధ ప్రకటన చేసుకుంటున్నాయి. తాలిబన్ల విజ్ఞప్తి మేరకే ఈ నిర్ణయానికి వచ్చినట్టు పాక్, పాకిస్తాన్ కోరుకోవడం వల్లనే కాల్పుల విరమణకు తాము అంగీకరించిన ట్లు తాలిబాన్ ప్రభుత్వ అధికార ప్రతినిధి జబీవుల్లా ముజాహిద్ చెబుతున్నా రు. మరోవైపు.. ఖతార్, సౌదీ అరేబియా ప్రభుత్వాలు పాక్ తరఫున ఫోన్లు చేస్తున్నట్లు తెలుస్తోంది. మధ్యవర్తులుగా వ్యవహరించాలని, వెంటనే జోక్యం చేసుకొని తాలిబాన్లను శాంతి ఒప్పందానికి ఒప్పించాలని కోరింది.

## స్ఫూర్తినిస్తున్న 'జన్ సురాజ్' అభ్యర్థి నీరజ్



పట్నా: అతను ఢిల్లీలో సెక్యూరిటీ గార్డుగా పనిచేశారు. అంచెలంచెలుగా ఎదుగుతూ రూ. 400 కోట్ల టర్నోవర్ గల కంపెనీని నడిపేస్థాయికి చేరుకున్నారు. అతనే బీహార్ పారిశ్రామికవేత్త నీరజ్ సింగ్.అతని జీవిత ప్రయాణం నిజమైన స్ఫూర్తిని కలిగిస్తుంది.38 ఏళ్ల నీరజ్ సింగ్ రాబోయే బీహార్ ఎన్నికల్లో షియోహార్ స్థానం నుంచి జన్ సురాజ్ పార్టీ అభ్యర్థిగా తన అదృష్టాన్ని పరీక్షించుకునేందుకు రంగంలోకి దిగారు.బీహార్‌లోని షియోహార్ జిల్లాలోని మధుబాపూర్ గ్రామంలో జన్మించిన నీరజ్ సింగ్ పదవ తరగతి పూర్తిచేశాక కుటుంబాన్ని ఆర్థికంగా ఆదుకునేందుకు ఉద్యోగాల వేటలో పడ్డారు. ఏటువంటి ఉద్యోగం దొరక్క, గ్రామంలో పెట్రోల్, డీజిల్ విక్రయించడం మొదలుపెట్టారు. తరువాత ఢిల్లీకి వెళ్లి, సెక్యూరిటీ గార్డు ఉద్యోగంలో చేరారు. అనంతరం పూణేకు చేరుకుని, ఒక ప్రైవేట్ సంస్థలో ఆఫీస్ అటెండెంట్‌గా చేరారు. 2010లో ధాన్యం వ్యాపారాన్ని ప్రారంభించారు. అది కలిసివచ్చింది. దీంతో ఇటుకలు, బిల్డింగ్ బ్లాక్స్, టైల్స్, ఇతర సిరామిక్ వస్తువులను విక్రయించే ఉషా ఇండస్ట్రీస్‌ను స్థాపించారు.తదనంతర కాలంలో సింగ్ తన వ్యాపారాన్ని రోడ్డు నిర్మాణ రంగానికి కూడా విస్తరించారు. ఇటీవలే సొంత పెట్రోల్ పంపును ప్రారంభించారు. నీరజ్ సింగ్ స్థాపించిన కంపెనీ ప్రస్తుతం రూ. 400 కోట్ల టర్నోవర్‌తో, రెండువేల మంది సిబ్బందికి ఉపాధిని అందిస్తోంది. ఒకప్పుడు సైకిల్ కూడా లేని నీరజ్ సింగ్ దగ్గర నేడు అర డజనుకు పైగా లగ్జరీ కార్లు ఉన్నాయి. సింగ్ తన ఇద్దరు సోదరులు, భార్య, ఇద్దరు కుమారులు, తల్లిదండ్రులతోపాటు ఉమ్మడి కుటుంబంలో ఉంటున్నారు. పేద మహిళలకు వివాహాలు చేయడం, సీనియర్ సిటిజన్ల కోసం ఉచిత ఆరోగ్య శిబిరాలు, వృద్ధుల కోసం తీర్థయాత్రలను నిర్వహించడం లాంటి సేవాకార్యక్రమాలను నీరజ్ సింగ్ నిర్వహిస్తున్నారు.

## నిమిషప్రియ కేసులో స్టే కొనసాగుతోంది

మరణశిక్ష అమలుపై సుప్రీంకు కేంద్రం వివరణ

న్యూఢిల్లీ(జనంసాక్షి):యెమెన్‌లో మరణశిక్షను ఎదుర్కొంటున్న భారత నర్సు నిమిష ప్రియకు శిక్ష అమలుపై స్టే కొనసాగుతోందని గురువారం సుప్రీంకోర్టుకు కేంద్రప్రభుత్వం వెల్లడించింది. తీవ్రమైన పరిణామాలు ఏమీ జరగలేదని తెలిపింది. ఈ భారతీయ నర్సును కాపాడేందుకు కేంద్ర ప్రభుత్వం దౌత్యమార్గాలను ఉపయోగించేలా ఆదేశించాలని కోరుతూ దాఖలైన పిటిషన్‌ను సుప్రీంకోర్టు విచారిస్తోంది. తాజాగా ఆ మరణశిక్ష గురించి ప్రశ్నించింది. ఆమెకు చట్టపరమైన సహాయం అందిస్తోన్న 'సేవ్ నిమిషప్రియ ఇంటర్నేషనల్ యాక్షన్ కౌన్సిల్' తరఫు న్యాయవాది స్పందిస్తూ.. శిక్ష అమలుపై స్టే కొనసాగుతోందని చెప్పారు. కేంద్ర ప్రభుత్వం తరఫున అటార్నీ జనరల్ వెంకటరమణి మాట్లాడుతూ.. ప్రస్తుతం ఈ కేసులోకి కొత్త మధ్యవర్తి వచ్చారు. ఇప్పటివరకు మంచి విషయం ఏంటంటే.. తీవ్రమైన పరిణామాలు చోటుచేసుకోకపోవడమేనని వెల్లడించారు. ఈ వాదనలు విన్న అత్యున్నత న్యాయస్థానం కేసును జనవరికి వాయిదా వేసింది. అయితే ఏదైనా అత్యవసర పరిస్థితులు ఉంటే.. ముందస్తు లిస్టింగ్ కోసం దరఖాస్తు చేసుకునే వెసులుబాటు కల్పించింది. నిమిష ప్రియ నర్సింగ్ కోర్సు పూర్తిచేసిన తర్వాత 2008లో యెమెన్ వెళ్లి అక్కడే ఉద్యోగంలో చేరారు. ఆ దేశ నిబంధనల ప్రకారం స్థానిక వ్యక్తి తలాల్ అబ్దో మెహదీ భాగస్వామ్యంతో అల్‌అమన్ మెడికల్ క్లినిక్ సెంటర్‌ను ప్రారంభించారు.

- రాకేష్ కిశోర్‌పై చర్యలు తీసుకోవాల్సిందేనని పట్టు
- సుప్రీం కోర్టులో ఆసక్తికర చర్చ

# సీజేఐ క్షమించినా వదలని న్యాయవ్యవస్థ



తనపై షూ విసిరిన లాయర్(సస్పెండెడ్) రాకేష్ కిశోర్‌ను భారత ప్రధాన న్యాయమూర్తి బీఆర్ గవాయ్ క్షమించినా.. న్యాయ వ్యవస్థ మాత్రం వదిలిపెట్టడం లేదు.ఆయనపై కోర్టు ధిక్కరణ కింద క్రిమినల్ చర్యలకు ఉపక్రమించాలని తాజాగా అటార్నీ జనరల్ అనుమతిచ్చారు. అయితే.. ఈ విషయాన్ని ఇక్కడితోనే ఆపేస్తే మంచిదంటూ సుప్రీం కోర్టు అభిప్రాయపడింది.అటార్నీ జనరల్ ఈ చర్యకు చట్టపరమైన అనుమతి ఇచ్చారు. ఈ విషయాన్ని ఇక్కడితోనే ఆపేస్తే దానంతట అదే ఆగిపోతుంది. లేకుంటే.. సోషల్ మీడియాలో చర్చలతో సాగుతుంటుంది. పైగా ఈ అంశాన్ని పదే పదే చర్చించడం ద్వారా న్యాయవ్యవస్థపై ప్రభావం పడే అవకాశం కూడా ఉంది అని జస్టిస్ సూర్యకాంత, జస్టిస్ జోయ్‌మాల్యా బాగ్చి అభిప్రాయపడ్డారు.అక్టోబర్ 6వ తేదీన కేసు లిస్టింగ్‌లు జరుగుతున్న టైంలో.. అడ్వొకేట్ రాకేష్ కిశోర్ తన షూను సీజేఐ జస్టిస్ బీఆర్ గవాయ్ మీదకు విసిరారు. అయితే అది ఆయన దాకా వెళ్లకుండా కింద పడిపోయింది. దీంతో అప్రమత్తమైన తోటి లాయర్లు కిశోర్‌ను అడ్డగించి.. కోర్టు సెక్యూరిటీ సిబ్బందికి అప్పగించారు. ఆ సమయంలో సనాతన ధర్మాన్ని అవమానిస్తే దేశం ఊరుకోదు అంటూ కిశోర్ నినాదాలు చేశారు. అయితే ఈ ఘటనను పట్టించుకోకుండా ప్రొసీడింగ్స్ కొనసాగించాలని జస్టిస్ గవాయ్ అక్కడున్నవాళ్లకు సూచించారు. ఇలాంటివి తనని ప్రభావితం చేయబోవని ఆ టైంలో అన్నారాయన.అటుపై చీఫ్ జస్టిస్ సూచనతో ఈ ఘటనపై పోలీస్ కేసు నమోదు కాకుండా సుప్రీం కోర్టు రిజిస్ట్రార్ చూసుకుంది. దీంతో రాకేష్‌ను మూడు గంటలపాటు ప్రశ్నించి.. షూ, ఆయన ఫైల్స్‌ను అందించి ఢిల్లీ పోలీసులు వదిలేశారు. ఈలోపు.. బార్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా ఆయన లాయర్ లైసెన్స్‌ను తాత్కాలికంగా సస్పెండ్ చేసింది. ఘటనపై వివరణ ఇవ్వాలని నోటీసులు జారీ చేసింది. అయితే తాను చేసిన పనికి పశ్చాత్తాపం చెందడం లేదంటూ కిశోర్ పలు ఇంటర్వ్యూల్లో వ్యాఖ్యానించాడు. ఆ వెంటనే సుప్రీం కోర్టు బార్ అసోసియేషన్.. ఆయన్ని సుప్రీం కోర్టు ఆవరణలోకి అడుగుపెట్టనివ్వకుండా నిషేధం విధించింది.అయితే.. ఏజీ ఆదేశాల నేపథ్యంలో రాకేష్ కిశోర్‌పై క్రిమినల్ కంటెంప్ట్ ఆఫ్ కోర్టుకు అనుమతించాలంటూ సుప్రీం కోర్టు బార్ అసోసియేషన్ అధ్యక్షుడు.. సీనియర్ లాయర్ వికాస్ సింగ్ ఇవాళ ద్విసభ్య ధర్మాసనాన్ని అభ్యర్థించారు. ఇది రాజ్యాంగ వ్యవస్థను అవమానించే ఘటన అని, తీవ్రంగా పరిగణించి ఈ అంశాన్ని రేపు విచారణ జరపాలని బెంచ్‌ను కోరారు. అయితే..ఈ అంశం సోషల్ మీడియాలో కొనసాగుతోందని వికాస్ సింగ్ అనగా.. కొంతమంది ఈ చర్యను సమర్థించారని, ఇది రాజ్యాంగబద్ధమైన సంస్థ గౌరవాన్ని దెబ్బ తీసే అంశమని సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా బెంచ్ వద్ద అభిప్రాయపడ్డారు. ఈ తరుణంలో జస్టిస్ సూర్యకాంత్ జోక్యం చేసుకుని.. ఈ ఘటనలో సీజేఐ చాలా ఉదారంగా స్పందించారు. ఇలాంటి ఘటనలు సంస్థను ప్రభావితం చేయవని చాటిచెప్పారు. అయితే.. ఆయన స్పందన గౌరవప్రదంగానే ఉన్నా సోషల్ మీడియాలో ఈ చర్యను సమర్థించడం ఆందోళన కలిగిస్తోందని తుషార్ మెహతా చెప్పారు. ఈ వ్యవహారంలో %జీకేవ్రణ ఇకీవ జఅఱలఅఱ్‌ఱశీఅ%(కోర్టు నుంచి ముందస్తుగా తీసుకునే నిషేధ ఉత్తర్వు) జారీ చేయాలని లాయర్ వికాస్ సింగ్ కోర్టును కోరారు. ఆ సమయంలో జస్టిస్ బాగ్చీ కలుగజేసుకుని.. "ఇది కొత్త వివాదాలకు దారితీయవచ్చు. కోర్టులో మన ప్రవర్తనే ప్రజల్లో నమ్మకాన్ని కలిగిస్తుంది. ఓ బాధ్యతలేని పౌరుడి చర్యగా పరిగణించి సీజేఐ దీనిని పట్టించుకోలేదు. అలాంటి అంశాన్ని మళ్లీ తవ్వడం అవసరమా? అని అన్నారు. పైగా ఎన్నో ముఖ్యమైన అంశాలు పెండింగ్‌లో ఉన్నాయని, దీనిని పైకి తేవడం సమయాన్ని వృథా చేయడమేనన్న అభిప్రాయమూ ఆయన వ్యక్తం చేశారు. అయితే ఈ విషయాన్ని మరింత పెద్దది చేయడం తన ఉద్దేశం కాదని, ఇక్కడితో నిలువరించమే తన అభిమతమని వికాస్ సింగ్ స్పష్టత ఇచ్చారు. ఆపై జస్టిస్ కాంత్ మాట్లాడుతూ.. నా సహ న్యాయమూర్తి చెబుతోంది మీరు కూడా అర్థం చేసుకున్నారు. మీరు ఈ అంశాన్ని మళ్లీ ప్రస్తావించిన వెంటనే, మీడియాలో కథనాలు కొనసాగుతాయి అని అన్నారు. ఆ టైంలో.. 'దురదృష్టవశాత్తు, మనం డబ్బు సంపాదించే వ్యాపారాలుగా మారిపోయాం%%'" అని జస్టిస్ బాగ్చీ వ్యాఖ్యానించారు. ఈ వ్యాఖ్యతో సొలిసిటర్ జనరల్ విభేదించారు. "సోషల్ మీడియా ప్లాట్‌ఫారాలు అల్గోరిథమ్స్ ఆధారంగా పనిచేస్తాయి. ప్రజలు వాటికి బానిసలుగా మారిపోయారు. ఆ బానిసత్వాన్ని ఈ ప్లాట్‌ఫారాలు డబ్బుగా మార్చుకుంటున్నాయి. మనం సోషల్ మీడియాను ఉపయోగిస్తున్నామనుకుంటాం, కానీ నిజానికి మనమే ఆ ప్లాట్‌ఫారాల ఉత్పత్తులం" అని మెహతా అన్నారు. ఆ సమయంలో జస్టిస్ కాంత్ కలుగజేసుకుని మనం ఉత్పత్తులమే కాదు.. వినియోగదారులం కూడా అని అన్నారు.సోషల్ మీడియా మనుషుల్ని తీవ్రంగా ప్రభావితం చేస్తోంది. దాని అల్గోరిథమ్స్ ద్వారానే.. ద్వేషం, కోపం, కామం లాంటి భావనలకు గురవుతున్నాం. సోషల్ మీడియా మన ఈ వ్యసనాన్ని మానిటైజ్ చేస్తోంది. ఈ అంశాన్ని ప్రస్తావించడం ద్వారా అది మళ్లీ మానిటైజ్ అవుతుంది. కాబట్టి దీనిని సహజంగా ముగియనివ్వడమే మంచిది అని జస్టిస్ కాంత్ అన్నారు.పరిస్థితిని తాను అర్థం చేసుకోగలనని.. అలాగే న్యాయస్థానం కూడా బార్ (న్యాయవాదుల సంఘం) ఆవేదనను అర్థం చేసుకోవాలని లాయర్ వికాస్ సింగ్ కోరారు. "బార్ (న్యాయవాదుల సంఘం) ఎప్పుడూ న్యాయ వ్యవస్థకు అండగా నిలిచింది. మీరు న్యాయాన్ని కోరే ప్రజలతో కోర్టును కలిపే వంతెన. మీ పరిస్థితిని, మీ భావోద్వేగాలను మేము అర్థం చేసుకుంటున్నాం" అని జస్టిస్ కాంత్ అన్నారు.ఈ అంశాన్ని శుక్రవారం విచారణకు తీసుకురావాలని వికాస్ సింగ్ మరోసారి కోరారు. అయితే.. దీపావళి తర్వాతే విచారించే అవకాశం ఉందని బెంచ్ స్పష్టం చేసింది. ఒక వారం తర్వాత ఇది ఇంకా "సేలబుల్ అంశంగా ఉంటుందేమో చూద్దాం అని జస్టిస్ కాంత్ సున్నితంగా వ్యాఖ్యానించారు. ఈలోపు.. అల్గోరిథమ్ కోసం కొత్త అంశం వస్తుందేమో చూదాం అని జస్టిస్ బాగ్చీ అన్నారు.

## పురుగుల మందు త్రాగి వ్యక్తి ఆత్మహత్య



**రుద్రంగి, అక్టోబర్ 16 (జనం సాక్షి) :** రుద్రంగి మండల కేంద్రానికి చెందిన పిట్టల నర్సయ్య(62) అనే వ్యక్తి బుధవారం పురుగుల మందు త్రాగి ఆత్మహత్య చేసుకున్నా రు. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం పిట్టల నర్సయ్య అప్పుల బాధతో మనస్థాపానికి గురై బుధవారం మధ్యాహ్నం పొలం వద్ద పురు గుల మందు త్రాగి ఆత్మహత్యాయత్నం చేసు కోగా గమనించిన కుటుంబ సభ్యులు కరీంనగర్ లోని ప్రైవేట్ ఆసుపత్రికి తరలించి చికిత్స అంది ంచగా గురువారం ఉదయం చికిత్స పొందుతూ మృతి చెందాడని తెలిపారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ శ్రీనివాస్ తెలిపారు.

## యుద్ధ ప్రాతిపదికన పెండింగ్ దరఖాస్తులను పరిష్కరించాలి

**జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్**




**కామారెడ్డి జిల్లా ప్రతినిధి అక్టోబర్ 16 (జనంసాక్షి) :** గురువారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో జిల్లా కలెక్టర్ రెవెన్యూ అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించి పెండింగ్ లో ఉన్న భూ భారతీ రెవెన్యూ సదస్సుల దరఖాస్తులు, సీఎం ప్రజావాణి, కలెక్టర్ ప్రజావాణి పెండింగ్ దరఖాస్తులు, వివిధ సర్టిఫికెట్ జారీ, ఇసుక, మట్టి అక్రమ రవాణా, ప్రభుత్వ భూముల సర్వే, రేషన్ కార్డుల పంపిణీ తదితర 16 అంశాలు రివ్యూ చేసి వాటి పరిష్కారానికి ఆదేశాలను జారీ చేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ రెవెన్యూ అంశాలు అత్యధిక ప్రాధాన్యత కలిగి ఉంటాయని జిల్లాలో పెండింగ్లో ఉన్న రెవెన్యూ సమస్యలన్నింటినీ యుద్ధ ప్రాతిపదికన పరిష్కరించాలని అన్నారు. భూభారతి చట్టంననుసరించి నిర్వహించిన రెవెన్యూ సంస్థల ద్వారా స్వీకరించి పెండింగ్లో ఉన్న దరఖాస్తులను వేగంగా పరిష్కరించాలని, ప్రభుత్వ ఆదేశాలు రాగానే సాదా బై నామాలను పరిష్కరించేందుకు సిద్ధంగా ఉండాలని అన్నారు. కొత్తగా గ్రామపాలన అధికారులు కూడా వచ్చారు కాబట్టి మానవ వనరులకు ఇబ్బంది లేదని అన్నారు. అదేవిధంగా శిక్షణ లైసెన్స్ సర్వేయర్లు కూడా అందుబాటులో ఉన్నారు వారి సేవలను ఉపయోగించుకోవాలని అన్నారు. కులము, ఆదాయం ఇతర సర్టిఫికెట్లను నిర్ణీత సమయంలోగా ప్రజలకు అందించాలని అన్నారు. పెండింగ్లో ఉన్న కోర్టు కేసుల పరిష్కారానికి తక్షణమే చర్యలు తీసుకోవాలని అన్నారు. వివిధ మండలాల్లో పెండింగ్లో ఉన్న రెవెన్యూ ఫారెస్ట్ భూముల వివాదాలను ఫారెస్ట్ అధికారులతో కలిసి పరిష్కరించాలని అన్నారు. కలెక్టరేట్లో నిర్వహించిన ప్రజావాణి పెండింగ్ దరఖాస్తులలో అత్యధిక దరఖాస్తులు రెవెన్యూ శాఖలోనే ఉన్నాయని వాటితోపాటు ముఖ్యమంత్రి ప్రజావాణి కార్య కార్యక్రమం ద్వారా స్వీకరించిన దరఖాస్తుల పరిష్కారానికి ప్రాధాన్యతనివ్వాలని అన్నారు. ప్రభుత్వ భూముల సర్వే, అసైన్డ్ ల్యాండ్ సర్వే చేపట్టాలని, రేషన్ కార్డుల పంపిణీకి చర్యలు తీసుకోవాలని, జిల్లాలో ఇసుక, మొరం అక్రమ రవాణా జరగకుండా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో బాన్సువాడ సబ్ కలెక్టర్ కిరణ్మయి, జిల్లా అదనపు కలెక్టర్ విక్టర్, డిఆర్ఓ మధు మోహన్, ఎల్లారెడ్డి ఆర్డీవో పార్థసింహారెడ్డి, ఎడి సర్వే ల్యాండ్, అన్ని మండలాలతో తాసిల్దార్లు, కలెక్టరేట్ సూపరెంటిండెంట్లు, సర్వేయర్లు తదితరులు పాల్గొన్నారు.

## మున్సిపల్ అధికారులతో ఎమ్మెల్యే సమీక్ష



**ఆర్మూర్,అక్టోబర్ 16(జనంసాక్షి):** ఆర్మూర్ మున్సిపల్ కార్యాలయంలో ఎమ్మెల్యే పైడి రాకేష్ రెడ్డి అధికారులతో గురువారం సమీక్ష సమావేశం నిర్వహించారు. పట్టణ అభివృద్ధికి రూ. 47 కోట్ల నిధులకు సంబంధించిన రోడ్ల నిర్మాణం పనులను వేగవంతం చేయాలని చెప్పారు. వార్డుల వారీగా వార్డు అధికారులతో డ్రైనేజీ,స్ట్రీట్ లైట్, పార్కులు, పిచ్చికుక్కల బెడద సమస్యలను గురించి అడిగి తెలుసుకున్నారు. 100 నుండి 150 గజాల స్థలంలో ఇంటి నిర్మాణం చేపట్టే వారికి ఎటువంటి ఇబ్బందులకు గురి చేయొద్దని మున్సిపల్ కమిషనర్ కు ఆదేశించారు. ఆర్మూర్ ఏసిపి,అగ్నిమాపక, మున్సిపల్ అధికారులతో మాట్లాడి మినీ స్టేడియం వద్ద రూ. 2500 లైసెన్సులకు చెల్లించి టపాకాయల స్టాల్స్ పెట్టుకోవచ్చన్నారు. దళారులను,మధ్యవర్తుల ప్రమేయం లేకుండా తక్కువ ధరలకు స్టాల్ నిర్వహణ చేసుకోవచ్చన్నారు. ఆర్మూర్ నియోజకవర్గంలో ఎలాంటి సమస్య ఎదురైనా తమ దృష్టికి తీసుకురావాలని ఈ సందర్భంగా ప్రజలను కోరారు.

## వార్డు అధికారులు మరింత అంకితభావంతో పని చేయాలి

- నగరపలక సంస్థ కమిషనర్ అరుణశ్రీ



**గోదావరిఖని, జనంసాక్షి :** ప్రజలకు మున్సిపల్ సేవలు సమర్థంగా అందడానికి వార్డు అధికారులు మరింత అంకిత భావంతో పని చేయాలని అదనపు కలెక్టర్ ( స్థానిక సంస్థలు ), రామగుండం నగర పాలక సంస్థ కమిషనర్ జె. అరుణ శ్రీ అన్నారు. రామగుండం నగర పాలక సంస్థ కార్యాలయంలో గురువారం వార్డు అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సంధర్భంగా ఆమె మాట్లాడుతూ ఆస్తి పన్ను , ట్రేడ్ లైసెన్స్ ఫీజులు లక్ష్యం ప్రకారం వసూలు చేయాలని అన్నారు. భారీ బకాయలు ఉన్న వారికి రెవెన్యూ రికవరీ చట్టం క్రింద నోటీసులు జారీ చేయడానికి చర్యలు తీసుకోవాలని అన్నారు. డివిజన్లో పారిశుధ్య నిర్వహణ పటిష్టంగా జరిగేలా చూడాలని అన్నారు. మున్సిపల్ సేవలకు సంబందించి గమనించిన సమస్యలు, ప్రజలు దృష్టికి తెచ్చిన ఇబ్బందులను త్వరితగతిన సంబందిత అధికారుల దృష్టికి తీసుకెళ్ళి పరిష్కారమయ్యేలా చూడాలని అన్నారు. నిషేధిత ప్లాస్టిక్ వినియోగిస్తున్నట్లు గుర్తిస్తే మెటీరియల్ స్వాధీనం చేసుకొని జరిమానా విధించాలని అన్నారు. బహిరంగ ప్రదేశాలలో చెత్త వేసిన వారి నుండి అపరాధ రుసుం వసూలు చేయాలని అన్నారు. ఈ సమావేశంలో నగర పాలక సంస్థ అదనపు కమిషనర్ మారుతి ప్రసాద్, అసిస్టెంట్ మున్సిపల్ కమిషనర్ వెంకటేశ్వర్లు, ఆర్ ఓ ఆంజనేయులు, సూపరింటెండెంట్ పబ్బాల శ్రీనివాస్ ఆర్ఐలు శంకర్ రావు, ఖాజా, వార్డు అధికారులు, వార్డు అసిస్టెంట్లు పాల్గొన్నారు.



## సౌభాగ్య డిపాజిట్ పథకంతో సౌభాగ్యం మీ ఇంటికి!

- సహకార బ్యాంకులో మహిళలకు ప్రత్యేక డిపాజిట్ పథకం
- 333 రోజులకు 8.5శాతం అత్యధిక వడ్డీ రేటు

**మంథని, (జనంసాక్షి) :** ది కరీంనగర్ జిల్లా సహకార కేంద్ర బ్యాంకు ద్వారా దీపావళి కానుకగా మహిళలకు అందిస్తున్న సౌభాగ్యలక్ష్మీ ప్రత్యేక డిపాజిట్ పథకంతో మహిళల ఇంటికి సౌభాగ్యం చేకూరుతుందని మంథని బ్రాంచ్ మేనేజర్ ఉదయశ్రీ అన్నారు. డిపాజిట్ సేకరణలో భాగంగా గురువారం మంథని పట్టణంలోని పలు వీధుల్లో సహకార బ్యాంకు మేనేజర్ ఉదయశ్రీ, బ్యాంకు, సహకార సంఘం సిబ్బంది ఇంటింటికి తిరుగుతూ డిపాజిట్ల పై ప్రచారం చేస్తూ డిపాజిట్ల సేకరణ చేశారు. ఈ సందర్భంగా సహకార బ్యాంకు మేనేజర్ ఉదయశ్రీ మాట్లాడుతూ సహకార బ్యాంకులో సాధారణ పౌరులకు 8శాతం వడ్డీ రేటు, సీనియర్ సిటిజెన్లు, మహిళలకు 8.5శాతం వడ్డీ రేటు కల్పిస్తున్నామని తెలిపారు. పరిమిత కాలం ఉండే ఈ సదా అవకాశాన్ని బ్యాంకు ఖాతాదారులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో బ్యాంకు డీఈ సందేబోయిన శ్రీనివాస్, అసిస్టెంట్ మేనేజర్లు పోతరాజు సతీష్ కుమార్, బూడిద వసంత, సహకార సంఘం కార్యదర్శి మామిడాల అశోక్ కుమార్, బ్యాంకు సిబ్బంది అమరేందర్, మహేందర్, మహేశ్వరి, సాయి, సంఘ సిబ్బంది దుబ్బాక సదాశివ్, నారమల్ల విద్యాసాగర్, బొద్దుల సమ్మయ్య, కొత్త స్వప్న, సంగినవేని నరేష్, పైడాకుల రాకేష్, గుడెల్లి మధుమోహన్, రాగం అశోక్, మోత్కూరి సాగర్,తదితరులు పాల్గొన్నారు.

## బీసీల బందుకు పూర్తి మద్దతు ప్రకటిస్తున్నాం

**బహుజనసేన రాష్ట్ర ఉపాధ్యక్షులు తగరంశంకర్ లాల్**



**మంథని, (జనంసాక్షి) :** బీసీ సామాజిక వర్గాలకు 42 శాతం రిజర్వేషన్లు ఇవ్వాలని డిమాండ్ చేస్తూ ఈనెల 18వ తేదీన బీసీ సంఘాలు సంయుక్తంగా తలపెట్టిన తెలంగాణ రాష్ట్ర బందు పిలుపుకు పూర్తి మద్దతును తెలుపుతున్నామని బహుజన రాష్ట్ర ఉపాధ్యక్షులు తగరం శంకర్ లాల్ ఒక ప్రకటనలో తెలిపారు. బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు వాస్తవానికి కూడా తక్కువే అని అన్నారు. ఎవరైతే ఎంత శాతం ఉంటారో అంత శాతం అన్ని రంగాలలో సమానమైన వాటా శాతాన్ని ఇవ్వడం న్యాయపరమైన విషయం..దేశంలో, రాష్ట్రంలో బీసీ సామాజిక వర్గాలు సగానికంటే ఎక్కువగా ఉన్న మాట సత్యం మరి సగానికంటే ఎక్కువగా ఉన్నటువంటి వాళ్లకు అన్ని రంగాలలో సగం వాటాను కల్పించడం న్యాయమైనది, ధర్మమైన విషయం అని అన్నారు. మహాత్మా జ్యోతిరావు పూలే అణగారిన వర్గాల కోసం త్యాగం చేయడం జరిగింది. పూలే ని గురువుగా స్వీకరించినటువంటి డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ఈ దేశంలో అన్ని రంగాలలో వెనక్కి నెట్టివేయబడ్డ వారందరికీ రిజర్వేషన్లు అవసరమని సూచించడం జరిగిందన్నారు. అందరూ బతకాలి అందులో మనం ఉండాలి. సామాజిక న్యాయం జరగాలంటే బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు దక్కాల్సిందే అని నొక్కి చెప్పారు. ఈనెల 18 వ తారీఖున తలపెట్టినటువంటి తెలంగాణ రాష్ట్ర బంద్కు తమ పూర్తి మద్దతును తెలియజేస్తూ ప్రత్యక్షంగా బందులో పాల్గొంటామని తెలిపారు.

## నూతన ఒరవడికి శ్రీకారం చుట్టిన కాంగ్రెస్ పార్టీ

- ప్రజాపాలనలో జిల్లా అధ్యక్ష పదవిపై కార్యకర్తల అభిప్రాయ సేకరణ
- కార్యక్రమానికి తరలివచ్చిన హుజూరాబాద్ నియోజకవర్గ, సైదాపూర్, చిగురుమామిడి మండలాల కాంగ్రెస్ నాయకులు



**హుజురాబాద్, అక్టోబర్ 16 (జనం సాక్షి) :** సంఘటన్ శ్రీజన్ అభియాన్ కార్యక్రమం ద్వారా దేశంలో కాంగ్రెస్ పార్టీ నూతన ఒరవడిని తీసుకొచ్చిందని కర్ణాటక రాష్ట్ర హంగల్ శాసన సభ్యుడు మానే శ్రీనివాస్ అన్నారు. గురువారం హుజూరాబాద్ పట్టణంలో ఓ ప్రైవేట్ ఫంక్షన్ హాల్ లో స్థానిక కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇంచార్జీ వొడితల ప్రణవ్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో మానకొండూర్ శాసనసభ్యుడు కవ్వంపల్లి సత్యనారాయణ, టీపీసీసీ ఉపాధ్యక్షుడు చిట్ల సత్యనారాయణ, టీపీసీసి పరిశీలకులు మ్యాడం బాలకృష్ణ మీడియా సమావేశాన్ని నిర్వహించారు. అనంతరం వారు మాట్లాడుతూ గతాని కంటే బిన్నంగా ఈ సారి జిల్లా అధ్యక్షుల ఎంపికను వార్డు, గ్రామం, మండల, నియోజక వర్గ స్థాయి నాయకుల అభిప్రాయాలు తీసుకొని జిల్లా అధ్యక్షున్నీ ఎన్నుకోవడం జరుగుతుందని, దేశంలోనీ ఐదు రాష్ట్రాల్లో పూర్తి చేసుకొని దక్షిణ భారతదేశంలోనీ తెలంగాణకు ఈ కార్యక్రమాన్ని తీసుకువచ్చామని,జిల్లాల వారిగా పరిశీలకులు నాయకుల అభిప్రాయాలు తీసుకుంటున్నమని,ప్రజల మధ్య ఉండి ప్రజలతో మమేకమయ్యే నాయకులకు అవకాశం దక్కుతుందని, రాబోయే రోజుల్లో జిల్లా అధ్యక్షులకే కాదు మండల నాయకులను కూడా ఇదే విధంగా ఎన్నుకుంటామని తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ వైద్యశాలలో అధునాతన వైద్య సేవలు





- పెద్దపల్లి ప్రభుత్వ ఆసుపత్రిలో 24 గంటలు వైద్యం
- 50 పడకల నుండి 100 పడకలకు పెంపు
- పెద్దపల్లి మాతా శిశు కేంద్రం ప్రక్రియ ఆడబిడ్డలకు పుట్టినిల్లుగా మారింది
- పెద్దపల్లి ఎమ్మెల్యే చింతకుంట విజయరమణ రావు

**పెద్దపల్లి,అక్టోబర్ 16 (జనంసాక్షి) :** పెద్దపల్లి జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ఆసుపత్రిని సందర్శించిన అనంతరం ఆసుపత్రిలో వైద్యశాఖ అధికారులతో కలిసి మీడియా సమావేశం నిర్వహించిన పెద్దపల్లి శాసనసభ్యులు చింతకుంట విజయరమణ రావు ముందుగా పెద్దపల్లి ప్రభుత్వ ఆసుపత్రిలో ప్రతిరోజు ఒక్కోరకం రంగులతో వాడే బెడ్ షీట్ల వినియోగాన్ని ప్రారంభించిన ఎమ్మెల్యే విజయరమణ రావు ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ రాష్ట్రంలోనే తొలి సారి ప్రతి రోజు ఒక్కో రకం రంగులతో కొన్ని బెడ్ షీట్లను వినియోగించడం పెద్దపల్లి జిల్లా ప్రభుత్వ ఆసుపత్రిలో ప్రారంభిస్తున్నట్లు తెలిపారు. ఈ విధానం వల్ల ప్రతిరోజు శుభ్రమైన బెడ్ షీట్లను గుర్తించవచ్చన్నారు. అదేవిధంగా జిల్లా కేంద్రంలో 100 పడకల ఆసుపత్రి నూతన భవన నిర్మాణం శరవేగంగా సాగుతోందని చెప్పారు. గత నెలలో పెద్దపల్లి జిల్లా ప్రభుత్వ ఆసుపత్రి రాష్ట్రంలోనే సేవల విషయంలో మొదటి స్థానంలో ఉందని అన్నారు. సెప్టెంబర్ మాసంలో 250 మంది గర్భిణి స్త్రీలకు ప్రసూతి సేవలు అందించడం జరిగిందని అలాగే గతంలో కంటే ఆసుపత్రిలో 26,730 ఓ.పి సేవలు అందించారని, 123 మంది గర్భిణి స్త్రీలకు టిఫా అనే స్కానింగ్ ప్రభుత్వ ఆసుపత్రిలో చేశారని, గత మాసంలో 316 మందికి ఆరోగ్య శ్రీ సేవలు అందించి వారందరికి ప్రైవేటుకు ధీటుగా వైద్యసేవలు అందించామని అన్నారు. జిల్లా ఆసుపత్రిలో గ్రామీణ ప్రాంతాల ప్రజలు పెద్ద మొత్తంలో ప్రభుత్వ వైద్య సేవలు వినియోగించుకోవాలని కోరారు. జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష సహకారంతో ప్రైవేట్ ఆసుపత్రులకు ధీటుగా జిల్లా ఆసుపత్రి మాత శిశు ఆసుపత్రి, పెద్దపల్లిలో అందించే సేవలను ఉపయోగించుకోవడం ద్వారా పెద్దపల్లి ప్రాంతంలోని సాధారణ ప్రజలకు సమిష్టిగా నెలకు సుమారు 7,04,10,000/- కోట్ల రూపాయలు ఆదా చేయడం జరుగుతుందని తెలిపారు. అలాగే గత సంవత్సరంతో పోలిస్తే డెలివరీ కేసులు గణనీయమైన పెరుగుదల ఉంది. ప్రైవేట్ ఆసుపత్రులకు దీటుగా పెద్దపల్లి ప్రభుత్వ ఆసుపత్రిలో కంటికి సంబంధించిన వైద్య సేవలు చేయడం జరుగుతుంది. నవజాతి శిశు కేంద్రం ద్వారా పుట్టిన పిల్లలకు మెరుగైన వైద్య సేవలు అందించడం జరుగుతుంది. భవిష్యత్తులో ముఖ్య మంత్రి రేవంత్ రెడ్డి సహకారంతో పెద్దపల్లి ప్రభుత్వ ఆసుపత్రిలో సూపర్ స్పెషాలిటీ వైద్య సేవలు ప్రారంభిస్తాము, అలాగే 20 కోట్ల ఎక్విప్మెంట్ ఆర్డర్ పెడుతున్నాం. ఇందులో వెంటిలేటర్లు, (ఎంఆర్ఐ)( సిటిలాంటివి అందు బాటులో తెస్తాము. మరికొంత మంది రెగ్యులర్ డాక్టర్లను తెప్పిస్తున్నాం, మోకాళ్ళ మార్పిడి సర్జరీ చేయిస్తాము. ఏ ఒక్క పేషెంట్ కూడా అసంతృప్తితో ఇంటికి పోకూడదు. ఎలాంటి సమస్య ఉన్న సూపరింటెండెంట్ శ్రీధర్ అందుబాటులో ఉంటారు, ఆయనకు చెప్పండి మీ ప్రాబ్లం సాల్వ్ చేస్తారు. జవాబుదారీ తనంతో మేము మా సిబ్బంది పని చేస్తారు, ఇప్పటికే పక్క జిల్లా ప్రజలు మన హాస్పిటల్ లో చికిత్స పొందుతున్నారు. అన్నారు. అనంతరం కొత్తగా నిర్మితం అవుతున్న 100 పడకల ఆసుపత్రి నిర్మాణ పనులను ఎమ్మెల్యే పరిశీలించారు. ఈ కార్యక్రమంలో జిల్లా వైద్య శాఖ అధికారులు,డాక్టర్స్ మరియు మార్కెట్ చైర్మన్లు మరియు కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

### పశు వైద్య శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలి

పాడి రైతులు, పశువుల కాపర్లు పెద్దపల్లి మండలం నిట్టూరు గ్రామంలో ఏర్పాటు చేసిన పశు వైద్య శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని పెద్దపల్లి ఎమ్మెల్యే చింతకుంట విజయ రమణా రావు అన్నారు.గురువారం పెద్దపల్లి ఎమ్మెల్యే చింతకుంట విజయ రమణారావు పెద్దపల్లి మండలం నిట్టూరు గ్రామంలో పశుసంవర్ధక శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన మెగా పశు వైద్య శిబిరాన్ని ప్రారంభించారు. గ్రామ మండల పశు సంక్షేమ విశేషాల గురించి అధికారులను ఎమ్మెల్యే అడిగి తెలుసుకున్నారు.ఈ సందర్భం గా పెద్దపల్లి ఎమ్మెల్యే చింతకుంట విజయ రమణారావు, ప్రభుత్వం తరపున పశు సంక్షేమం, పాడి రైతులకు అమలు చేస్తున్న కృత్రిమ గర్భధారణ సేవలు, గొర్రెల కాపరులకు అందుతున్న టీకాలు, నట్టల నివారణ చర్యల గురించి వివరించారు. మెగా క్యాంప్ నందు పశువులకు గాలి కుంటు వ్యాధి టీకాలు వేయడం, చూడి పరీక్షలు గర్భాశయ సమస్యలు, నివారణ, నట్టల నివారణ చేపట్టడం జరుగుతుందని అవసరమైన పశువుల కాపరులు, పాడి రైతులు వినియోగించుకోవాలని ఎమ్మెల్యే తెలిపారు.నేడు నిట్టూరు గ్రామంలో 29 దూడలకు నట్టల మందు, 38 పాడి పశువులకు చూడి పరీక్షలు గర్భాశయ సమస్యలు, అన్ని పశువులకు గాలి కుంటు టీకాలు వేయడం జరిగిందని అన్నారు.ఈ కార్యక్రమంలో జిల్లా పశుసంవర్ధక శాఖ అధికారి డాక్టర్ కె విజయ భాస్కర్, అసిస్టెంట్ సంచాలకులు డాక్టర్ శ్రీదేవి, డాక్టర్ వేణుగోపాల రావు, తెలంగాణ పశువు గణన అభివృద్ధి సంస్థ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ డాక్టర్ సత్య ప్రసాద్ రెడ్డి, సంబంధిత అధికారులు, పాల్గొన్నారు.



## మహిళలు ఆరోగ్యంపై మరింత శ్రద్ధ వహించాలి

**పెద్దపెల్లి కలెక్టర్ కోయా శ్రీహర్ష**

**ముత్తారం అక్టోబర్ 16(జనంసాక్షి )**మహిళలు తమ ఆరోగ్యం పై మరింత శ్రద్ధ వహించాలని క్రమం తప్పకుండా వైద్య పరీక్షలు చేయించు కుంటూ అనారోగ్యాల బారిన పడకుండా చూసుకోవాలని పెద్దపెల్లి జిల్లా కలెక్టర్ కోయా శ్రీహర్ష అన్నారు. మహిళా ఆరోగ్య వికాస్ తరంగిణి ఆధ్వర్యంలో గురువారం ముత్తారం మండల కేంద్రంలోని రైతు వేదిక కార్యాలయంలో ఏర్పాటు చేసిన ఉచిత మహిళా ఆరోగ్య శిబిరాన్ని అయన సందర్శించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఇటీవలి కాలంలో మహిళలు క్యాన్సర్ వ్యాధి బారిన పడుతున్నారని ఆర్థిక పరిస్థితుల దృష్ట్యా తగు సమయంలో గుర్తించలేక పోతుండడంతో ప్రమాదం బారిన పడుతున్నారని అని అన్నారు. గ్రామీణ ప్రాంత మహిళలు ప్రజలు ఎప్పటికప్పుడు క్యాన్సర్ నిర్ధారణ వైద్య పరీక్షలు చేయించుకొని వాటి బారిన పడకుండా ఉండాలని తెలిపారు. ఈ వ్యాధిపై గ్రామీణ ప్రాంత మహిళలలో మరింత అవగాహన కల్పించేలా స్వచ్ఛంద సంస్థల కృషి అభినందనీయం అన్నారు. ఈ కార్యక్రమంలో డిఎంహెచ్ఓ వానిశ్రీతో పాటు కరీంనగర్, పెద్దపల్లి, గోదావరిఖని వికాస్ తరంగిణి సభ్యులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు

## మెటా ఫండ్ పేరుతో ఆన్లైన్ కాయిన్ మోసం

- సుమారు రూ. 25 నుండి 30 కోట్ల వరకు పెట్టుబడులు పెట్టి మోసపోయిన బాధితులు.. కింగ్‌పిన్ అరెస్ట్




**కరీంనగర్ జిల్లా బ్యూరో, అక్టోబర్ 16 (జనంసాక్షి):** ఆన్లైన్లో 'మెటా ఫండ్' అనే నకిలీ కాయిన్ యాప్‌ను సృష్టించి, అధిక లాభాల ఆశ చూపి ప్రజల నుండి సుమారు రూ. 25 కోట్ల నుండి 30 కోట్ల వరకు పెట్టుబడులు వసూలు చేసి మోసం చేసిన కేసులో ప్రధాన నిందితుడు వరాల లోకేశ్వర్‌రావు (32) మల్కాజ్‌గిరి, హైదరాబాద్ నివాసి)ను కరీంనగర్ పోలీసులు బుదవారం రాత్రి అరెస్ట్ చేశారు. సాఫ్ట్‌వేర్ అప్లికేషన్ల తయారీలో నైపుణ్యం కలిగిన లోకేశ్వర్‌రావు, కరీంనగర్‌కు చెందిన తులసి ప్రకాష్ (56), బూర శ్రీధర్ (54), దాసరి రాజు (39), దాసరి రమేష్ (50), కట్ల సతీష్ (49)లతో కలిసి ఈ మోసానికి ప్రణాళిక రూపొందించారు. లోకేశ్వర్‌రావు నకిలీ 'మెటా ఫండ్' ఆన్‌లైన్ యాప్‌ను, కాయిన్లను సృష్టించారు. రూ. 90,000 పెట్టుబడికి 1,000 కాయిన్లు ఇస్తామని, నెల రోజుల్లో మూడు రెట్లు లాభంతో అమ్ముకోవచ్చని ప్రజలను నమ్మించారు. బాధితులను నమ్మించడానికి రిసార్ట్‌లు, గోవా, విదేశీ ట్రిప్‌లకు తీసుకెళ్లి ప్రలోభాలకు గురిచేశారు. బాధితుల నుండి డబ్బును నగదు రూపంలో తీసుకుని, కేవలం ఆన్‌లైన్‌లో నకిలీ ఐడీలు, కాయిన్లను కేటాయించారు. డబ్బు విత్‌డ్రా చేయలేని విధంగా యాప్‌ను రూపొందించారు. చివరికి యాప్‌ను ఆన్‌లైన్ నుండి తొలగించి ప్రజలను మోసం చేశారు.

కరీంనగర్ రూరల్, కరీంనగర్ 2వ టౌన్ పోలీస్ స్టేషన్లలో కేసులు నమోదయ్యాయి. ప్రాథమిక దర్యాప్తులో తులసి ప్రకాష్, బూర శ్రీధర్, దాసరి రాజు, దాసరి రమేష్, కట్ల సతీష్‌లను గతంలోనే అరెస్ట్ చేసి రిమాండ్‌కు పంపారు. దర్యాప్తులో భాగంగా ప్రధాన నిందితుడు వరాల లోకేశ్వర్‌రావును బుదవారం రాత్రి ఎల్.యం.డి. అలుగునూరు వద్ద అరెస్ట్ చేశారు. నిందితుల వద్ద నుండి బాధితుల డబ్బుతో కొనుగోలు చేసిన ఆస్తుల పత్రాలు, 30 తులాల బంగారం, మొబైల్ ఫోన్లు, ట్యాబ్‌లు, అలాగే ప్రధాన నిందితుడి వద్ద నుండి ఒక బి.ఎం.డబ్ల్యూ. కారు స్వాధీనం చేసుకున్నారు. ఈ కేసును ఛాలెంజ్‌గా తీసుకుని ఛేదించిన పోలీస్ సిబ్బందిని కరీంనగర్ పోలీస్ కమిషనర్ అభినందించారు.

ఆన్‌లైన్ ద్వారా అధిక లాభాలు వస్తాయని చెప్పి పెట్టుబడులు పెట్టమని ఎవరైనా చెబితే జాగ్రత్త వహించాలని, తప్పుదోవ పట్టించే యాప్‌లు లేదా అనుమానాస్పద పెట్టుబడి పథకాలలో డబ్బు పెట్టి మోసపోవద్దని పోలీస్ కమిషనర్, కరీంనగర్ జిల్లా పోలీస్ తెలియజేశారు. మోసాలు జరుగుతున్నట్లు తెలిస్తే వెంటనే 100 / 1930 డయల్ చేసి (సైబర్ హెల్ప్‌లైన్) కు సమాచారమివ్వాలని తెలిపారు.

## రేపటి తెలంగాణ రాష్ట్ర బంద్ విజయవంతం చేయాలి

- పెద్దపల్లి జిల్లా జాతీయ బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షులు నల్లవెల్లి శంకర్




**మంథని, (జనంసాక్షి) :** స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు దక్కాల్సిన 42 శాతం రిజర్వేషన్ దక్కకుండా అడ్డుకుంటున్న కుట్రలను నిరసిస్తూ ఈనెల 18 శనివారం బీసీ సంఘాల జేఏసీ రాష్ట్ర బంద్ కార్యక్రమానికి పిలుపునివ్వడం జరిగిందని ఈ బందు కార్యక్రమాన్ని విజయవంతం చేయడంలో బహుజనులు అందరూ భాగస్వాములు కావాలని జాతీయ బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షులు నల్లవెల్లి శంకర్ కోరారు. గురువారం పెద్దపల్లి జిల్లాకమాన్ పూర్ మండల కేంద్రంలోని ప్రెస్ క్లబ్ లో గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. బీసీలకు 42 శాతం రిజర్వేషన్ కల్పిస్తూ రాష్ట్ర ప్రభుత్వం జారీ చేసిన జీవో నెంబర్ 9 ను వ్యతిరేకిస్తూ కొందరు హైకోర్టుకు వెళ్లడంతో స్టే ఇవ్వడం జరిగిందన్నారు. అగ్రవర్ణాల్లోని పేదలకు 10 శాతం రిజర్వేషన్ సౌకర్యం కల్పిస్తే బీసీలు స్వాగతించిన విషయాన్ని విస్మరించడం బాధాకరమన్నారు.

బీసీలకు 42 శాతం రిజర్వేషన్ కల్పిస్తే కుట్రలు కుతంత్రాలు పన్నుతూ అడ్డుకునే చర్యలకు పాల్పడడం దుర్మార్గమైన చర్యగా అభివర్ణించారు. తెలంగాణ రాష్ట్రంలో బీసీల జనాభా ఎంతో రిజర్వేషన్ల వాటా కూడా అంతే స్థాయిలో ఉండాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలో అత్యధిక జనాభా కలిగిన బీసీ సామాజిక వర్గానికి రాజకీయాల్లో సముచిత ప్రాధాన్యత దక్కడం లేదని దీంతో రాజకీయంగా బీసీలు వెనుకబడి ఉన్నారన్నారు. బీసీలకు స్థానిక సంస్థల్లోనే కాకుండా చట్టసభల్లో కూడా జనాభా దామాషా పద్ధతిలో రిజర్వేషన్ కల్పించే విధంగా చట్టం చేయాల్సిన అవసరం ఆవశ్యకత ఎంతైనా ఉందన్నారు. ఆ దిశగా కూడా బీసీల పోరాటం కొనసాగుతుందన్నారు. బీసీల రిజర్వేషన్ ల సాధన కోసం జేఏసీ ఇచ్చిన కార్యక్రమాలను, చేపడుతూ ఉద్యమాన్ని కొనసాగిస్తామన్నారు.

పదవుల్లో ఉన్న బీసీ నాయకులు తమ పదవులకు రాజీనామాలు చేసి ఉద్యమాన్ని ఉధృతం చేసే పరిస్థితులు కూడా వచ్చే అవకాశాలు లేకపోలేదన్నారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో 42 శాతం రిజర్వేషన్ సౌకర్యం కల్పించని యెడల తెలంగాణ సాధన ఉద్యమం మాదిరిగా బీసీల ఉద్యమం కొనాసాగించే పరిస్థితి ఉంటుందని హెచ్చరించారు. ఈ విలేకరుల సమావేశంలో .. బీసీ సంక్షేమ సంఘం మంథని నియోజకవర్గ అధ్యక్షులు తోట రాజ్ కుమార్, బీఆర్ఎస్ మండల కన్వీనర్ తాటికొండ శంకర్, బీజేపీ జిల్లా ఉపాధ్యక్షులు మచ్చగిరి రాము, బీజేపీ మండల అధ్యక్షులు కొయ్యడ సతీష్ యాదవ్, పీ. ఏ. సీ. ఎస్ వైస్ చైర్మన్ చిందం తిరుపతి, బీఆర్ఎస్ యూత్ మండల అధ్యక్షులు బొమ్మగాని అనిల్ గౌడ్, మోకుదెబ్బ ఉమ్మడి జిల్లా కన్వీనర్ వెంగలి రాజయ్య, జూలపల్లి మాజీ ఉప సర్పంచ్ పోలుదాసరి సాయికుమార్, నాయకులు మానక ఓదెలు, సందీప్, శ్రీనివాస్ లతో పాటు తదితరులు పాల్గొన్నారు.



## బంద్ ఫర్ జస్టిస్‌కు ఏఐవైఎఫ్ మద్దతు

**మేడిపల్లి,అక్టోబర్ 16 (జనంసాక్షి):** రాష్ట్రంలో బీసీ రిజర్వేషన్ 42% సాధనకు బీసీ జేఏసీ ఈనెల 18న తలపెట్టిన 'బంద్ ఫర్ జస్టిస్'కు ఏఐవైఎఫ్ మద్దతిస్తుందని ఏఐవైఎఫ్ జిల్లా ప్రధానకార్యదర్శి ఎండి కుతుబ్ చెప్పారు. అమరచింత లో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. అసెంబ్లీలో ప్రభుత్వం ఏకగ్రీవంగా ఆమోదించిన 42% రిజర్వేషన్ బిల్లును గవర్నర్, రాష్ట్రపతి ఆమోదించి ఉంటే హైకోర్టు రిజర్వేషన్ బిల్లును కొట్టేసేది కాదన్నారు. దీనికి పూర్తి బాధ్యత బిజెపిదే అన్నారు. 42 శాతం రిజర్వేషన్ల అమలకు వ్యతిరేకిగా మారిన బిజెపిని ప్రజలు గద్దించాలి అన్నారు. 8 మంది బీజేపీ ఎంపీలను తెలంగాణ ప్రజలు గెలిపించారని గెలుపులో బీసీల పాత్ర ఉందన్నారు. 42% రిజర్వేషన్ అమలుకు కేంద్రాన్ని బిజెపి ఎంపీలు ఒప్పించాలన్నారు. 'బంద్ ఫర్ జస్టిస్' కు మద్దతు ఇవ్వటమే గాక ప్రత్యక్షంగా పాల్గొంటామన్నారు. పార్టీలకతీతంగా బీసీలు పెద్ద సంఖ్యలో పాల్గొని బంద్ ఫర్ జస్టిస్ ప్రోగ్రాములు విజయవంతం చేయాలన్నారు. నాయకులు ఆంజనేయులు మహేష్ కృష్ణ పాల్గొన్నారు.

## ఉపాధి హామీ 14వ విడుత సామాజిక తనిఖీ ప్రజావేదిక




**మర్రిగూడ, అక్టోబర్ 16(జనం సాక్షి) :** ఉపాధి హామీ 14వ విడుత సామాజిక తనిఖీ ప్రజావేదిక మర్రిగూడ మండల కేంద్రం లోని ఉపాధి హామీ కార్యాలయం ఆవరణలో ప్రజావేదికను గురువారం ఉదయం నుండి రాత్రి వరకు నిర్వహించారు. 2024 ఏప్రిల్ నుంచి 2025 మార్చి వరకు 6 కోట్ల61లక్షల రూపాయలతో చేపట్టిన 455 పనులపై మండలం లోని 20 గ్రామ పంచాయతీ లలో వివిధ పనుల సామాజిక తనిఖీల నిర్వహించారు. డిఆర్‌డిఓ అడిషనల్ పిడి డాక్టర్ యామిని అంశాలపై మాట్లాడారు. సభ్యులు తనిఖీ నివేదికను చదివి వినిపించారు.సభ్యులు తనిఖీ నివేదికలను అధికారు లకు చదివి వినిపించారు. గ్రామపంచాయతీ కార్యదర్శులకు, టిఏలు,ఫీల్డ్ అసిస్టెంట్లు లకు రికార్డుల పరంగా 51 వేలు పెనాల్టీ రికవరికి ఆదేశించారు. ఈ కార్యక్రమంలో జిల్లా విజిలెన్స్ అధికారి వేణుగోపాలరావు. మర్రిగూడ ఎంపీడీవో మునయ్య. ఏపీవో. ఈసీ సిబ్బంది పాల్గొన్నారు.

## పారిశుద్ధ్య పనులు పరిశీలించిన మున్సిపల్ కమిషనర్



**సుల్తానాబాద్,అక్టోబర్ 16(జనంసాక్షి) :** మున్సిపల్ పరిధిలోని పలు వార్డులలో జరుగుతున్న పారిశుద్ధ పనులను గురువారం మున్సిపల్ కమిషనర్ తిప్పరాజు రమేష్ పరిశీలించి పలు సూచనలు చేశారు. సందర్భంగా కమిషనర్ తిప్పరాజు రమేష్ మాట్లాడుతూ సుల్తానాబాద్ మున్సిపల్ సుందరంగా తీర్చిదిద్దేందుకు అన్ని వార్డులలో పరిశుద్ధ పనులు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. మున్సిపల్ ప్రజలు పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలని, తడి చెత్త పొడి చెత్త వేరువేరుగా ఏర్పాటు చేసి మున్సిపల్ వాహనానికి అందజేయాలన్నారు. పారిశుద్ధ్య పనులలో నిర్లక్ష్యం చేయకుండా వార్డులు పరి శుభ్రంగా ఉంచేందుకు సిబ్బంది కృషి చేయాలని సూచించారు. ఏమైనా ఇబ్బందులు ఉంటే తన దృష్టికి తీసుకురావాలని వెంటనే పరిష్కారం చేస్తానని మున్సిపల్ కమిషనర్ తిప్పరాజు రమేష్ స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ సిబ్బంది న్యాతరి రాజు తో పాటు రమేష్ పాల్గొన్నారు.

# అమీర్‌పేట ముంపునకు "హైడ్రా" పరిష్కారం

- నగర వ్యాప్తంగా ఇదే విధానం అనుసరించాలన్న హైడ్రా కమిషనర్
- నాలాల డీసిల్టింగ్ పనులు పరిశీలన





**హైదరాబాద్, అక్టోబర్ 16 (జనంసాక్షి) :** వర్షం వస్తే ఆందోళన. 10 సెంటీమీటర్ల వర్షం పడితే రహదారు లన్నీ జలమయం. ఇక అమీర్‌పేట గురించి ప్రత్యేకంగా చెప్పాలా..? జూబ్లీహిల్స్, గాయత్రీ హిల్స్, యూసుఫ్‌గూడ, కృష్ణానగర్, మదురా నగర్, శ్రీనివాస నగర్ ప్రాంతాల నుంచి వచ్చే వరద ముందుకు సాగక అమీర్‌పేటలో నడుం లోతు నీళ్లు ప్రధాన రహదారిపై నిలిచిపోవడం, వాహన రాకపోకలకు ఇబ్బంది కలగడం, ఇవన్నీ నగరవాసులకు ప్రతి ఏటా అనుభవంలోకి వచ్చిన వరద కష్టాలే. ఈ ఏడాది ఆ సమస్యకు హైడ్రా పరిష్కారం చూపింది. వరద కష్టాలకు తెర దించింది. ఇప్పుడు 10 సెంటీమీటర్ల వర్షం పడితే నీరు నిలవకుండా ముందుకు సాగేలా హైడ్రా చర్యలు తీసుకుంది. ఈ పనులను హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్ నిరంతరం పర్యవేక్షించా రు. హైడ్రా, జీహెచ్ఎంసీ, జలమండలి, ఇరిగేషన్ అధికారులతో పలుమార్లు క్షేత్రస్థాయిలో పరిశీలించి పరిష్కార మార్గం చూపారు. ఈ క్రమంలోనే గురువారం కూడా అమీర్‌పేటలో పర్యటించి పూడుకుపోయిన నాలాలనుంచి మట్టిని, చెత్తను తొలగించే పనులను పర్యవేక్షించారు.

**అమీర్‌పేట ఓ నమూనా..**

అమీర్‌పేటలో వరద ముప్పు తప్పించేందుకు అనుసరించిన విధానం నగరంలోని అనేక ముంపు ప్రాంతాలకు పరిష్కార మార్గమని హైడ్రా కమిషనర్ తెలిపారు. పూడుకుపోయిన నాలాలను ఇదే మాదిరి తెరిస్తే చాలావరకు వరద సమస్యకు పరిష్కారం చూపగలమని చెప్పారు. అమీర్‌పేట్‌లోని మైత్రివనం జంక్షన్, గాయత్రీ నగర్ ప్రాంతాలను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. మొత్తం 6 పైపులైన్లుండగా 3 లైన్లను పూర్తి స్థాయిలో పునరుద్ధణ పనులు పూర్తి చేసినట్టు అధికారులు కమిషనర్‌కు తెలిపారు. మరో 3 లైన్లలో పూడిక తీయడంతో పాటు ఈ వరదంతా గాయత్రీనగర్‌పై పడకుండా అక్కడ కూడా పైపులైన్లలో మట్టిని తొలగించే పనిని పూర్తిచేయాలని కమిషనర్ సూచించారు. వచ్చే వర్షాకాలానికి నీరు నిలవకుండా గాయత్రీ నగర్ కు ముంపు సమస్య లేకుండా చూడాలన్నారు.

**45 ట్రక్కుల మట్టి తరలింపు**

అమీర్‌పేట జంక్షన్‌లో సారథీ స్టూడియోస్, మధురానగర్ వైపు నుంచి వచ్చే పైపులైన్లు కలుస్తాయి. ఎగువ నుంచి వరదతో పాటు భారీ మొత్తంలో చెత్త కూడా ఇక్కడకు చేరుతోంది. అలా దశాబ్దాలుగా చేరిన చెత్తతో అమీర్‌పేట జంక్షన్‌లో 6 పైపులైన్లు పూడుకుపోయి కొంతమొత్తంలోనే వరద నీరు ముందుకు సాగేది. ఏమాత్రం వర్షం పడినా వరద ముంచెత్తేది. శ్రీనివాస్‌నగర్ వెస్ట్ సైడ్ వరద కాలువ పైన కాంక్రీట్‌తో వేసిన పైకప్పు తెరచి పూడిక తీత పనులను హైడ్రా చేపట్టింది. పరుపులు, దిండులు ఇలా చెత్తతో మూసుకుపోయిన పైపులైన్లను తెరచింది. ఇప్పటి వరకూ ఇలా 45 ట్రక్కుల మట్టిని తొలగించింది. దీంతో ఈ ఏడాది 10 సెంటీమీటర్ల వర్షం పడినా ఇబ్బంది కలగలేదు. మరో 3 పైపు లైన్లలో కూడా పూడికను తొలగిస్తే 15 సెంటీమీటర్ల వర్షం పడినా అమీర్‌పేటలో వరద ముంచెత్తదని హైడ్రా, జీహెచ్ఎంసీ, జలమండలి, ఇరిగేషన్ అధికారులు కమిషనర్‌కు తెలిపారు. ఇదే మాదిరి నగరంలోని ముంపు సమస్యను ఎదుర్కొంటున్న ప్రాంతాల్లో కల్వర్టులు, అండర్‌గ్రౌండ్ పైపు లైన్లలో పూడికను తొలగించి ముంపు సమస్యకు పరిష్కారం చూపాలని హైడ్రా కమిషనర్ సూచించారు. కాలనీ అసోసియేషన్ సభ్యులు హైడ్రా బృందం చేపట్టిన పనుల పట్ల కృతజ్ఞతలు తెలిపారు.

### వేధింపులకు గురిచేస్తున్న అధికారులపై
# యాజమాన్యం చర్యలు తీసుకోవాలి

- ఇన్‌ఫార్మర్ గిరిచేస్తే అధికారులను కార్మికులు తరిమి కొడుతారు
- సీఎస్‌పీ గేట్ మీటింగ్‌లో అధికారులపై మండిపడ్డ ఏఐటీయూసీ నాయకులు




**గోదావరిఖని,అక్టోబర్ 16(జనం సాక్షి) :** సింగరేణి కార్మికులను వేదింపులకు గురిచేస్తే గుర్తింపు సంఘం (ఏఐటియుసి) చూస్తూ ఊరుకోదని, కార్మిక వ్యతిరేక విధానాలకు పాల్పడుతున్న అధికారులను కార్మికులే తరిమికొట్టే పరిస్థితి వస్తుందని సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ (ఎఐటియుసి) ఉప ప్రధాన కార్యదర్శి మడ్డి ఎల్లాగౌడ్, బ్రాంచి కార్యదర్శి ఆరెల్లి పోషం పేర్కొన్నారు.గురువారం సింగరేణి ఆర్జీ-వన్ ఏరియాలోని జిడికె వన్ సిఎస్‌పిలో జరిగిన ఏఐటియుసి గేట్ మీటింగ్‌లో వారు పాల్గొని మాట్లాడుతూ వన్ సిఎస్‌పిలో అధికారులు కొంత మంది కార్మికులను, సూపర్ వైజర్లను ఏర్పాటు చేసుకొని వారిని ఇన్‌ఫార్మర్ లుగా, గూడచారులుగా వాడుకుంటూ విధులు నిర్వహిస్తున్న కార్మికులపై ఫోటోలు, వీడియోలు తీసి వారిని మానసికంగా వేదింపులకు గురిచేయడం ఏం విధానమని వారు మండిపడ్డారు.ఇది ప్రభుత్వ రంగ సంస్థ అని, ప్రైవేటు సంస్థ లాగా వ్యవహరిస్తూ కార్మికుల ను వేదింపులకు గురి చేస్తే సహించేది లేదని వారు హెచ్చరించారు.వన్ సిఎస్‌పి అధికారులు నియంతలాగా వ్యవహరిస్తూ వారికి నచ్చిన కార్మికులను ఎలాంటి విధులు అప్పచెప్పకుండ ఉచితంగా మస్టర్లు ఇస్తూ ఇన్‌ఫార్మర్ లుగా, గూడచారులుగా పెట్టుకొని కార్మికుల విధుల్లో జోక్యం చేసుకుంటూ వారిని మానసికంగా వేదింపులకు గురిచేయడం ఏం విధానమని వారు అధికారులను ప్రశ్నించారు.కార్మిక వ్యతిరేక విధానాలకు పాల్పడుతున్న అధికారులపై యాజమాన్యం తగుచర్యలు తీసుకోవాలని లేనిచో కార్మికులే వారిని తరిమి కొట్టేపరిస్థితి వస్తుందని, కార్మికులకు ఏఐటియుసి అండగా ఉంటూ పోరాటాలు చేస్తుందని వారు పేర్కొన్నారు.

సింగరేణిలో కార్మికుల సంక్షేమం కోసం వారి హక్కుల కోసం నిరంతరం పోరాడేది ఏఐటియుసి మాత్రమేనని వారు పేర్కొన్నారు. సంస్థ రక్షణ కోసం కృషి చేస్తున్న సంఘం ఏఐటియుసి మాత్రమేనని, సంస్థలో కార్మికులకు అన్యాయం జరిగితే ఏఐటియుసి చూస్తూ ఊరుకోదని వారికి అండగా ఉంటుందని వారన్నారు.ఈ సమావేశంలో ఏఐటియుసి ఆర్జీ.వన్ బ్రాంచి డిపార్ట్మెంట్‌ల ఇంచార్జీ సయ్యద్ సోహేల్, నాయకులు ఎస్.వెంకట్‌రెడ్డి, డిపార్ట్మెంట్ కార్యదర్శి బండి మల్లేష్, ఏఐటియుసి నగర వర్కింగ్ ప్రెసిడెంట్ ఎంఎ గౌస్, డిపార్ట్మెంట్ నాయకులు బి.సమ్మయ్య,జానీమియా, రాజేశ్వర రావు, సుభాష్, బాబులాల్ తదితరులు పాల్గొన్నారు.

## విశ్రాంత ఉద్యోగులకు లాభాల వాటా.. పీఎల్‌ఆర్ బోనస్ చెల్లించాలి

**గోదావరిఖని, జనంసాక్షి :** పోచారం మున్సిపాలిటీ చౌదరిగూడ ఓయూ కాలనీలో సింగరేణి రిటైర్డ్ ఉద్యోగులు మాట్లాడు తూ సింగరేణిలో పనిచేస్తున్న ఉద్యోగులకు గత నెల 29వ తేదీన 2024-2025 ఆర్థిక సంవత్సరంలో సంస్థ లాభాల వాటాలో 34శాతం చెల్లించడం వలన కార్మికులు ఉత్సాహంగా దసరా పండుగ జరుపుకోవడం జరిగింది.ప్రతి సంవత్స రం దీపావళి పండుగకు చెల్లించే ఈ సంవత్సరపు పిఎల్‌ఆర్ బోనస్ రూ.1,03,000 ఈనెల 17న చెల్లిస్తామని యాజమాన్యం పత్రిక ప్రకటన ద్వారా తెలిపింది.కానీ ఆర్థిక సంవత్సర లాభాల వాటా, దీపావళి బోనస్ కూడా పని చేసే ఉద్యోగులతో పాటు విశ్రాంత ఉద్యోగులకు ఒకే తేదీన చెల్లిం పులు గత కొన్ని సంవత్సరాల నుండి జరుగుట లేదు.రిటైర్డ్ ఉద్యోగులకు సంస్థ చెల్లించిన ప్రావిడెంట్ ఫండ్,గ్రాట్యుటీ సొమ్ము ఇంటి నిర్మాణాలు, కుటుంబ సభ్యుల వివాహాలకు ఖర్చు చేయ బడింది. 30,40 సంవత్సరాలు సంస్థ అభివృద్ధికి పాటు పడి గత ఆర్థిక సంవత్సరం లో పదవి విరమణ పొందిన ఉద్యోగులకు లభించే లాభాల వాటా,దీపావళి బోనస్ కొరకు నిరీక్షించడం బాధాకరమైన విషయం. సాంకేతికంగా అగ్రగామిగా ఉండి క్షణాల్లో గణాంక వివరాలు తెలిపే వ్యవస్థ ఉన్నప్పటికి చెల్లింపులో జాప్యం ఎందుకో అని రిటైర్డ్ ఉద్యోగులు వాపోతున్నారు. కనుక పని చేసే ఉద్యోగులతో పాటు విశ్రాంత ఉద్యోగులకు కూడా ఈనెల 17న దీపావళి బోనస్‌తో పాటు పెండింగ్‌లో ఉన్న లాభాల వాటా చెల్లించి రిటైర్డ్ ఉద్యోగుల కుటుంబాలలో దీప కాంతులు వెదజల్లాలని, సింగరేణి విశ్రాంత ఉద్యోగులు యాజమాన్యాన్ని వేడుకుంటున్నారని సింగరేణి రిటైర్డ్ ఎంప్లాయిస్ వెల్ఫేర్ అసోసియే షన్ ఉప ప్రధాన కార్యదర్శి ఆళవందార్ వేణు మాధవ్ తెలిపారు.ఈ సమావేశంలో సింగరేణి రిటైర్డ్ ఉద్యోగులు కంచ బీరయ్య, గీస కనకయ్య, పొగాకు రవీందర్, ఎం.డి.రఫీక్ అహమద్, కేజీరాజు పాల్గొన్నారు.

# 18న బీసీల సత్తా చాటుదాం






- పార్టీలకతీతంగా ఐక్య పోరాటం, రాష్ట్ర బంద్‌కు పిలుపు
- 42% రిజర్వేషన్ సాధించేంతవరకు అవిరామ పోరాటం
- బస్సులు, షాపులు, విద్యాసంస్థలు బంద్ చేయాలి
- అగ్రవర్ణాల ఆధిపత్యానికి బీసీ ఓట్లు వద్దు
- జేఏసీ నేతలు రౌండ్ టేబుల్, బంద్ ప్రచార సమావేశాలు

**సుల్తానాబాద్, అక్టోబర్ 16 (జనంసాక్షి):** జనాభాపరంగా అధిక శాతం ఉన్న బీసీలు పార్టీలకతీతంగా ఐక్యంగా ఉండి 42 శాతం రిజర్వేషన్ సాధించేంతవరకు అవిరామ పోరాటం చేయాలని బీసీ జేఏసీ నేతలు పిలుపునిచ్చారు. హైకోర్టు ఇచ్చిన స్టేను నిరసిస్తూ ఈ నెల 18న రాష్ట్రవ్యాప్త బంద్‌ను విజయవంతం చేయాలని, బస్సులు నడవొద్దు, షాపులు, విద్యాసంస్థలు తెరవొద్దని స్థానిక వైశ్య భవన్‌లో జరిగిన రౌండ్ టేబుల్ సమావేశంలో నిర్ణయించారు. జిల్లా బీసీ జేఏసీ చైర్మన్, జాతీయ బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు తాళ్లపల్లి మనోజ్ గౌడ్ ఆధ్వర్యంలో పార్టీలకతీతంగా జరిగిన ఈ సమావేశానికి మాజీ జిల్లా పరిషత్ చైర్మన్ గుర్రాల మల్లేశం, మాజీ మార్కెట్ చైర్మన్లు బుర్ర శ్రీనివాస్ గౌడ్, సాయిరి మహేందర్, మాజీ ఎంపీటీసీ సభ్యులు సూర శ్యాం, బీజేపీ మండల అధ్యక్షులు కందుల శ్రీనివాస్, మొలుగూరి అంజయ్య గౌడ్, మిట్టపల్లి ప్రవీణ్ కుమార్, కూకట్ల నాగరాజు, గజ్ బీన్ కార్ పవన్, కూకట్ల గోపి, కర్రె కుమార్, వేగోళం శంకర్ గౌడ్, తాడూరి శ్రీమాన్, దీకొండ భూమేష్, బోయిని రాజమల్లయ్య, వేగోళం అబ్బయ్య గౌడ్, కందుకూరి ప్రకాష్ రావు, మియాపురం శ్రీనివాస్, పొన్నం చంద్రయ్య గౌడ్, బోయిని ముత్యాలు, భూమయ్య తదితర బీసీ నేతలు పాల్గొన్నారు.

అధిక జనాభా ఉన్నప్పటికీ రాజకీయ, విద్య, ఉద్యోగ రంగాల్లో వెనుకబాటుతనపడుతున్నామని, 10 శాతం లేని అగ్రవర్ణాలు మా ఓట్లతోనే రాజ్యాధికారం చేజిక్కుంటున్నారని నేతలు ఆందోళన వ్యక్తం చేశారు. బందు పిలుపును విజయవంతం చేయడానికి ప్రతి బీసీ బిడ్డ కదిలి రావాలని, రాజ్యాధికార లక్ష్యంతో బీసీ ఉద్యమాన్ని తెలంగాణ ఉద్యమం లాగా ఉధృతం చేయాలని పేర్కొన్నారు. అన్ని రాజకీయ పార్టీల నేతలను కలుస్తామని, మద్దతు ఇవ్వని పార్టీలకు బీసీల ఓట్లు అడగడానికి హక్కు లేదని హెచ్చరించారు.

అదే సమయంలో జాతీయ బీసీ విద్యార్థి సంఘం రాష్ట్ర జనరల్ సెక్రటరీ పల్లె హరికృష్ణ యాదవ్, పెద్దపల్లి జిల్లా అధ్యక్షుడు మల్యాల సంజీవ్ గౌడ్ బంద్ ప్రచార సమావేశంలో మాట్లాడుతూ, ఈ బంద్‌తో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు బీసీల సమస్యలు తెలియాలని, యాజమాన్యం, విద్యాసంస్థలు, వ్యాపార సముదాయాలు స్వచ్ఛందంగా సహకరించాలని కోరారు. 42 శాతం రిజర్వేషన్, హక్కులు సాధించేంతవరకు పోరాటం కొనసాగుతుందని, పెద్ద ఎత్తున పాల్గొని బీసీల సత్తాను చాటాలని పిలుపునిచ్చారు.

## డయాలసిస్ పేషెంట్లకు 'నీడ-రూ.521' పెన్షన్ అందచేత

**గోదావరిఖని, జనంసాక్షి :** రామగుండం నగరపాలక సంస్థ పరిధి అడ్డగుంటపల్లిలో నివాసముంటున్న ఆదర్శ స్క్రాప్ అసోసియేషన్ అధ్యక్షులు సయ్యద్ తల్హాఅహ్మద్ జన్మదినం సందర్భంగా నీడ స్వచ్ఛంద సంస్థ దత్తత తీసుకున్న డయాలసిస్ పేషంట్లలో ఐదుగురికి నెల పెన్షన్ రూ.521 చొప్పున అందజేశారు.ఈ సందర్భంగా నీడ అధ్యక్షులు పల్లెర్ల రమేష్‌గౌడ్ మాట్లాడుతూ ఆదర్శ స్క్రాప్ అసోసియేషన్ అధ్యక్షులు తౌఫిక్ కుమారుడు అల్హా అహ్మద్ జన్మదినం సందర్భంగా మంచి సేవా కార్యక్రమాన్ని చేసినందుకు ధన్యవాదాలు తెలిపారు.ఈ కార్యక్రమంలో నీడ అధ్యక్షులు పల్లెర్ల రమేష్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ శాఖల పేరు చెప్పి వసూళ్లు

- పోలీసులకు ఫిర్యాదు చేసిన మెడికల్ అసోసియేషన్ ఉప్పల్ శాఖ
- పట్టుకొని రిమాండ్‌కు తరలించిన మేడిపల్లి పోలీసులు



**బోడుప్పల్-జనంసాక్షి :** ప్రయివేటు హాస్పిటల్స్, స్కూల్‌ల సంబంధించిన అనుమతి పత్రాలు ఎన్ఓసీలు సరిగ్గా లేవనని అపరిచిత వ్యక్తి బెదిరిస్తూ డబ్బులు డిమాండ్ చేస్తున్నట్లు ఇండియన్ మెడికల్ అసోసియేషన్ ఉప్పల్ శాఖ అధ్యక్షుడు డాక్టర్ అశోక్ ఆధ్వర్యంలో మేడిపల్లి పోలీసులకు ఫిర్యాదు చేశారు.వెంటనే స్పందించిన ఇన్స్పెక్టర్ గోవింద రెడ్డి అతనిని అరెస్టు రిమాండ్‌కు తరలించినట్లు తెలిపారు.పోలీసులు తెలిపిన పూర్తి వివరాల ప్రకారం మేడిపల్లి పోలీస్ స్టేషన్ పరిధిలోని కాశవాణి సింగారం మణిదీప కాలనీలో ఉండే వ్యక్తి మహమ్మద్ జుల్కర్ నాయన్ తండ్రి మహమ్మద్ ఓజియార్(36) వృత్తి ప్రైవేట్ జాబ్ సొంత గ్రామం మంచిర్యాల జిల్లా,బెల్లంపల్లికి చెందిన అతను రాష్ట్ర ప్రభుత్వానికి చెందిన వివిధ శాఖలు జిహెచ్ఎంసి, డిఎంహెచ్ఓ,ఫైర్ డిపార్ట్మెంట్, పొల్యూషన్ కంట్రోల్ బోర్డ్ నుండి వచ్చానని ఆసుపత్రులు,విద్యాసంస్థల అనుమతి పత్రాలు సరిగ్గా లేవని ఎన్ఓసీలు లేదని డబ్బులు డిమాండ్ చేస్తున్నట్టు చేస్తున్నట్లు నిర్ధారణ అయిందని, అతనిపై అనేక పోలీస్ స్టేషన్లో వివిధ కేసులు నమోదు అయ్యాయని సీఐ గోవిందరెడ్డి తెలిపారు.

## బీసీ రిజర్వేషన్ల బంద్‌కు ముదిరాజ్ సంఘం మద్దతు

**గోదావరిఖని, జనంసాక్షి :** స్థానిక సంస్థల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్ల అమలు కోసం బీసీ సంఘాలు, బీసీ సమాజం ఈనెల 18న తలపెట్టిన రాష్ట్ర బంద్‌కు పెద్దపల్లి జిల్లా తెలంగాణ ముదిరాజ్ సంఘం తరపున పూర్తి మద్దతు ప్రకటిస్తున్నామని తెలంగాణ ముదిరాజ్ సంఘం పెద్దపల్లి జిల్లా అధ్యక్షులు పిడుగు కృష్ణ ముదిరాజ్ తెలిపారు.గురువారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ముదిరాజ్ కుల బాంధవులు అందరూ 18న తలపెట్టిన బీసీ రిజర్వేషన్ బంద్‌లో పాల్గొని విజయవంతం చేయాలని పిడుగు కృష్ణ పిలుపునిచ్చారు.

## ఆరోగ్య దాతకు అరుదైన అవార్డ్

### ఐఎంఎ ఉత్తమ శాఖ అధ్యక్షులుగా అవార్డుకు ఎంపికైన డాక్టర్ అనమల్ల నరేష్



**కరీంనగర్ జిల్లా బ్యూరో, అక్టోబర్ 16 (జనంసాక్షి):** ఇండియన్ మెడికల్ అసోసియేషన్ తెలంగాణ రాష్ట్ర శాఖ తరపున కరీంనగర్ బ్రాంచ్ అధ్యక్షులు డాక్టర్ అనమల్ల నరేష్ కి కరీంనగర్ జిల్లా "ఉత్తమ శాఖ అధ్యక్షులుగా (ఉత్తమ జిల్లా అధ్యక్షులు గా స్థానిక శాఖా అవార్డ్) పురస్కారం లభించిందని తెలంగాణ రాష్ట్ర శాఖ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ అవార్డు ప్రదానం కార్యక్రమం 2025 నవంబర్ 2న కరీంనగర్ బైపాస్ రోడ్డులోని వి-కన్వెన్షన్లో జరగనున్న 9వ వార్షిక రాష్ట్ర మండలి సమావేశంలో ఇవ్వనున్నారు. ఈ సందర్భంగా తెలంగాణ రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ డి. ద్వారకానాథ్ రెడ్డి, డాక్టర్ అనమల్ల నరేష్ కు అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా ఐఎంఎ సభ్యులను సమావేశానికి హాజరై నమోదు చేసుకోవాలని, మరిన్ని వివరాలకు డాక్టర్ పొలస రామ్ కిరణ్ (ఆర్గనైజింగ్ సెక్రటరీ ఐఎంఎ టిఎస్సిఓఎన్ 9వ రాష్ట్ర సదస్సు, మొబైల్ నెంబర్ 091 98665 92340) ను సంప్రదించవచ్చని తెలిపారు. ఐఎంఎ కరీంనగర్ శాఖకు ఆల్ రౌండ్ బెస్ట్ బ్రాంచ్ అవార్డు ఇండియన్ మెడికల్ అసోసియేషన్, తెలంగాణ రాష్ట్ర కమిటీ ప్రకటించిన "లార్జ్ బ్రాంచ్ కేటగిరీ"లో "ఆల్ రౌండ్ బెస్ట్ బ్రాంచ్ అవార్డు"ను ఐఎంఎ కరీంనగర్ బ్రాంచ్ దక్కించుకుందని ద్వారాకానాథ్ రెడ్డి తెలిపారు. ఐఎంఎ కరీంనగర్ బ్రాంచ్ అధ్యక్షులు డా. నరేష్ అనమల్ల, కార్యదర్శి డా. ఎస్. నవీన్ కుమార్, ఖజాంచి డా.చి.విజయ్ కుమార్ లను రాష్ట్ర అధ్యక్షులు డా.డి. ద్వారకానాథ్ రెడ్డి అభినందించారు.



## పాఠశాలను ఆకస్మిక తనిఖీ చేసిన కలెక్టర్

**ముత్తారం అక్టోబర్ 16 (జనంసాక్షి) :** ముత్తారం మండలం ధర్యాపూర్ గ్రామంలో తెలంగాణ ఆదర్శ పాఠశాలను గురువారం పెద్దపెల్లి జిల్లా కలెక్టర్ కోయా శ్రీహర్ష ఆకస్మికంగా తనిఖీ చేశారు. పాఠశాలలోని పాఠశాల ఆవరణంలోని పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుతూ,పరిశుభ్రత తప్పనిసరిగా పాటించాలని తెలిపారు.విద్యా బోధన,భోజన వివరాలను విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. అంతేకాకుండా పాఠశాలలో చేపడుతున్న పనులను త్వరగా పూర్తి చేసి విద్యార్థులకు అందుబాటులోకి తీసుకురావాలని సూచించారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ..విద్యార్థులకు మెను ప్రకారం నాణ్యమైన భోజనాన్ని అందించాలని తెలిపారు. అంతేకాకుండా పాఠశాలలోని గదులను ఎప్పటికప్పుడు శుభ్రంగా ఉంచుకోవడంతో విద్యార్థులు ఆరోగ్యంగా ఉంటారని తెలిపారు. పాఠశాలలోని విద్య విధానం పై అడిగి తెలుసుకోవడం జరిగింది అని తెలిపారు.ఈ కార్యక్రమంలో మండల అభివృద్ధి అధికారి సురేష్, ఆదర్శ పాఠశాల ప్రిన్సిపల్ డాక్టర్ సంతోష్ కుమార్ పాఠశాలలో సిబ్బందితో పాటు పాల్గొన్నారు




## మెరుగైన వైద్యం కోసం ఎర్రగడ్డకు..

**ఖమ్మం, (జనం సాక్షి):** ఖమ్మం నగరంలోని అన్నం సేవా ఫౌండేషన్‌లో గత కొంతకాలంగా గుర్తు తెలియని మతిస్థిమితం లేని ఆరుగురు మగ వ్యక్తులను మెరుగైన వైద్య చికిత్స కొరకు ఖమ్మం టూ టౌన్ పోలీస్ ద్వారా ఖమ్మం ప్రభుత్వ వైద్యశాలలో వైద్య పరీక్షలు చేయించి కోర్టు అనుమతితో టూ టౌన్ పోలీస్ ఎస్కార్ట్ ద్వారా హైదరాబాదు ఎర్రగడ్డ మానసిక వైద్యశాలలో చికిత్స కొరకు ఆరుగురు మతిస్థిమితంలేని వ్యక్తులను తరలించారు. ఈ కార్యక్రమంలో అన్నం ఫౌండేషన్ చైర్మన్ అన్నం శ్రీనివాసరావు, టూ టౌన్ పోలీస్ హెడ్ కానిస్టేబుల్ సుధాకర్, అన్నం పౌండేషన్ సభ్యులు పాల్గొన్నారు

# బెయిల్ షరతులు ఉల్లంఘించిన జగన్

- విదేశీ పర్యటన అనుమతిని రద్దు చేయాలని సీబీఐ మెమో



**హైదరాబాద్, అక్టోబర్16 (జనంసాక్షి) :** వైసీపీ అధినేత, మాజీ సీఎం వైఎస్ జగన్ విదేశీ పర్యటనపై కోర్టును సీబీఐ ఆశ్రయించింది. విదేశీ పర్యటనకు వెళ్లిన జగన్ తన సొంత సెల్ నెంబర్‌కు బదులు.. మరో నెంబర్ ఇచ్చారంటూ కోర్టులో దాఖలు చేసిన మెమోలో సీబీఐ స్పష్టం చేసింది. ఆయన బెయిల్ షరతులు ఉల్లంఘించారని ఆరోపించింది. ఈ నేపథ్యంలో వైఎస్ జగన్ పర్యటనకు ఇచ్చిన అనుమతిని రద్దు చేయాలని కోర్టుకు సీబీఐ విజ్ఞప్తి చేసింది. అందుకు కౌంటర్ దాఖలు చేయాలని జగన్ తరపు న్యాయవాదికి సీబీఐ కోర్టు ఆదేశించింది. ఈ కౌంటర్‌పై సీబీఐ కోర్టు ఈ రోజు అంటే.. గురువారం విచారణ చేపట్టనుంది. అక్టోబర్ 1 నుంచి 30వ తేదీ మధ్య.. 15 రోజుల పాటు ఐరోపా పర్యటనకు వెళ్తున్నాననీ.. అందుకు అనుమతించాలంట సీబీఐ కోర్టులో వైసీపీ అధినేత వైఎస్ జగన్ పిటిషన్ దాఖలు చేశారు. విదేశాలకు వెళ్లే ముందు తన ఫోన్ నెంబర్, ఈమెయిల్ ఐడీ సహా పర్యటన వివరాలను సమర్పించాలని షరతులు విధిస్తూ సీబీఐ కోర్టు అనుమతి మంజూరు చేసింది. అయితే కోర్టుకు వైఎస్ జగన్ ఇచ్చిన ఫోన్ నెంబర్ ఆయనది కాదని సీబీఐ పరిశీలనలో వెల్లడైంది. ఈ నేపథ్యంలో బెయిల్ షరతులను వైఎస్ జగన్ ఉల్లంఘించిన అంశాన్ని కోర్టు దృష్టికి సీబీఐ తీసుకు వెళ్లింది. వేరే నెంబర్ కోర్టుకు సమర్పించడంపై అభ్యంతరం వ్యక్తం చేసింది. దీంతో వైఎస్ జగన్ విదేశీ పర్యటనను రద్దు చేయాలంటూ హైదరాబాద్‌లోని సీబీఐ ప్రధాన కోర్టులో మెమో దాఖలు చేసింది. ఈ మెమోపై ఇటీవల న్యాయమూర్తి విచారణ చేపట్టారు. అందులో భాగంగా జగన్ తరపు న్యాయవాదికి కౌంటర్ దాఖలు చేయాలని ఆదేశించింది. ఈ కౌంటర్‌పై ఈ రోజు విచారణ జరగనుంది.

# జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల్లో మద్దతివ్వండి

- బీసీలకు 42 శాతం రిజర్వేషన్ల అమలులో కలిసిరండి
- సీపీఐ(ఎం)ను కోరిన టీపీసీసీ అధ్యక్షులు మహేష్‌కుమార్ గౌడ్
- జూబ్లీహిల్స్ పై 20న జరిగే రాష్ట్ర కమిటీలో నిర్ణయం తీసుకుంటాం
- అన్ని పార్టీలతో కూడిన బృందాన్ని ఢిల్లీకి తీసుకెళ్తే కేంద్రంపై ఒత్తిడి తెద్దాం
- సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి జాన్‌వెస్లీ



**హైదరాబాద్ (జనంసాక్షి) :** జూబ్లీహిల్స్ ఉపఎన్నికలో కాంగ్రెస్ అభ్యర్థి నవీన్ కుమార్ యాదవ్ మద్దతివ్వాలనీ, బీసీలకు 42 శాతం రిజర్వేషన్ల అమలు కోసం జరుగుతున్న పోరాటంలో ప్రభుత్వంతో కలిసిరావాలని సీపీఐ(ఎం)ను టీపీసీసీ అధ్యక్షులు మహేష్‌కుమార్ గౌడ్ కోరారు. గురువారం హైదరాబాద్లోని సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యాలయం(ఎంబీ భవన్)లో సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి జాన్వెస్లీ, ఇతర నాయకులతో ఆయన భేటీ అయ్యారు. ఆ భేటీలో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు, జూబ్లీహిల్స్ ఉప ఎన్నిక, తదితరాంశాల పై చర్చించారు. జూబ్లీహిల్స్ ఉప ఎన్నికపై మహేశ్కుమార్ గౌడ్ మద్దతు కోరగా... ఈ విషయం పై హైదరాబాద్ నగర కమిటీలో చర్చలు జరుగుతున్నాయనీ, ఈ నెల 20న జరిగే తమ పార్టీ రాష్ట్ర కమిటీ సమావేశాల్లో నిర్ణయాన్ని ప్రకటిస్తామని జాన్వెస్లీ హామీనిచ్చారు. బీసీలకు 42 శాతం రిజర్వేషన్ల విషయంలో రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే అఖిల పక్ష సమావేశాన్ని నిర్వహించాలని సూచించారు. ఆ తర్వాత అన్ని పార్టీల నాయకులతో కూడిన బృందానికి ఢిల్లీకి తీసుకెళ్లి ఈ విషయం పై కేంద్రంపై ఒత్తిడి తెచ్చేలా కార్యాచరణ రూపొందించాలని కోరారు. అదే సమయంలో ఢిల్లీలో జాతీయ, ఇతర ప్రధాన పార్టీల మద్దతు కూడగట్టే ప్రయత్నాన్ని కూడా చేయాలన్నారు. అప్పుడే కేంద్రంపై ఈ విషయంలో తీవ్ర ఒత్తిడి తీసుకొచ్చి విజయం సాధించగలుగుతామన్నారు. అఖిల పక్ష సమావేశం నిర్వహణ, బీసీలకు 42 శాతం రిజర్వేషన్ల కోసం ఢిల్లీకి అన్ని పార్టీల నేత బృందాన్ని తీసుకెళ్లడం అంశాలపై త్వరలోనే నిర్ణయం ప్రకటిస్తామంటూ మహేశ్కుమార్ గౌడ్ సానుకూలత వ్యక్తపరిచారు. సమావేశంలో సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు జూలకంటి రంగారెడ్డి, టి.జ్యోతి, టి. సాగర్, మల్లు లక్ష్మి, అబ్బాస్, బండారు రవికుమార్, పలువురు రాష్ట్ర నాయకులు పాల్గన్నారు.

# కులగణన సర్వేకు నారాయణమూర్తి దంపతులు దూరం

- ఎలాంటి సర్వేతో తమవద్దకు రావద్దని తెలిపినట్లు సమాచారం



**బెంగళూరు, అక్టోబర్16 (జనంసాక్షి) :** కర్ణాటక ప్రభుత్వం ఇటీవల చేపట్టిన సామాజిక, ఆర్థిక సర్వేకు దూరంగా ఉండాలని, అందులో తాము పాల్గొనబోమని ఇన్ఫోసిస్ నారాయణమూర్తి దంపతులు స్పష్టం చేసినట్లు సమాచారం. సర్వేలో భాగంగా రాష్ట్రవ్యాప్తంగా ప్రతి ఇంటికి వెళ్లి సిబ్బంది వివరాలు సేకరిస్తున్నారు. అయితే, ఈ సర్వే లో తాము పాల్గొనబోమని ఇన్ఫోసిస్ సహ వ్యవస్థాపకుడు నారాయణమూర్తి దంపతులు చెప్పినట్లు తెలుస్తోంది. తాము వెనకబడిన వర్గానికి చెందిన వ్యక్తులం కాదని వారు అధికారులతో తెలిపినట్లు సమాచారం. ఈ మేరకు పలు ఆంగ్ల మీడియా కథనాలు వెల్లడించాయి. సామాజిక, ఆర్థిక గణనలో భాగంగా బెంగళూరులోని జయానగర్‌లోని నారాయణమూర్తి నివాసానికి ఇటీవల సిబ్బంది వెళ్లారు. అయితే తమ వివరాలు చెప్పేందుకు నారాయణమూర్తి, ఆయన సతీమణి, రాజ్యసభ ఎంపీ సుధామూర్తి నిరాకరించినట్లు తెలుస్తోంది. మా నివాసంలో ఎలాంటి సర్వే నిర్వహించొద్దు. మేం వెనకబడిన సామాజిక వర్గానికి చెందిన వ్యక్తులం కాదు. అందువల్ల ఈ సర్వేలో పాల్గొనాల్సిన అవసరం లేదని వారు చెప్పారని తెలుస్తోంది. ఇదే విషయాన్ని వారు సర్వే పత్రంపై రాసి సంతకాలు చేసినట్లు సదరు కథనాలు పేర్కొన్నాయి. తమ ఇంట్లో ఈ సర్వే చేయడం వల్ల ప్రభుత్వానికి ఏ ఉపయోగం ఉండబోదని పేర్కొంటూ నారాయణమూర్తి దంపతులు స్వీయ ధ్రువీకరణ పత్రాలను కూడా సమర్పించినట్లు సమాచారం. కాగా.. ఈ పరిణామాలపై కర్ణాటక ఉప ముఖ్యమంత్రి డీకే శివకుమార్ స్పందించారు. సర్వేలో పాల్గొనాలని తాము ఎవరినీ బలవంతం చేయడం లేదని ఆయన పేర్కొన్నారు. ఇది పూర్తిగా స్వచ్ఛందంగా చేపడుతున్న గణన అని స్పష్టంచేశారు. సెప్టెంబరు 22 నుంచి రాష్ట్రంలో ఈ సర్వే జరుగుతోంది. దీని కింద రాష్ట్ర జనాభాకు సంబంధించి సామాజిక, ఆర్థిక, విద్య, కుల వివరాలను సేకరించనున్నారు. ఇందుకోసం మొత్తంగా 60 ప్రశ్నలను రూపొందించారు. ఈ గణన కోసం రూ.420 కోట్ల వరకు ఖర్చు పెట్టనున్నట్లు అంచనాలున్నాయి. ఈ సర్వేపై కర్ణాటకలో పెద్దఎత్తున వ్యతిరేకతలు వచ్చాయి. హైకోర్టులోనూ పలు పిటిషన్లు దాఖలయ్యాయి. వాటిని న్యాయస్థానం తోసిపుచ్చింది. సామాజిక, ఆర్థిక సర్వేను అడ్డుకోలేమని చెప్పింది. అయితే, బలవంతంగా వ్యక్తిగత వివరాలు సేకరించరాదని, సిబ్బంది ప్రతి ఇంటినీ సందర్శించాలని సూచించింది. కోర్టు ఉత్తర్వుల నేపథ్యంలోనే నారాయణమూర్తి దంపతులు సర్వేకు దూరంగా ఉన్నట్లు తెలుస్తోంది.

# పారదర్శకంగా డీసీసీ అధ్యక్షుడి ఎన్నిక

- ఏఐసీసీ ప్రతినిధి డాక్టర్ నరేష్ కుమార్



**మంచిర్యాల ప్రతినిధి, అక్టోబర్ 16 (జనంసాక్షి) :** జిల్లాలో కాంగ్రెస్ పార్టీని బలోపేతం చేయడమే లక్ష్యంగా ముందుకు సాగుతున్నామని, ప్రజా సమస్యలపై అవగాహన ఉన్న, అందరిని కలుపుకుపోయే వ్యక్తిత్వమున్న, పార్టీ అభివృద్ధి కోసం పాటుపడే నాయకుడిని పారదర్శకంగా ఎంపిక చేస్తామని ఏఐసీసీ ప్రతినిధి (అబ్జర్వర్) డాక్టర్ నరేష్ కుమార్ చేస్తామన్నారు. గురువారం నాడు మంచిర్యాల జిల్లా కేంద్రంలోని నార్త్ ఇన్ హెటల్ లో ఏర్పాటుచేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఏఐసీసీ అగ్రనేత రాహుల్ గాంధీ ఆదేశాలతో, కాంగ్రెస్ పార్టీ జాతీయ అధ్యక్షులు మల్లిఖార్జున్ ఖర్గే, ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్ సూచనల మేరకు జరుగుతున్న సంఘటన్ సృజన్ అభియాన్‌లో భాగంగా మంచిర్యాల జిల్లా డీసీసీ అధ్యక్షుడి ఎంపిక జరుగుతోందని పేర్కొన్నారు. మంచిర్యాల జిల్లాలో ఈ నెల 16వ తేదీ నుంచి డీసీసీ అధ్యక్షుడి ఎంపిక ప్రక్రియ ప్రారంభిస్తున్నామని, మాజీ ప్రజా ప్రతినిధులు, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు, సీనియర్ నాయకులతో సమావేశం నిర్వహించి డీసీసీ అధ్యక్ష పదవి కోసం దరఖాస్తు ఫారాలు అందజేస్తామన్నారు. పార్టీ లైన్ ప్రకారం పార్టీ కోసం పని చేసే నాయకుడిని ఎన్నుకుంటామన్నారు. 17న ఉదయం ఆసిఫాబాద్ జిల్లా అధ్యక్ష పదవికి దరఖాస్తు చేసిన అభ్యర్థులతో ఫారెస్ట్ గెస్ట్ హౌస్ లో వన్ టూ వన్ ఇంటర్వ్యూలు నిర్వహించి, మధ్యాహ్నం రెండు గంటలకు బెల్లంపల్లి నియోజక వర్గ స్థాయి సమావేశంలో బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు, మండల అధ్యక్షులు, ఫ్రంటల్ ఆర్గనైజేషన్ ప్రతినిధులతో సమావేశం నిర్వహించి దిశానిర్దేశం చేయనున్నామన్నారు. 18న చెన్నూర్ అసెంబ్లీ నియోజక వర్గ సమావేశం ఉదయం 11 గంటలకు చెన్నూర్ లో ఉంటుందని, 19న ఉదయం పది గంటలకు డీసీసీ అధ్యక్షుడిగా దరఖాస్తు చేసుకున్న వారితో ముఖాముఖి నిర్వహిస్తామన్నారు. అంతే కాకుండా అధ్యక్షుడి ఎంపిక కోసం మంచిర్యాల, బెల్లంపల్లి, చెన్నూర్ నియోజక వర్గాల్లో క్షేత్ర స్థాయిలో ప్రజలు, కార్యకర్తల వద్దకు వెళ్లి వారి ఒపినియన్ తీసుకుంటామన్నారు. దరఖాస్తు చేసుకున్న వారిలో నుంచి ఆరుగురిని ఎంపిక చేసి అధిష్టానంకు దరఖాస్తు ఫారాలు అందజేస్తామన్నారు.

## పోలీస్ అమరవీరుల స్తూపం ఆవిష్కరణ



**జయశంకర్ భూపాలపల్లి బ్యూరో, (జనంసాక్షి):** భూపాలపల్లి జిల్లా పోలీస్ కార్యాలయంలో పోలీస్ అమరవీరుల స్తూపంను జిల్లా పోలీస్ అధికారి కిరణ్ ఖరే గురువారం ఘనంగా ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ విధి నిర్వహణలో ప్రాణత్యాగం చేసిన పోలీసు అమరవీరులు సమాజానికి స్ఫూర్తిదాయకులు అన్నారు. వారి త్యాగాలను స్మరించుకుంటూ పోలీసు సిబ్బంది ప్రజల రక్షణలో కట్టుబడి పని చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో జిల్లా అడిషనల్ ఎస్పి నరేష్ కుమార్, భూపాలపల్లి డిఎస్పి సంపత్ రావు, కాటారం డిఎస్పి సూర్యనారాయణ, సిఐలు, ఎస్సైలు, డిపిఓ స్టాప్, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# స్వీట్ షాపులపై ఫుడ్ సేఫ్టీ అధికారుల దాడులు

- దీపావళి కోసం నాసిరకం స్వీట్లు గుర్తింపు

**హైదరాబాద్, అక్టోబర్16 (జనంసాక్షి) :** దీపావళి పండుగ సందర్భంగా హైదరాబాద్ నగరంలో స్వీట్ షాపులపై జీహెచ్ఎంసీ, ఫుడ్ సేఫ్టీ అధికారులు స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు. నగరంలోని 43 స్వీట్ షాప్స్ లో 3 రోజుల పాటు అధికారులు ఫుడ్ సేఫ్టీ స్పెషల్ డ్రైవ్ చేపట్టారు. గడువు ముగిసిన పదార్థాలు స్వీట్ల తయారీలో వాడుతున్నట్లు గుర్తించారు. స్వీట్ షాప్ లో అమ్మే వస్తువులకు ఎలాంటి లేబెల్, ఎక్స్పైరీ డేట్ లేదని అధికారులు తెలిపారు. మిఠాయిలల్లో ప్రమాదకరమైన సింథటిక్ ఫుడ్ కలర్స్ వాడుతున్నట్లు నిర్ధారించారు. వంటశాలలు అపరిశుభ్రంగా ఉన్నట్లు గుర్తించారు. దీపావళి గిరాకీ ఎక్కువగా వస్తుందని నాసిరకంగా టన్నుల కొద్దీ స్వీట్స్ తయారు చేస్తుండటంతో ఫుడ్ పాయిజన్ అయ్యే అవకాశం ఉందని ఫుడ్ సేఫ్టీ ఆఫీసర్లు హెచ్చరించారు. నిబంధనలు పాటించని స్వీట్ షాప్స్ కి నోటీసులు, భారీ పెనాల్టీలు విధించినట్లు తెలిపారు.

# న్యాయస్థానం పర్యవేక్షణలో దర్యాప్తు చేయండి

- ఎయిర్ ఇండియా ఫ్లైట్ ప్రమాదంపై సుప్రీంను కోరిన పైలట్ సుమీత్ సభర్వాల్ తండ్రి





**న్యూఢిల్లీ, అక్టోబర్16 (జనంసాక్షి) :** ఈ ఏడాది జూన్‌లో అహ్మదాబాద్‌లో చోటుచేసుకున్న ఘోర విమాన ప్రమాదం ఘటనలో 260 మంది మృతి చెందారు. ప్రధాన పైలట్ కెప్టెన్ సుమిత్ సభర్వాల్, కో–పైలట్ క్లైవ్ కుందర్ కూడా మరణించిన వారిలో ఉన్నారు. తాజాగా ఈ కేసులో న్యాయస్థానం పర్యవేక్షణలో దర్యాప్తు కోరుతూ.. సుమిత్ సభర్వాల్ తండ్రి పుష్కరాజ్ సభర్వాల్ సుప్రీం కోర్టును ఆశ్రయించారు. భారత పైలట్ల సమాఖ్య సైతం ఈమేరకు పిటిషన్ దాఖలు చేసింది. పైలట్‌గా సభర్వాల్‌కు విస్తృత అనుభవం ఉందని, 30 ఏళ్ల కెరీర్‌లో ఒక్క మచ్చ కూడా లేదని ప్రస్తావించారు. ఈ నేపథ్యంలో సుప్రీం కోర్టు విశ్రాంత జడ్జి నేతృత్వంలో.. స్వతంత్ర నిపుణుల కమిటీతో న్యాయ పర్యవేక్షణలో దర్యాప్తు చేయించాలని డిమాండ్ చేశారు. జూన్ 12న అహ్మదాబాద్ నుంచి లండన్ బయల్దేరిన ఎయిరిండియా విమానం టేకాఫ్ అయిన వెంటనే కూలిపోయింది. ఈ ప్రమాదంపై ఏఏఐబీ జులైలో తన ప్రాథమిక నివేదికను విడుదల చేసింది. రెండు ఇంజిన్లకు ఇంధన సరఫరా నిలిచిపోవడంవల్లే విమానం కూలిపోయిందని పేర్కొంది. ఇంధన సరఫరాను ఎందుకు ఆపావని ఒక పైలట్ ప్రశ్నించగా.. తాను ఆపలేదని మరో పైలట్ సమాధానమివ్వడం కాక్‌పిట్ వాయిస్ రికార్డర్‌లో నమోదైందని తెలిపింది. ఇదికాస్త పైలట్ల లోపం ఉందనే ఊహాగానాలకు దారితీసింది. ఈ నివేదికను పైలట్ సంఘాలు తీవ్రంగా విమర్శించాయి. పైలట్లపై నిందలు దురదృష్ట కరమని సుప్రీం కోర్టు సైతం వ్యాఖ్యానించింది. ఇప్పుడు దర్యాప్తుపై పైలట్ తండ్రి సుప్రీం గడప తొక్కారు. ఎయిరిండియా విమాన ప్రమాదంపై ప్రాథమిక దర్యాప్తు లోపభూయిష్టంగా ఉందని పిటిషనర్లు విమర్శించారు. దర్యాప్తు బృందం ప్రధానంగా పైలట్లపైనే దృష్టి సారించిందని ఆరోపించారు. ఈ విషాదానికి దారితీసిన సాంకేతిక, విధానపరమైన అంశాలను పరిశీలించడంలో విఫలమైందన్నారు. నివేదికలోని ఎంపిక చేసిన భాగాలను బహిర్గతం చేయడం ద్వారా వాస్తవాలను తప్పుదోవ పట్టించడం.. ముఖ్యంగా పైలట్లను లక్ష్యంగా చేసుకోవడం వంటివి అసలైన కారణాలను గుర్తించడాన్ని కష్టతరం చేస్తాయని పిటిషనర్లు పేర్కొన్నారు. 'విమాన ప్రమాదాల దర్యాప్తు బ్యూరో' నియంత్రణలోని దర్యాప్తు బృందం కూర్పునూ ప్రశ్నించారు. ఇందులో డీజీసీఏ, విమానయాన అధికారులే ఉన్నారని చెప్పారు. ఏ వ్యక్తి కూడా తన సొంత కేసులో న్యాయమూర్తిగా ఉండకూడదనే సహజ న్యాయ సూత్రాన్ని ఇది ఉల్లంఘిస్తోందన్నారు.

# సురేఖ ఓఎస్డీ గురించి తెలియదు

- తన కుమార్తె ఏం మాట్లాడిందో కూడా తెలియదు
- కాంగ్రెస్ నేత కొండా మురళి



**హనుమకొండ, అక్టోబర్16 (జనంసాక్షి) :** మంత్రి కొండా సురేఖ మాజీ ఓఎస్డీ సుమంత్ విషయం తనకేమీ తెలియదని ఆమె భర్త, కాంగ్రెస్ నేత కొండా మురళి అన్నారు. తన కుమార్తె సుస్మిత హైదరాబాద్‌లో ఏం మాట్లాడిందో తెలియదన్నారు. స్మార్ట్ ఫోన్ చూడటం తనకు రాదని చెప్పారు. సిమెంట్ కంపెనీ యాజమాన్యాలను సుమంత్ బెదిరించినట్లు వచ్చిన ఆరోపణల నేపథ్యంలో ఆయన్ను ఓఎస్డీ బాధ్యతల నుంచి ప్రభుత్వం తొలగించిన విషయం తెలిసిందే. ఇదే క్రమంలో బుధవారం రాత్రి హైదరాబాద్‌లో మంత్రి కొండా సురేఖ ఇంటి వద్దకు సుమంత్ కోసం పోలీసులు రావడం.. మంత్రి కుమార్తె సుస్మిత అడ్డుకోవడం తదితర పరిణామాల నేపథ్యంలో హనుమకొండలో కొండా మురళి మీడియాతో మాట్లాడారు. నా కుమార్తె, అల్లుడు లండన్‌లో ఉన్నారు.. అక్కడ వ్యాపారం చేస్తున్నారు. నా బిడ్డకు పదవి ఏమీ లేదు.. ఆమె ఏ పార్టీలోనూ లేదు. మంత్రి ఛాంబర్‌కు ఇప్పటివరకు నేను వెళ్లలేదు. భద్రతా కారణాల వల్ల వేర్వేరు కార్లలో నేను, సురేఖ వెళ్తాం. సీఎం రేవంత్‌రెడ్డి నాకు ఎమ్మెల్సీ ఇస్తామన్నారు.. ఇస్తారు. ఆయన సీఎం కావాలని కోరుకున్న వారిలో నేనూ ఒకడిని. సీఎం, మంత్రి పొంగులేటి మా ఇంటికి వచ్చారు.. నన్నెందుకు టార్గెట్ చేస్తారని కొండా మురళి వ్యాఖ్యానించారు.

# సూపర్ జీఎస్టీ.. సూపర్ సేవింగ్స్ ప్రారంభం మాత్రమే

- 21వ శతాబ్దం మోడీదే అవుతుందనడంలో సందేహం లేదు
- మోడీలాంటి నేత ఉండడం మన అదృష్టం
- కర్నూలు సభలో సిఎం చంద్రబాబు ప్రశంసలు



**కర్నూలు, అక్టోబరు 16 (జనంసాక్షి) :** సూపర్ జీఎస్టీ ..సూపర్ సేవింగ్స్ ఇది ప్రారంభం మాత్రమే అని ఏపీ సిఎం చంద్రబాబు అన్నారు. కర్నూలులో 'సూపర్ జీఎస్టీ–సూపర్ సేవింగ్స్' పేరుతో నిర్వహించిన భారీ బహిరంగ సభలో ప్రధాని నరేంద్ర మోడీ, గవర్నర్ అబ్దుల్ నజీర్, సిఎం చంద్రబాబు, డిప్యూటీ సిఎం పవన్ కల్యాణ్, నారా లోకేష్ సహా పలువురు కేంద్ర, రాష్ట్ర మంత్రులు, ఇతర నేతలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా సిఎం మాట్లాడుతూ.. జీఎస్టీ సంస్కరణల వల్ల ప్రజలందరూ ప్రయోజనం పొందుతున్నారు. మీరు జీఎస్టీ 2.0తో లబ్ధి పొందుతున్నారా? లేదా? అని సభకు హాజరైన ప్రజలను చంద్రబాబు అడిగారు. లబ్ధిపొందినవారు చప్పట్లు కొట్టాలంటూ వారిలో ఉత్సాహాన్ని నింపారు. సూపర్ సేవింగ్స్ అనేది ప్రారంభం మాత్రమే.. రాబోయే రోజుల్లో మరిన్ని అవకాశాలు ఉంటాయి. 25 సంవత్సరాలుగా నరేంద్ర మోడీ.. సీఎంగా, పీఎంగా ప్రజా సేవలో ఉన్నారు. 21వ శతాబ్దం మోడీదే అవుతుందనడంలో సందేహం లేదు. సరైన సమయంలో దేశానికి సరైన నాయకుడిగా ప్రధాని ఉన్నారని ప్రశంసలు కురిపించారు. ఇలాంటి నాయకుడు ఉండటం దేశం అదృష్టంగా అభివర్ణించారు. చాలా మంది ప్రధానమంత్రులతో నేను కలిసి పనిచేశాను. కానీ, నరేంద్ర మోడీ లాంటి నాయకుడిని నేను చూడలేదని.. ఆయన విశ్రాంతి లేకుండా నిరంతరం పనిచేస్తూనే ఉన్నారని చంద్రబాబు పేర్కొన్నారు. ఇక, 2047 నాటికి భారతదేశం ప్రపంచంలో అగ్రస్థానంలో ఉంటుందని తెలిపారు చంద్రబాబు అన్నారు. మరోవైపు.. ఆపరేషన్ సిందూర్ ప్రపంచానికి మన సైనిక బలాన్ని నిరూపించింది. మాటలతో కాదు.. చేతలతో చూపించే వ్యక్తి ప్రధాని నరేంద్ర మోడీ అన్నారు. జీఎస్టీ తగ్గింపుతో ప్రతి కుటుంబానికి ఏడాదికి రూ.10 వేలు ఆదా అవుతుందని వెల్లడించారు. సరైన సమయంలో ప్రధాని మోడీ.. దేశానికి సరైన నాయకుడిగా ఉన్నారని ప్రశంసలు కురిపించిన ఆయన.. ఇలాంటి నాయకుడు ఉండటం దేశం అదృష్టంగా అభివర్ణించారు.. చాలా మంది ప్రధానమంత్రులతో కలిసి పనిచేశారు.. కానీ, నరేంద్ర మోడీ లాంటి నాయకుడిని నేను చూడలేదని.. ఆయన విశ్రాంతి లేకుండా నిరంతరం పనిచేస్తూనే ఉన్నారని పేర్కొన్నారు చంద్రబాబు.. ఇక, 2047 నాటికి భారతదేశం ప్రపంచంలో అగ్రస్థానంలో ఉంటుందని తెలిపారు ఏపీ సీఎం చంద్రబాబు.. నరేంద్ర మోడీ దృఢ సంకల్పంతో మనం 11వ స్థానం నుండి నాల్గో స్థానానికి ఎదిగామన్నారు.. మరోవైపు.. ఆపరేషన్ సిందూర్ మన సైనిక బలాన్ని నిరూపించింది.. మాటలతో కాదు.. చేతలతో చూపించే వ్యక్తి ప్రధాని నరేంద్ర మోడీ అన్నారు..

## రైల్లో ప్రయాణికురాలిపై
# లైంగికదాడి

- దుండగుడిని అరెస్ట్ చేసిన పోలీసులు

**గుంటూరు, అక్టోబర్16 (జనంసాక్షి) :** రైల్లో ప్రయాణికురాలిపై అత్యాచారం చేసిన నిందితుడిని రైల్వే పోలీసులు అరెస్టు చేశారు. రెండు రోజుల క్రితం గుంటూరు స్టేషన్‌కు చేరుకున్న సంత్రగాచి స్పెషల్ రైలులోని మహిళా బోగీలో ఈ ఘటన చోటు చేసుకుంది. దీనిపై కేసు నమోదు చేసిన పోలీసులు.. సీసీ కెమెరాల సాయంతో నిందితుడిని గుర్తించారు. తెనాలి స్టేషన్‌లో గుంటూరు రైల్వే పోలీసులు నిందితుడిని పట్టుకున్నారు. ఓ మహిళ సోమవారం రాజమహేంద్రవరం రైల్వే స్టేషన్‌లో సంత్రగాచి స్పెషల్ రైలు మహిళా బోగీలో ఎక్కారు. గుంటూరు వచ్చేసరికి ఆ భోగీలో ప్రయాణికులు ఎవరూ లేరు. ఆమె మాత్రమే మిగిలారు. రన్నింగ్ ట్రైన్‌లో మహిళ భోగికి ప్రవేశించాడు. కొద్దిసేపటికే తలుపు మూసివేసి ఆమెను కత్తితో బెదిరించాడు. ఆమె వద్ద ఉన్న రూ.5,600, సెల్‌ఫోన్, హ్యాండ్‌బ్యాగును లాక్కొని దాడి చేసి అత్యాచారానికి పాల్పడ్డాడు. పెదకూరపాడులో ఫలకనామ ఎక్స్‌ప్రెస్ క్రాసింగ్ కోసం రైలును నిలిపివేశారు. అదే అదునుగా పెదకూరపాడు రైల్వే స్టేషన్ దిగి పారిపోయాడు. మంగళవారం రైలు చర్లపల్లి స్టేషన్‌కు చేరుకున్న అనంతరం బాధితురాలు సికింద్రాబాద్ జీఆర్పీ పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసి నడికుడి జీఆర్పీ పోలీసులకు బదిలీ చేశారు. దీంతో రంగంలోకి దిగిన పోలీసులు దర్యాప్తు చేపట్టి నిందితుడుని పట్టుకున్నారు.

Printed, Published and Owned by M.M.RAHMAN Printed at M/s. Manair Enterprises, Plot No. 16E/4, IDA, Kattedan, Ranga Reddy Dist, Telangana - 500077, Published at #119&120, 1st Floor, Down Town Mall, Lakdikapul, Hyderabad, Telangana-500004. Editor : M.M.RAHMAN RNINo. APTEL/2013/50370